thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 256 | కరీంనగర్ ఆదివారం, 23 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.




హైదరాబాద్ : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు.

50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి.

## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన 37 మంది మావోయిస్టులు

హైదరాబాద్, నవంబర్ 22: మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ-3 రైఫిల్స్, AK 47లు, SLRలు, భారీగా బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన కారణంగానే మావోయిస్టులు బయటికి వచ్చారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు.



మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

## ఇది మంచి పరిణామం: డిప్యూటీ సీఎం భట్టి

ఖమ్మం, నవంబర్ 22: వైరాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయటం మంచి పరిణామమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం నాడు వైరా నియోజకవర్గ కేంద్రంలో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ మోడల్ స్కూల్, వైరా నియోజకవర్గంలో రూ. 21 కోట్ల వ్యయంతో నిర్మించబోయే 7 సబ్ స్టేషన్ల నిర్మాణానికి ఉపముఖ్యమంత్రి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 200 శాతం చార్జీలు పెంచింది తమ ప్రభుత్వమే అని చెప్పుకొచ్చారు. బడుగు బలహీన వర్గాలకు ఉన్నత విద్య ద్వారానే



వారు ఉన్నత స్థానానికి చేరుతారన్నారు. గత పది సంవత్సరాలు పరిపాలించిన బీఆర్ఎస్ పార్టీ డ్వాక్రా మహిళలను మోసం చేసిందని విమర్శించారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలను ఇచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో రూ.590 కోట్లు వెచ్చించి నిరుపేదలకు రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యాన్ని అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించింది తామే అన్నారు.

తాను పుట్టిన ఈ నేలను తప్పనిసరిగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేశానని తెలిపారు. గతంలో వైరా రిజర్వాయర్ రైతుల కోసం నీటిని వదిలే విషయంలో జైలుకి కూడా వెళ్లినట్లు గుర్తుచేశారు. ఈ ప్రభుత్వం రైతులకు అంకితమని.. దోపిడీదారులకు, దొంగలకు కాదన్నారు. ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిచే విధంగా తీసుకెళ్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## ఉప ఎన్నికలు వస్తే.. మళ్లీ పోటీ చేస్తా: కడియం శ్రీహరి

హనుమకొండ: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఈ నెల 23వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చినట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈ నోటీసులపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తానని వెల్లడించారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. "నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నాను. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. కడియం శ్రీహరి భయపడడు. ఉప ఎన్నికలు వచ్చిన పక్షంలో కచ్చితంగా మళ్లీ పోటీ చేస్తా. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం నాకు ఉంది" అని కడియం అన్నారు.



చురకలు





హైదరాబాద్,నవంబరు 22 : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చకు రేవంత్ సర్కార్ తెర దింపింది. తాజాగా ఇందుకు సంబంధించిన జీవోను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. ఈ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు 50 శాతం మించకుండా మార్గదర్శకాలు జారీ చేసింది. రిజర్వేషన్ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జీవో విడుదల చేసింది. పంచాయతీరాజ్ జీవో ప్రకారం రిజర్వేషన్లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్సీ , ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జీవో ప్రకారం బీసీలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి.




## ఏసీబీ తుది నివేదిక.. కీలక అంశాలివే..

హైదరాబాద్, నవంబరు 22 : ఫార్ములా–ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి ఏసీబీ అధికారులు తుది నివేదికను సిద్ధం చేశారు. ఈ నివేదికలో కీలక అంశాలను ప్రస్తావించారు. ఏ1 మాజీ మంత్రి కేటీఆర్, ఏ2 ఐఏఎస్ అధికారి అరవింద్, ఏ3 BLN రెడ్డి, ఏ4, ఏ5లుగా FEO ప్రతినిధులను తుది నివేదికలో ప్రస్తావించారు. ఫార్ములా–ఈ కార్ రేస్ నిర్వహించాలన్నది కేటీఆర్ సొంత నిర్ణయమని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ అనుమతులు లేకుండానే రేస్ నిర్వహించడంతో క్విడ్ ప్రో కో జరిగిందని వివరించారు. బీఆర్ఎస్‌కి రూ.44 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లు అందాయని తుది నివేదికలో పేర్కొన్నారు. ట్రైపార్టీ అగ్రిమెంట్‌కు ముందే బీఆర్ఎస్‌కి ఈ–బాండ్లు చెల్లించారని తెలిపారు. ఫార్ములా–ఈ కార్ రేస్‌కు సంబంధించిన అనుమతులకు రాష్ట్ర గవర్నర్ సంతకం లేకుండానే ఐఏఎస్ అధికారి అరవింద్ రెండు అగ్రిమెంట్లు చేశారని స్పష్టం చేశారు. ఎంఏయూడీ నుంచి ఎలాంటి అనుమతులు పొందలేదని.. సీఎం, సీఎస్, ఆర్థిక మంత్రికి ముందస్తు సమాచారం ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. దీంతో పాటుగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎన్నికల కోడ్ ఉన్న కూడా చెల్లింపులు, అగ్రిమెంట్లు చేసి ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని తెలిపారు. ట్రైపార్టీ అగ్రిమెంట్‌లో లేకపోయినా.. సీజన్–9 కోసం రూ.20కోట్లు ఖర్చు చేశారని ఏసీబీ అధికారులు నివేదికలో ప్రస్తావించారు. ట్రైపార్టీ అగ్రిమెంట్‌లో హెచ్ఎండీఏ లేకపోయినా %ఖీజూ%కు రూ.46కోట్లు చెల్లించాలని.. ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్, %దీూచీ% రెడ్డి బిల్ పాస్ చేశారని తెలిపారు. సీజన్–10 కోసం హెచ్ఎండీఏ నుంచి రూ.54.88కోట్లు చెల్లించారని చెప్పుకొచ్చారు. ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించినందుకు హెచ్ఎండీఏపై అదనంగా రూ.8కోట్ల భారం పడిందని తెలిపారు. 2023 అక్టోబర్ 30వ తేదీన చేసుకున్న సెకండ్ అగ్రిమెంట్ కారణంగా.. సీజన్–10, 11, 12లతో కలిపి ప్రభుత్వంపై రూ.600కోట్లు భారం పడుతుందని వివరించారు. హెచ్ఎండీఏ లేకుంటే ఈ బాధ్యత Ace NXT Genపై పడేదని తెలిపారు.

నిల్సన్ రిపోర్ట్ చూపిస్తూ రూ.700కోట్ల పెట్టుబడులు వచ్చాయని కేటీఆర్ అబద్ధాలు చెప్పారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వానికి రూ.700కోట్లు లాభం వచ్చినట్లు ఏ రిపోర్ట్‌లో లేదని స్పష్టం చేశారు. ఈ కేసులో దర్యాప్తునకు నిల్సన్ సహకరించలేదని తుది నివేదికలో ఉంది. అయితే, ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ కేసులో కేటీఆర్‌ని విచారించడానికి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. గవర్నర్ అనుమతి ఇవ్వడంతో ఏసీబీ అధికారులు ఈ కేసులో దూకుడు పెంచారు.

## తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయిన 37 మంది మావోయిస్టులు

హైదరాబాద్, నవంబర్ 22: మావోయిస్టు పార్టీకి మరో భారీ షాక్ తగిలింది. తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో 25 మంది మహిళా మావోలు ఉండగా.. 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో మావోయిస్టు కేంద్ర, రాష్ట్ర కమిటీ సభ్యులు వంటి పలువురు అగ్రనేతలు ఉన్నారు. లొంగుబాటు సందర్భంగా మావోయిస్టుల నుంచి పోలీసులు భారీగా ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. 303 రైఫిల్స్, జీ–3 రైఫిల్స్, AK 47లు, SLRలు, భారీగా బుల్లెట్స్ స్వాధీనం చేసుకున్నారు పోలీసులు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటన కారణంగానే మావోయిస్టులు బయటికి వచ్చారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి చెప్పారు. మావోల లొంగుబాటు సందర్భంగా ఆయన పలు అంశాలు వివరించారు. ఏ రకంగా బయటికి వచ్చినా.. మావోయిస్టులను అన్ని విధాలుగా ప్రభుత్వం చూసుకుంటుందని డీజీపీ అన్నారు. మీడియా ద్వారా వచ్చినా, ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా వచ్చినా, రాజకీయ నాయకుల ద్వారా వచ్చినా తాము స్వాగతిస్తామని డీజీపీ పేర్కొన్నారు. మావోయిస్టులు పార్టీ పరంగా విబేధాలు, ఆరోగ్య కారణాలు, ఇలా అనేక కారణాలతో బయటికి వస్తున్నారని డీజీపీ తెలిపారు. 'తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా ఉన్న ఆజాద్ 30 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నాడు. ములుగు జిల్లాకు చెందిన ఆజాద్ మీద రూ.20లక్షల రివార్డ్ ఉంది. అప్పాసి నారాయణ మీద రూ.20లక్షలు రివార్డ్ ఉంది. మిగతా వారికి రూ.25 వేలు చొప్పున ఇస్తున్నామని డీజీపీ తెలిపారు. 11 నెలల్లో 465మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 59మంది తెలంగాణకు చెందిన వారని డీజీపీ వెల్లడించారు.

## సైబర్ నేరాలపై అవగాహన, అప్రమత్తత ఉండాల్సిందే: సీపీ సజ్జనార్



హైదరాబాద్ : సైబర్ నేరాలను అడ్డుకునేందు కు సరికొత్త కార్యక్రమానికి హైదరాబాద్ సీపీ సజ్జనార్ శ్రీకారం చుట్టారు. చార్మినార్ వద్ద నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీ మీడియాతో మాట్లాడుతూ.. చారిత్రా త్మక చార్మినార్ వద్ద ప్రతి శని, మంగళవారం గడపగడపకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. చార్మినార్ వద్ద ఇవాళ సైబర్ క్రైమ్‌పై అవేర్‌నెస్ కార్యక్రమం ఏర్పాటు చేసి అవగాహన కల్పించే ప్రయత్నం చేశామన్నారు. అవగాహన లేక చాలామంది సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. ఒక్క హైదరాబాద్‌లోనే ప్రతి రోజు కోటి రూపాయలు సైబర్ నేరాల్లో పోగొట్టుకుంటున్నారని వెల్లడించారు. ఓటీపీ ఇన్వెస్ట్‌మెంట్, డిజిటల్ అరెస్ట్ అంటూ సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అవగాహన, అప్రమత్తత కలిగి ఉండాలని సూచించారు. సైబర్ నేరస్తులు కాల్ చేసి బెదిరిస్తే భయపడవద్దన్నారు. భయపడితే అది సైబర్ నేరస్తుల బలం అవుతుందని చెప్పుకొచ్చారు. ప్రైవేట్ ఫోటోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేయవద్దని.. అలా చేస్తే మిమ్మల్ని ట్రాప్ చేసి మోసం చేసే అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాల బారిన పడితే వెంటనే 1930 కి కాల్ చేయాలని సూచించారు. సైబర్ సింబా పేరిట వాలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చామని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీపీ సజ్జనార్ పిలుపునిచ్చారు.




ఓదెల: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం గుంపుల గ్రామం వద్ద మానేరు వాగుపై ఉన్న చెక్ డ్యామ్‌ను దుండగులు కూల్చివేశారు. దీంతో నీరు దిగువకు వెళ్తోంది. శుక్రవారం రాత్రి దుండగులు చెక్‌డ్యామ్‌ను కూల్చివేసినట్లు అధికారులు భావిస్తున్నారు. ఘటనాస్థలికి చేరుకుని నీటిపారుదల శాఖ అధికారులు పరిశీలించారు. వాగులోని ఇసుకను అక్రమ రవాణా చేసేందుకే దుండగులు ఈ పనికి ఒడిగట్టారని అనుమానిస్తున్నారు. ఈ ఘటనలో చెక్ డ్యామ్‌కు చెందిన 3 ప్యానళ్లు ధ్వంసం అయినట్లు అధికారులు వెల్లడించారు. ఇటీవల రూ.23 కోట్లకుపైగా నిధులతో ఈ చెక్ డ్యామ్ నిర్మాణం చేపట్టారు.




హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసన సభ వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబును కలిశారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. అనంతరం ఆయన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసే అవకాశం ఉంది. స్పీకర్ ఇచ్చిన అనర్హత నోటీసుకు సమాధానం ఇచ్చేందుకు మరికొంత సమయం కోరనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విషయంపై ఏఐసీసీ పెద్దలతో దానం సంప్రదింపులు చేశారు. ఎమ్మెల్యేగా రాజీనామా, ఇతర అంశాలపై చర్చించినట్లు సమాచారం. తాను రాజీనామా చేస్తే.. తిరిగి తనకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరినట్లు తెలుస్తోంది. అనర్హత వేటు వేసేందుకు అవకాశం ఉంటే రాజీనామా చేస్తానని సన్నిహితులకు దానం చెప్పినట్లు సమాచారం. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదులకు సమాధానాలు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరిలకు శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మరోసారి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 23వ తేదీలోగా సమాధానాలను అఫిడవిట్ రూపంలో స్పీకర్ కార్యాలయంలో అందజేయాలని వాటిలో సూచించారు.

## ఉప ఎన్నికలు వస్తే.. మళ్లీ పోటీ చేస్తా: కడియం శ్రీహరి



హనుమకొండ: ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై ఈ నెల 23వ తేదీలోపు సమాధానం ఇవ్వాలని స్పీకర్ నోటీసు ఇచ్చినట్లు ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈ నోటీసులపై మరింత సమయం కావాలని స్పీకర్‌ను కోరినట్లు పేర్కొన్నారు.

దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. స్పీకర్ ఇచ్చిన సమయంలోగా వివరణ ఇస్తానని వెల్లడించారు. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెప్పారు. "నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తున్నాను. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి పెద్దఎత్తున అభివృద్ధి ఫలాలు అందుతున్నాయి. ప్రతి గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాను. కడియం శ్రీహరి భయపడడు. ఉప ఎన్నికలు వచ్చిన పక్షంలో కచ్చితంగా మళ్లీ పోటీ చేస్తా. ప్రజలు ఆశీర్వదిస్తారన్న నమ్మకం నాకు ఉంది" అని కడియం అన్నారు.




హైదరాబాద్ నవంబర్ 22 : ఐ బొమ్మ రవి కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులోకి తెలంగాణ సీఐడీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. ఈ క్రమంలో ఐబొమ్మ రవి వివరాలను సేకరించే పనిలో పడ్డారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వైబ్‌సైటులను ఐబొమ్మలో రవి ప్రమోట్ చేశాడు. అతనికి సంబంధించిన మరింత వివరాల కోసం సైబర్ క్రైమ్ పోలీసులను సీఐడీ అధికారులు కోరారు. ఇదిలా ఉండగా.. బెట్టింగ్ ప్రమోషన్ కేసులను కూడా సీఐడీ అధికారులు దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే.

**మూడో రోజు కస్టడీలోకి రవి..** కాగా, హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రవిని గత రెండు రోజులుగా కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. రెండో రోజు కస్టడీలో భాగంగా ఆరు గంటలకు పైగా విచారించారు. ఈ విచారణలో కీలక అంశాలు రాబట్టినట్లు తెలుస్తోంది. ఇవాళ మూడో రోజు కూడా రవిని విచారించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఐబొమ్మ రవికి సినిమాలు సప్లై చేస్తున్న, సహకరిస్తున్న వారి వివరాలను సేకరిస్తున్నారు. ఏజెంట్లు, గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో రవికి ఉన్న లింకులపై ఆరా తీస్తున్నారు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు. అయితే ఈ కేసులోకి ఇప్పుడు తెలంగాణ సీఐడీ అధికారులు ప్రవేశించడంతో మరింత సమగ్రంగా విచారించే అవకాశాలు ఉన్నాయి.




దేశంలోకి అక్రమంగా ఆయుధాలు తరలిస్తున్న భారీ స్మగ్లింగ్ రాకెట్‌ను దిల్లీ పోలీసులు ఛేదించారు. పాక్ నుంచి డ్రోన్‌ల సాయంతో వీటిని దేశంలోకి తీసుకొస్తున్న ముఠాను పట్టుకున్నారు. పాక్ ఐఎస్ఐతో ప్రత్యక్ష సంబంధాలున్న వీరి నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం ఈ ఆపరేషన్ చేపట్టింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్లీలో కొంతమంది భారీగా అక్రమ ఆయుధాలు తరలిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి క్రైమ్ బ్రాంచ్‌కు సమాచారం అందించింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు పలు ప్రాంతాల్లో నిఘా ఉంచగా.. రోహిణిలో ఈ ఆయుధ మాడ్యూల్ గుట్టు బయటపడింది. నిందితులు డ్రోన్‌లను ఉపయోగించి పాకిస్థాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. పంజాబ్ సరిహద్దుల నుంచి తీసుకొచ్చిన ఈ ఆయుధాలను లారెన్స్ బిష్ణోయ్, బాంబిహా, గోగి వంటి గ్యాంగ్ సభ్యులకు ఇవ్వాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. నిందితుల నుంచి విదేశాల్లో తయారైన 10 అత్యాధునిక సెమీ ఆటోమెటిక్ పిస్టల్స్‌తో పాటు 92 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. లభ్యమైన ఆయుధాలు తుర్కియే, చైనాలో తయారైనవిగా తెలిపారు. ఈ మాడ్యూల్‌కు చెందిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెట్‌వర్క్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఆయుధాలను ఎవరికి విక్రయించారు, నెట్‌వర్క్‌లో ఇంకా ఎంతమంది ఉన్నారనే వివరాలు తెలుసుకునేందుకు అధికారులు కూపీలాగుతున్నారు. నిందితులకు చెందిన మొబైల్ ఫోన్లు, బ్యాంకు లావాదేవీలను పరిశీలిస్తున్నారు. దిల్లీలో ఎర్రకోట వద్ద బాంబు పేలుడుపై దర్యాప్తు కొనసాగుతోన్న క్రమంలో ఈ రాకెట్ గురించి బయటపడటం గమనార్హం.

thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08


చురకలు
సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 256 | కరీంనగర్ ఆదివారం, 23 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.

# పెన్నే కదా అని మన్ను కప్పితే గన్ అయి.. గడీలను కూల్చింది




## అందెశ్రీ సంతాప సభలో సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులు కీలక పాత్ర పోషించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన అందెశ్రీ సంతాప సభలో సీఎం ప్రసంగించారు. "ఉద్యమానికి కవులు, కళాకారులు ఇచ్చిన ఊపుతోనే తెలంగాణ సాకారమైంది. ఎన్నడూ బడికి వెళ్లని అందెశ్రీ అద్భుతమైన జయజయహే తెలంగాణ పాట రాశారు. అందెశ్రీ పాట లేకుండా తెలంగాణ ఉద్యమంలో ఒక్క సభ కూడా జరగలేదు. కానీ, తెలంగాణ సాకారమైన తర్వాత ఆ పాట మూగబోయింది. పాలకుల దృష్టిలో పదేళ్లు మూగబోయి ఉండొచ్చు కానీ.. తెలంగాణ ప్రజల గుండెల్లో నిత్యం గానమై నిలిచింది. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వారిని కనుమరుగు చేసే ప్రయత్నం జరిగింది. కవి రాసే పెన్నుల మీద మన్ను కప్పితే.. అవి గన్నులై మొలకెత్తుతాయ్.. మీ గడీలను కుప్పకూలుస్తాయ్ అన్న నినాదాన్ని అందెశ్రీ నిజం చేశారు. ప్రజలు కోరుకున్న జయ జయహే తెలంగాణను.. రాష్ట్ర గీతంగా ప్రకటించడమే కాకుండా.. ప్రతి బడిలో పాడాలి, పాఠ్య పుస్తకాల్లో రాయాలని ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రజలు ఎంత అమాయకంగా కనిపిస్తారో.. అంత చైతన్యవంతులు. ఈ గడ్డ మీద ప్రజలు అహంకారాన్ని, అధిపత్యాన్ని సహించలేరు. ఎన్ని వజ్రాలు ఉన్నా.. కోహినూరు వజ్రం ప్రత్యేకం. అలాగే ఎందరు కవులు ఉన్నా.. డా.అందెశ్రీ ప్రత్యేకం"అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ఆచార్య కోదండరాం, మాజీ ఎంపీ వి.హనుమంతరావు పలువురు కవులు, గాయకులు పాల్గొన్నారు.




## సత్యసాయి బోధనలు లక్షలాది మందికి మార్గం చూపాయి: ద్రౌపదీ ముర్ము

శ్రీ సత్యసాయి జిల్లా, నవంబరు 22 : పుట్టపర్తి సత్యసాయి బాబా బోధనలు లక్షలాది మందికి మార్గం చూపాయని భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వ్యాఖ్యానించారు. ఇవాళ(శనివారం) బాబా శత జయంతి ఉత్సవాల్లో ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యసాయి సమాధిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పుట్టపర్తికి వచ్చిన రాష్ట్రపతికి సీఎం, మంత్రులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పుట్టపర్తిలోని పూర్ణచంద్ర ఆడిటోరియంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ముర్ము పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము మాట్లాడారు. సత్యసాయి మహాసమాధిని దర్శించుకోవడం తన అదృష్టమని పేర్కొన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా సత్యసాయి జీవించారని కొనియాడారు. బాబా సందేశంతో కోట్లాదిమంది భక్తులు మానవ సేవ చేస్తున్నారని ప్రశంసించారు. సత్యసాయి ట్రస్టు ద్వారా ఎంతో మందికి వైద్య సేవలు అందించారని కీర్తించారు. ఈ ట్రస్టుకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నానని ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు.




# పొలిటికల్ హీట్!

# మరో ఉప ఎన్నిక ఖాయం!!

## ఇబ్బందికరంగా సికింద్రాబాద్ ఎంపీగా పోటీ - అనర్హత వేటుకు ముందే రాజీనామా యోచన?

## స్పీకరు కలిసి గడువు కోరనున్న ఎమ్మెల్యే - సోమవారం రిజైన్ చేస్తారని ప్రచారం

హైదరాబాద్ : ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ రాజీనామా చేస్తారని తెలుస్తోంది. పార్టీ ఫిరాయింపులకు పాల్పడినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న పది మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు పంపిన విషయం తెలిసిందే.

రెండో సారి కూడా నోటీసు అందుకున్న దానం నాగేందర్ ఇప్పటి వరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.నోటీసుల గడువు రేపటితో ముగియనుంది. రేపు ఆదివారం కావడంతో ఆయన కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్టు సమాచారం. కడియం శ్రీహరి నిన్ననే స్పీకర్ ను కలిసి మరింత సమయం కావాలని విజ్ఞప్తి చేశారు. దానం నాగేందర్ సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై పోటీ చేసినందున ఆయనపై అనర్హత వేటు పడే అవకాశం ఉందని న్యాయనిపుణులు చెబుతున్నారు. దీంతో అనర్హత వేటు పడకముందేతన శాసన సభ్యత్వానికి రాజీనామా చేయాలని యోచిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా ఇవాళ ఉదయం అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచార్యులుతో భేటీ అయ్యారు. ఈ క్రమంలో స్పీకర్ గడువు కోరి, ఆ తర్వాత రాజీనామా చేయాలని భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా నిన్న, మొన్నదానం నాగేందర్ ఢిల్లీలోనే ఉన్నారు. కాంగ్రెస్ పెద్దలతో భేటీ అయినట్టు సమాచారం.

తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపి స్తానని, పదవి వదులుకుంటున్నందుకు తనకు రాజ్యసభ సభ్యత్వం లేదా.. ఎమ్మెల్సీ పదవి ఇచ్చి కేబినెట్ హోదా కల్పించాలని కోరినట్టు ప్రచారం జరుగుతోంది. పీసీసీ చీఫ్, సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడిన తర్వాతే స్పష్టత ఇస్తా మని దానం నాగేందర్ కు చెప్పినట్టు తెలుస్తోంది. దీంతో హైదరాబాద్ చేరుకున్న దానం శ్రీధర్ బాబును కలిసినట్టు తెలుస్తోంది.

గడువు కోరి సోమవారం స్పీకర్ కు రాజీనామా పత్రం సమర్పిస్తారని సమాచారం. ఏది ఏమైనా హైదరాబాద్ నగరంలో మరో ఉప ఎన్నిక ఖాయంగా కనిపిస్తోంది. ఇదిలా ఉండగా ఖైరతాబాద్ ఉప ఎన్నిక కోసం అటు బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కూడా రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది.




# ఎదురు దెబ్బలతో...

# ఇక ఎవరి దారి వారిదేనా?

# ఇండియా కూటమిలో చిచ్చు...!

బీహార్ ఎన్నికలు కాదు కానీ ఇండియా కూటమిలో చిచ్చు రగులుకుంది. ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు అన్నీ ఈ దారుణమైన ఫలితాల మీద కస్సుబుస్సు మంటున్నాయి. తప్పు అంతా కాంగ్రెస్ మీదకు నెడుతున్నాయి. కాంగ్రెస్ ఒంటెద్దు పోకడలు, మిత్రులకు విలువ గౌరవం ఇవ్వకపోవడం కాంగ్రెస్ రాష్ట్ర శాఖల కర్ర పెత్తనంతో ప్రాంతీయ పార్టీలు బలి అయిపోతున్నాయని కూడా అంటున్నారు. కాంగ్రెస్ పెద్దన్న వైఖరి కారణంగా మిత్రులు నష్టపోతున్నారు అని ఇండియా కూటమిలో ఇతర పార్టీలు అంటున్నాయి.

ప్రాంతీయ పార్టీలకు విలువ ఇచ్చి జాతీయ స్థాయిలో కాంగ్రెస్ చూసుకోవాలని మొదటి నుంచి ఆప్ చెబుతూ వస్తోంది. అది కాంగ్రెస్ వినకపోవడం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వేరేగా పోటీ చేసి ఆప్ విజయావకాశాలను దెబ్బ కొట్టడంతో బీహార్ లో ఆప్ సొంతంగానే అభ్యర్థులను పెట్టి పోటీకి దిగింది.

**గరం గరం గా :** ఇక జార్ఖండ్ ముక్తీ మోర్చా బీహార్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంది. కాంగ్రెస్ వ్యవహార శైలి వల్లనే ఆ పార్టీ ఏకంగా ఎన్నికలకు దూరంగా ఉండిపోయింది. వీటికి మించి బీహార్ లో ఆర్జేడీ ఓటమికి కాంగ్రెస్ ప్రధాన కారణం అని ఆ పార్టీ నేతలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ రాష్ట్ర యూనిట్లు చేస్తున్న పెత్తనం గత్తకపోతే కూటమికే ముప్పు అని శివసేన ఇప్పటికే స్పష్టం చేసింది. బీహార్ ఎన్నికల ఫలితాలు వేకప్ కాల్ లాంటివి అన్ కూడా ఆ పార్టీ చెప్పుకొచ్చింది.

**అఖిలేష్ నాయకత్వం :** మరోవైపు బీహార్ ఎన్నికల ఫలితాల మీద సమాజ్ వాదీ పార్టీ కూడా తనదైన సైలిలో విశ్లేషణ చేసింది. బీహార్ ఎన్నికల ఫలితాల నుంచి పాఠాలు నేర్చుకోవాలని కోరింది. సరైన వ్యూహాలు లేవని పేర్కొంది. ప్రాంతీయ పార్టీలకు విలువ ఇవ్వాలని సూచించింది. ఇక ఎస్పీ నేతలు మరో అడుగు ముందుకేసి అఖిలేష్ యాదవ్ కి ఇండియా కూటమి పగ్గాలు అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.

**పునరాలోచన చేయాలి :** ఇక ఇండియా కూటమి వరస వైఫల్యాల నేపథ్యంలో అన్ని పరిస్థితులను కూడా పునరాలోచన చేసుకుని ముందుకు కదలాలని తమిళనాడు సీఎం డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ అన్నారు ముఖ్యంగా నాయకత్వం లోపాలను కూడా సవరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన పెద్ద మాటనే వాడారు. ఇవన్నీ చూస్తూంటే మిత్రులు అంతా గుర్రుగానే కాంగ్రెస్ మీద ఉన్నారని అంటున్నారు. వారు కాంగ్రెస్ ని పక్కన పెట్టి నాయకత్వం అందుకోవాలని చూస్తున్నారు. అలా కానీ జరగకపోతే ఎవరి దారి వారిది అన్నట్లుగా సొంత నిర్ణయం తీసుకోవాలని భావిస్తున్నారని అంటున్నారు.

**అలాంటిదేమీ లేదు :** అయితే బీహార్ ఎన్నికల ఫలితాల తరువాత ఇండియా కూటమిలో విభేదాలు అని మిత్రులు అంతా గుర్రు మీద ఉన్నారని వస్తున్న వార్తల పట్ల ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అయితే ఘాటుగానే స్పందించారు. ఇండియా కూటమిలో విభేదాలు లాంటివి ఏమీ లేవని ఆయన స్పష్టం చేశారు. తామంతా ఒక్కటిగానే ముందుకు సాగుతామని అన్నారు. అంతే కాదు ఇండియా కూటమిని మరింత బలోపేతం చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు. బీహార్ ఫలితాల తరువాత మరింతగా తాము సమీక్షించుకుని పటిష్టంగా మారేందుకు ఏమి చేయాలో అన్నీ చేస్తామని అన్నారు. మొత్తం మీద చూస్తూంటే ఇండియా కూటమి గతంలో ఎన్నడూ లేనంతగా కష్టాలలో ఉంది అని అంటున్నారు. చూడాలి మరి మిత్రుల మాట నెగ్గుతుందో లేక కాంగ్రెస్ తన నాయకత్వాన్ని గట్టిగా నిలబెట్టుకుంటుందో.

చురకలు

# సంపాదకీయం

## భారత్ పై పాక్ గెలించిందట.. ఈ అమెరికా రిపోర్ట్ చూశారా మోదీ జీ?

అమెరికాకు ఎంతైనా పాకిస్థాన్ అంటే మొదటినుంచి అభిమానమే..! అది ఎంత దుర్మార్గపు దేశమైనా సరే, పాక్ అంటే అమెరికా ఒక ఆకు ఎక్కువే వేస్తుంది. బహుశా భారత్ గతంలో రష్యా (యునైటెడ్ సోవియట్ సోషలిస్ట్ రష్యా- యూఎస్ఎస్ఆర్)తో సన్నిహితంగా ఉన్నందునే ఏమో... అమెరికా మనపట్ల అవసరం కొద్దీ అన్నట్లు ఉంటుంది. అయితే, సాఫ్ట్ వేర్ బూమ్, 25 ఏళ్ల కిందట నేరుగా ఉగ్రదాడుల (సెప్టెంబరు 11) బారిన పడడంతో దాని ఆలోచన కొంత మారింది. ఇప్పటికీ విధానపరంగా మాత్రం భారత్ కంటే పాకిస్థాన్ నే ఒకింత ఎక్కువగా సమర్థిస్తుంటుంది. ఇది అనేక సందర్భాల్లో రుజువైంది కూడా. తాజాగా ఆ దేశ సెనేట్ లో సమర్పించిన నివేదిక మరోసారి నిజం చేసింది. ఏప్రిల్ లో భారత్ లోని పెహల్గాంలో అమాయక పర్యటకులను పాక్ కు చెందిన ఉగ్రవాదులు దారుణంగా కాల్చిచంపారు. దీనికి ప్రతిగా మే నెలలో భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్ ఆక్రమిత కశ్మీర్ తో పాటు పాక్ లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. భారత దాడికి తట్టుకోలేక పాకిస్థాన్ బెంబేలెత్తింది. అసలే ఆర్థికంగా అధ్వాన పరిస్థితుల్లో ఉన్న పాక్.. భారత్ గనుక ఆపరేషన్ సిందూర్ ను తీవ్రం చేస్తే దివాళా తీసే పరిస్థితి. అందుకే కాళ్లబేరానికి వచ్చింది. వాస్తవ పరిస్థితి ఇది అయితే.. అమెరికా సెనేట్ లో సమర్పించిన నివేదిక మాత్రం పూర్తి భిన్నంగా ఉంది.

**అసత్య ప్రచారం..** భారత్ ఆపరేషన్ సిందూర్ లో విమానాలను కోల్పోయిందంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నోటికొచ్చినట్లు వాగారు. దీనిని భారత్ ఖండించింది కూడా. అయినా, మరోసారి అలాంటి తీరులోనే అమెరికా సెనేట్ లో నివేదిక ప్రవేశపెట్టారు. ఇందులో అసత్యాలు నివేదించింది. ఆపరేషన్ సిందూర్ కు పాకిస్థాన్ దీటుగా బదులిచ్చిందంటూ రాసుకొచ్చింది. నాలుగు రోజుల పాటు సాగిన ఆపరేషన్ సిందూర్ లో పాకిస్తాన్ సైన్యం విజయవంతం అయిందని పేర్కొంది.

**చైనాకు ప్రయోజనం..** భారత్ –పాక్ మధ్య సంఘర్షణను చైనా అనుకూలంగా మార్చుకుందని అమెరికా తెలిపింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ కు ఆయుధాలను చైనా సమకూర్చిందనే కథనాలు వచ్చాయి. ఈ కోణంలోనే తమ బద్ధ శత్రువు చైనా ప్రస్తావనను తెచ్చి ఉంటుందని భావించవచ్చు. కాగా, భారత్ – పాక్ ఉద్రిక్తతలపై ట్రంప్ వ్యాఖ్యలు గతంలో తీవ్ర వివాదాస్పదం అయిన సంగతి తెలిసిందే. వాటిని తానే నివారించానంటూ ట్రంప్ గొప్పలు పోయారు. భారత యుద్ధ విమానాలను పాకిస్థాన్ కూల్చివేసిందని కూడా తప్పుడు వ్యాఖ్యలు చేశారు. తాజాగా అమెరికా సెనేట్ లో ప్రవేశపెట్టిన నివేదిక కూడా ట్రంప్ ఆలోచనలకు దగ్గరగా ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలోనే ఆ రిపోర్టుపై కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ మండిపడ్డారు. ఇది మోదీ ప్రభుత్వ దౌత్య వైఫల్యానికి నిదర్శనం అంటూ నిప్పులు చెరిగారు.

**భారత్ ఏమని స్పందిస్తుందో..?...** అమెరికా చట్ట సభలో ప్రవేశపెట్టిన నివేదిక అంటే దానికి తగిన విలువ ఉన్నట్లే. ఒక దేశ యుద్ధ విజయాన్ని తారుమారు చేస్తూ ఇచ్చిన ఈ నివేదిక ఎలా రూపొందించారు? అన్నది తీవ్రంగా పరిగణించాల్సిన విషయం. కాగా, ఇప్పటికైతే భారత ప్రభుత్వం దీనిపై స్పందించలేదు. బహుశా ఇంకా పూర్తిస్థాయిలో పరిశీలనకు రాలేదేమో?

## జగమెరిగిన శాస్త్రవేత్త జగదీశ్ చంద్ర - నవంబర్ 23.. జగదీశ్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా

మన దేశ ఔన్నత్యాన్ని విదేశాలకు చాటి చెప్పిన మేటి శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్. రేడియో విజ్ఞానంలో పితామహునిగా పేర్కొంటారు. ఒక అసాధారణ వ్యక్తి. భౌతిక శాస్త్రవేత్తగా, జీవ శాస్త్రవేత్తగా, జీవ భౌతిక శాస్త్రవేత్తగా, వృక్ష శాస్త్రవేత్తగా, పురావస్తు శాస్త్రవేత్తగా జగద్విఖ్యాతి పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి, విజ్ఞాన%అ%ఖని బోస్. సైన్స్ ఫిక్షన్లను కూడా రచయిత కూడా. రేడియో, మైక్రోవేవ్ ఆప్టిక్స్ తో వృక్షశాస్త్రంలో గణనీయ ఫలితాల్ని సాధించిన బోస్ 1904లో అమెరికా నుంచి పేటెంట్ హక్కులు పొందిన తొలి శాస్త్రవేత్త, 1858 నవంబర్ 30న బెంగాల్ ప్రావిన్స్ (నేటి బంగ్లాదేశ్)లోని మున్సిగంజ్ లో 1858 నవంబర్ 30 న బంగ్లాదేశ్‌లోని మైమెన్‌సింగ్‌లో ప్రభుత్వంలో అసిస్టెంట్ కమిషనర్, బ్రహ్మ సమాజ్ సభ్యుడు భగవాన్ చంద్రబోస్‌కు ఆయన జన్మించాడు. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా పెరిగిన అతని తండ్రి ఇంగ్లీష్ నేర్చుకునే ముందు బెంగాలీ నేర్చుకోవాలని అనుకున్నాడు. అతను ఒక స్థానిక పాఠశాలలో చదివాడు, అక్కడ అతని క్లాస్‌మేట్స్ విభిన్న వర్గాలు మరియు మతాలకు చెందినవారు. అతను కలకత్తాలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో చేరాడు. అక్కడ జెస్యూట్ పూజారి ఫాదర్ యూజీన్ లాఫాంట్ ద్వారా సహజ శాస్త్రాలపై ఆసక్తిని పెంచు కున్నాడు. ప్రాథమిక విద్య సమయంలో బోస్ వద్ద - ముస్లిం నౌఖరు కుమారుడు కుడివైపున, మత్స్య కార్మికుని కుమారుడు ఎడమ వైపున కూర్చునే వారు. వారు చెప్పే పశు పక్ష్యాదుల కథలను బోస్ శ్రద్ధగా వినేవాడు. ప్రకృతిలోని జీవాలపై పరిశోధనాసక్తి కలగడానికి తన స్నేహితుల కథలే అంకురార్పణ చేశాయని ఆయన చెప్పేవారు. కలకత్తాలోని సెయింట్ జేవియర్ కళాశాల నుండి డిగ్రీ పూర్తి చేసి, వైద్య విద్య అభ్యసించేందుకు ఆయన లండన్ వెళ్లాడు. ఆరోగ్యం సహకరించని కారణంగా అక్కడ విద్యాభ్యాసం కొనసాగించలేక తిరిగి భారత దేశానికి చేరు కొ న్నారు. తర్వాత బోస్ ఇంగ్లాండ్‌లో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయాలని అనుకున్నాడు. కాని మనసు మార్చుకుని తన బావ ఆనందమోహన్ బోస్ సిఫార్సుపై కేంబ్రిడ్జ్‌లో నేచురల్ సైన్స్ చదివాడు. అక్కడ ఆయనకు ప్రముఖ ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్ డార్విన్, జేమ్స్ దేవర్ మరియు మైఖేల్ ఫోస్టర్ బోధించాడు. ఆయన ఇంగ్లాండ్‌లో ఉన్న సమయంలో, ప్రఫుల్లా చంద్రరేతో స్నేహం చేశాడు. తరువాత ఆయన రసాయన శాస్త్రవేత్తగా కీర్తిని పొందాడు. కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యునిగా చేరాడు. జాతి వివక్ష పరాకాష్ఠకు చేరిన ఆ విద్యాసంస్థలో తన ఉద్యోగంలో జాత్యహంకారాన్ని ఎదుర్కొన్నాడు, అయన జీతం బ్రిటిష్ సహచరుల కంటే చాలా తక్కువ. బోస్ మూడేళ్లపాటు జీతం తీసుకోకుండా బోధించడం ద్వారా నిరసన తెలుపుతూ, తగినన్ని సౌకర్యాలు ఆర్థిక సాయం అందకున్నప్పటికీ పట్టుదలతో పరిశోధనలను కొనసాగించాడు. తరువాత, కళాశాల ఆయన నియామకాన్ని శాశ్వతంగా రద్దు చేసింది. జీతం బకాయిలను చెల్లించింది. 1917 లో, కలకత్తాలో బోస్ ఇన్స్టిట్యూట్ను స్థాపించాడు. అక్కడ శాస్త్రవేత్తలు మొక్కలపై పరిశోధనలు జరిపారు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహక జంక్షన్లను మొట్టమొదటి సారిగా వాడిన బోస్ వైర్లెస్ సిగ్నలింగ్ పరిశోధనలో అత్యద్భుత ప్రగతిని సాధించగలిగాడు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహక జంక్షన్ లను మొట్టమొదటి సారిగా వాడింది బోసే. 1901 లో రాయల్ సొసైటీ ఆఫ్ లండన్‌లో బోస్ నిర్వహించిన ఒక ప్రసిద్ధ ప్రయోగం, మనుషుల మాదిరిగానే మొక్కలకు కూడా భావాలు ఉన్నాయని తేలింది. ఆయన ఒక మొక్కను బ్రోమైడ్ ద్రావణాన్ని కలిగి ఉన్న పాత్రలో ఉంచాడు, ఇది విషపూరిత మైనది. తన పరికరాన్ని ఉపయోగించి, మొక్క విషానికి ఎలా స్పందిస్తుందో తెరపై చూపించాడు. తెరపై వేగంగా, కదలికను చూడగా, అది చివరికి చనిపోయింది. ఒక జంతువును విషంలో ఉంచితే ఇలాంటిదే జరిగి ఉండేది. విషం కారణంగా మొక్క చనిపోయింది. బోస్ తన ఇన్స్ట్రుమెంట్ ను క్రెస్కోగ్రాఫ్ అని పిలిచాడు. మరిన్ని ప్రయోగాలు చేశాడు.



ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది శాస్త్రవేత్తలు ఆయన కనుగొన్న వాటిని ప్రశంసించారు. వ్యాపార దృష్టి ఏ మాత్రం లేని బోస్ తన పరిశోధనలను ఇతర శాస్త్రవేత్తలు వినియోగించుకుని, వాటి ఆధారంగా మరిన్ని కొత్త ఆవిష్కరణలు జరగాలనే సదుద్దేశంతో తన పరిశోధనలను బహిర్గత పరిచాడు. ప్రధానంగా తాను కను గొన్న క్రెస్కోగ్రాఫ్ సాయంతో వివిధ పరిస్థితులలో మొక్కల స్పందనను పరి శోధనాత్మకంగా నిరూపించాడు. జంతువుల, వృక్షాల కణజాలాలలో సమాంతర పరిశోధనలు చేసి ఉపయోగ కరమైన ఫలితాలు సాధించాడు. రేడియో తరంగాలను గుర్తించడానికి ఉపయోగించే కోహెరర్ అనే పరికరాన్ని మెరుగు పరిచాడు. 1887 లో, బ్రహ్మ సమాజ్ సంస్కర్త దుర్గా మోహన్ దాస్ కుమార్తె అబాలాను వివాహం చేసుకున్నాడు. 1896 లో, రేడియో తరంగాలపై పరిశోధన చేస్తున్న గుగ్లిఎల్మో మార్కోనిని కలిశాడు. జగదీష్ చంద్రబోస్ వైర్లెస్ టెలిగ్రాఫీని కనుగొన్నాడు. 1895 లో ప్రదర్శనను కూడా నిర్వహించాడు, కాని ఆయన పేటెంట్ కోసం దాఖలు చేయలేదు. మరోవైపు ఇటాలియన్ శాస్త్రవేత్త గుగ్లిఎల్మో మార్కోనీ 1897 లో బోస్ ప్రదర్శన తరువాత రెండు సంవత్సరాల అనంతరం ఇదే విధమైన ప్రదర్శన చేసాడు, కాని మార్కోని 1896 లో పేటెంట్ కోసం దాఖలు చేశాడు. కాబట్టి, బోస్ ఈ రంగంలో మార్గదర్శక పని చేసినప్పటికీ, మార్కోనీ ఈ ఆవిష్కరణకు ఘనత పొందాడు. 1937 నవంబర్ 23న తన 78వ ఏట బోస్ అవిభక్త భారతావని లోని బెంగాల్ ప్రావిన్స్ లోని నేటి జార?ండ్‌లోని గిరిడీలో కన్ను మూశాడు. బోస్ మరణించిన 80 సంవత్సరాల అనంతరం కూడా ఆయన చేసిన కృషి అందించిన గణనీయ సేవలు, సాధించిన ఫలితాలను ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది అనునిత్యం గుర్తు చేసుకుంటునే ఉన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ - 9440595494**

## సిద్ధి పొందిన తాపసి బి.ఎస్. నారాయణ - నవంబర్ 23...బి.ఎస్. నారాయణ వర్ధంతి



అయన ఒక కళా తపస్వి. అంతేకాదు. సినీ రంగ తపో స్థలిలో లక్ష్య సాధనకై తపస్సు చేసి, జీవితాన్నీ అంకితం చేసి, సిద్ధి పొందిన తాపసి. జాతీయ స్థాయిలో తెలుగు సినీరంగానికి మొట్ట మొదటిసారి ఉత్తమ నటి అవార్డును, రెండు జాతీయ అవార్డులను అందించి, పలు భాషా చిత్రాలకు దర్శకత్వం వహించి, అంధత్వాన్ని జయించి, అంధ దర్శకునిగా, నంది అవార్డుతో పాటు, లిమ్కా బుక్ లో రికార్డు సృష్టించిన ప్రజ్ఞాశాలి. సుదూర ప్రాంతంలో, మద్రాస్ లో వేళ్లూను కొని అందుబాటులో కాకుండా, దూరంగా ఉండిన తెలుగు సినిమా రంగంలోకి 1950వ దశకంలో ఒక తెలంగాణ ప్రాంత యువకుడు అనూహ్యంగా కాలూని, నిల దొక్కుకుని, తనదైన ముద్ర వేసుకొని జాతీయస్థాయిలో అవార్డులు సాధించడం సామాన్యమైన విషయం కానే కాదు. ఎన్టీఆర్, కృష్ణ లాంటి హీరోలతో నిర్మించి, పలు భాషా చిత్రాలకు దర్శకత్వం వహించడం గొప్ప విషయమే మరి. అలాంటి ఘనత దక్కించుకుని, తెలంగాణ కళా వైభవాన్ని తెలుగు ప్రపంచానికి చాటి చెప్పిన ప్రతిభాశాలి బి.ఎస్. నారాయణ. బి.ఎస్. నారాయణ (1929 – నవంబర్ 23, 1994) తెలంగాణ రాష్ట్రానికి చెందిన తెలుగు చలన చిత్ర దర్శకుడు, నిర్మాత. నారాయణ 1929వ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రం, కరీంనగర్ జిల్లా కొత్తపల్లి గ్రామంలో జన్మించాడు. సినీరంగంలో స్థిరపడాలన్న ఉద్దేశ్యంతో 1952లో మద్రాసుకు వెళ్ళాడు. తిలక్, కె.ఎస్. ప్రకాశ రావు, హెచ్.వి.బాబుల వద్ద అసోసియేట్ దర్శకుడిగా పనిచేసి 1960లో పూర్తిస్థాయి దర్శకుడిగా మారాడు. నిర్మాతగా 32 చిత్రాలకు పైగా నిర్మించాడు. తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాలకు దర్శకత్వం వహించాడు. ఆయన దర్శకత్వం వహించిన "నిమజ్జనం" చిత్రం ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపిక కావడమే కాకుండా నటి శారదకు జాతీయ స్థాయిలో ఉత్తమ నటి అవార్డుతో పాటు "ఊర్వశి" అవార్డును తెచ్చి పెట్టింది. ఇది జాతీయ స్థాయిలో తెలుగు సినీ రంగానికి వచ్చిన మొట్ట మొదటి సారి ఉత్తమ నటి అవార్డు. 1990లో షుగర్ వ్యాధి వల్ల దృష్టిని కోల్పోయిన నారాయణ ఇంటికే పరిమితం అయినారు. అలాంటి పరిస్థితుల్లో కూడా కరీంనగర్ సమీప రేకుర్తి లయన్స్ కంటి ఆసు పత్రి పైన "తమసోమా జ్యోతిర్గ మయ" డాక్యుమెంటరీ చిత్రం తీశాడు. అదే సమయంలో 1991లో కరీంనగర్‌లోని యువకులు కొంతమందితో యువ తరాన్ని ప్రోత్సహిస్తూ, "మార్గదర్శి" అనే చిత్రాన్ని రూపొందించాడు. అంధుడిగా ఉండి సినిమా నిర్మించినందుకు నారాయణకు "లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్" లో స్థానం లభించింది. అంతే కాకుండా మార్గదర్శి చిత్రానికి ఉత్తమ జాతీయ సమైక్యతా చిత్రంగా నంది అవార్డు కూడా లభించింది. ఆయన 32 చిత్రాలు నిర్మించాడు. ఎదురీత (1963)బీ తిరుపతమ్మ కథ (1963)బీ విశాల హృదయాలు (1965)బీ ఆమె ఎవరు? (1966)బీ ఆనంద నిలయం (1971)బీ శ్రీవారు మావారు (1973)బీ ఆడవాళ్లు అపనిందలు (1976)బీ ఊరుమ్మడి బ్రతుకులు (1976) – నంది ఉత్తమ చిత్రం నిమజ్జనం (1979) – శారదకు ఊర్వశీ పురస్కారంబీ ఆడది గడప దాటితే (1980)బీ మార్గదర్శి (1991) అంధత్వంతోనే దర్శకత్వం (అంధ దర్శకునిగా "లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్"), ఉత్తమ జాతీయ సమైఖ్యతా చిత్రంగా నంది పురస్కారం పొందాడు. బి.ఎస్. నారాయణ దర్శకత్వం వహించిన "నిమజ్జనం" సినిమా ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా ఎంపికవ్వడమే కాకుండా తెలుగు సినీరంగంలో తొలి జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకుంది. నిమజ్జనం సినిమా బెంగళూరు అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పనోరమా విభాగంలో ప్రదర్శించ బడింది. నిమజ్జనం, ఊరుమ్మడి బతుకులు సినిమాలు మాస్కో, బెర్లిన్, ఫ్రాన్స్ తదితర అంతర్జా తీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించ బడినాయి. దక్షిణ భారత సినీ దర్శకుల సంఘానికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆయన పనిచేశాడు. సినీ దర్శకుల సంఘాన్ని స్థాపించి, రాజా రామ్ డైరెక్టర్స్ కాలనీ ఏర్పాటు చేశాడు. నారాయణ శ్వాసకోశ వ్యాధి కారణంగా 1994, నవంబర్ 23న మరణించాడు.


**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

## దేశాభివృద్ధికి ప్రసారాల చేయూత - నవంబర్ 23.. ప్రసార భారతి స్థాపన దినం

ప్రసార భారతి అనేది భారతదేశ అతిపెద్ద ప్రసార సంస్థ. దీని ప్రధాన కార్యాలయం న్యూ ఢిల్లీ లో ఉంది. ఇది పార్లమెంటు ద్వారా ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన స్వయం ప్రతిపత్తి సంస్థ. దూరదర్శన్, టెలివిజన్ నెట్వర్క్, ఆల్ ఇండియా రేడియోలను కలిగి ఉంటుంది. బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది. 1927 జూలై 23 న బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927. ఆగస్టు 26 న ప్రారంభ మైనాయి. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తి లోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది. ఆకాశ వాణి ప్రపంచం లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ అధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార యంత్రాంగం ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. ప్రసార భారతి చట్టంను పార్ల మెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన తరువాత 1990 సెప్టెంబర్ 12 న భారత రాష్ట్రపతి అంగీకారం పొందింది. ఇది చివరకు నవంబర్ 1997 లో అమలు చేయబడింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలో 1997 నవంబరు 23న స్థాపించ బడింది. ప్రసార భారతి చట్టం, 1990లో పేర్కొన బడిన ప్రసార భారతి కార్పొరేషన్ సంబంధిత ప్రధాన లక్ష్యాలు... దేశ ఐక్యతను, సమగ్రతను, రాజ్యాంగం ప్రసాదిం చిన విలువలను నిలబెట్టడం. జాతీయ లేదా అంతర్జాతీయ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అన్ని విషయాలపై స్వేచ్ఛగా, నిజాయితీగా మరియు నిష్పక్ష పాతంగా తెలియ జేయడానికి పౌరుడి హక్కును పరిరక్షించడం మరియు దాని స్వంత అభిప్రా యాన్ని లేదా భావజాలాన్ని సమర్థించకుండా విరుద్ధమైన అభిప్రాయాలతో సహా సరసమైన మరియు సమతుల్య సమా చారాన్ని అందించడం. జాతీయ సమైక్యతను ప్రోత్సహించ డానికి, అక్షరాస్యత, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో విద్య మరియు వ్యాప్తిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం. మహిళల సమస్యలపై అవగాహన కల్పించడం మరియు సమాజంలోని పిల్లలు, వృద్ధులు మరియు ఇతర బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం. విభిన్న సంస్కృతులు, క్రీడలు మరియు ఆటలు మరియు యువత వ్యవహారాలకు తగిన కవరేజీని అందించడం. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడం, శ్రామిక వర్గాలు, మైనారిటీలు మరియు గిరిజన వర్గాల హక్కులను పరిరక్షించడం. పరిశోధనను ప్రోత్సహించడానికి మరియు ప్రసార సాంకేతికతలో బ్రాడ్కాస్టింగ్ ఫ్యాకల్టీలను అభివృద్ధిని విస్తరించడం లక్ష్యాలుగా ప్రసార భారతి స్థాపన జరిగింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి చట్టం ద్వారా, అన్ని ఆస్తులు, అప్పులు, బాధ్యతలు, చెల్లించాల్సిన డబ్బు చెల్లింపులు, అలాగే ఆకాశవాణి, దూరదర్శన్ లు అన్ని చట్టపరమైన చర్యలు ప్రసార భారతికి భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ అనువర్తింప జేసింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసరికి 6 ఆకాశవాణి కేంద్రాలు (కలకత్తా, ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, లక్నో, తిరుచిరాపల్లి) మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు 215 ఆకాశవాణి కేంద్రాలు 337 ప్రసార కేంద్రాలతో 99.13 శాతం ప్రజలకు ప్రస్తుతం సమాచారాన్ని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి. దూరదర్శన్ ఇండియా, దూరదర్శన్ అంతర్జాతీయ ఛానెల్ డిడి ఇండియా 37 దేశాలలో అందుబాటులో ఉంది. ఇది ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్ లోని హాట్స్టార్, ఐటివి ప్లాట్ఫారమ్లలో కూడా అందు బాటులో ఉంది. న్యూస్ ఆన్ఎయిర్ యాప్, యాప్2 మిలియన్ కంటే ఎక్కువ డౌన్లోడ్లను కలిగి ఉంది. ఇది 270 కంటే ఎక్కువ రేడియో, టీవీ ప్రత్యక్ష ప్రసారాలను అందిస్తుంది. డిడి ఫ్రీ డిష్ దేశంలోనే అతిపెద్ద డిటిహెచ్ ఆపరేటర్ 40 మిలి యన్లకు పైగా గృహాలకు చేరువైంది. ప్లాట్ఫారమ్లో 50ప్లస్ అంకితమైన విద్యా ఛానెల్లతో సహా 116 టివి ఛానెళ్లు ఉన్నాయి. 2020– 21లో రూ. 700 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించింది. ప్రసార భారతి న్యూస్ సర్వీసెస్ టెలిగ్రామ్ ఛానెల్, ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా ప్రసార భారతి డిజిటల్ న్యూస్ వింగ్గా స్థిరపడింది. దీని ట్విట్టర్ హ్యాండిల్కు వంద కెప్లస్ అనుచరులున్నాయి. టెలిగ్రామ్ ఛానెల్కు 15కె ప్లస్ వినియోగ దారులున్నారు. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశవ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92 శాతం మొత్తం జనాభాలో 99.19శాతానికి చేరుకుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగుతున్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

## సత్య సాయి సేవా మార్గం ప్రపంచానికి మార్గదర్శకం - నవంబర్ 23...సత్య సాయిబాబా జయంతి

సత్య సాయిబాబా (నవంబరు 23, 1926 – ఏప్రిల్ 24, 2011) భారతదేశం లోనే కాక ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక గురువు. ఆయన తన జీవిత కాలంలో లక్షలాది మంది భక్తులను ఆకర్షించారు. ప్రేమ, సేవ, శాంతి, సత్యం, ధర్మం వంటి ఆధ్యాత్మిక సూత్రాలను బోధించి అనేక సామాజిక, సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీ సత్య సాయిబాబా 1926 నవంబర్ 23న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పుట్టపర్తి అనే చిన్న గ్రామంలో జన్మించారు. బాల్యంలో ఆయన అసాధారణమైన ఆధ్యాత్మిక సామర్థ్యాలు ప్రదర్శించారు. అనేక భక్తులు ఆయనలో శక్తి ఉందని భావించారు. 14 సంవత్సరాల వయసులో సత్య సాయిబాబా, తాను శిర్డీ సాయిబాబా పునర్జన్మ అని ప్రకటించి, భక్తుల జీవితాలను మారుస్తూ ఆధ్యాత్మిక గురువుగా మారారు. సత్య సాయిబాబా బోధనల హృదయం ప్రేమ, మానవత్వం, సమానత్వం వంటి విలువల చుట్టూనే తిరుగుతుంది. ఆయన 5 సూత్రాలు సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా సూచించారు. జీవితంలో నిజాయితీ, సత్యవంతత ముఖ్యమైన ఆధ్యాత్మిక గుణాలని ఆయన బోధించారు. కర్తవ్యాలను నిబద్ధతతో నిర్వహించడం, సమాజం పట్ల న్యాయంగా వ్యవహరించడం అవసరం అని అన్నారు. అంతర్గత ప్రశాంతతను సాధించడం ద్వారా మనిషి నిజమైన ఆనందాన్ని పొందగలడని ఆయన వివరించారు. పాత మతాలు, భిన్నత్వాల కతీతంగా ప్రేమతో జీవించమని సందేశం ఇచ్చారు. ఎలాంటి హింస లేకుండా శాంతియుత జీవితం గడపమని ఆయన కోరారు. సత్య సాయిబాబా సేవా మార్గం ప్రపంచానికి గొప్ప మార్గదర్శకంగా నిలిచింది. సత్య సాయిబాబా అనేక విద్యా సంస్థలను స్థాపించారు, అక్కడ నాణ్యమైన విద్యతో పాటు ఆధ్యాత్మిక విలువల్ని బోధిస్తారు. విద్య వ్యాపారం కాకుండా సేవగా ఉండాలని ఆయన స్పష్టంగా చెప్పారు. ఆయన స్థాపించిన సుపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ లో అత్యాధునిక వైద్య సేవలు పూర్తిగా ఉచితంగా అందించ బడతాయి. పేదలకు, బాధితులకు ఉచిత చికిత్స అందించడంలో ఈ ఆసుపత్రులు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందాయి. సత్య సాయిబాబా ఎన్నో గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు కోట్లాది మందికి మేలు చేకూర్చాయి. సత్య సాయిబాబా భక్తుల ముందు అనేక అద్భుతాలను ప్రదర్శించారు. విభూతి (పవిత్ర బూడిద) ను చేయి నుంచి ప్రత్యక్షంగా సృష్టించడం, వస్తువులను క్షణాల్లో ఉత్పత్తి చేయడం వంటి అద్భుతాలు ఆయన భక్తులకు విశ్వాసాన్ని కలిగించాయి. ఈ అద్భుతాలు కొందరి విమర్శలకు గురైనా, భక్తులు వాటిని ఆయన ఆధ్యాత్మిక శక్తులుగా భావించారు. ఆయన బోధనల ద్వారా అనేక మంది జీవిత విధానంలో మార్పు తీసుకువచ్చి సమాజ సేవలో పాల్గొన్నారు. భక్తులు ఆయన బోధించిన నైతిక విలువలను తమ రోజువారీ జీవితాల్లో ఆచరిస్తున్నారు. సత్య సాయిబాబా స్థాపించిన సత్య సాయిబాబా ఆర్గనైజేషన్ 100 కంటే ఎక్కువ దేశాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఈ సంస్థలు విద్య, ఆరోగ్యం, తాగునీటి సరఫరా వంటి రంగాల్లో ముఖ్యమైన సేవలు అందిస్తున్నాయి. సత్య సాయిబాబా బోధనలు అన్ని మతాలకు ఒకే తీరున ప్రామాణికతను చూపాయి. ఆయన సందేశం అన్ని మతాల ప్రాథమిక విలువలను అనుసరిస్తూ, మతసామరస్యం మరియు సమానత్వం గురించి చర్చించేది. సత్య సాయిబాబా తన జీవితకాలంలో పలు విమర్శలను ఎదుర్కొన్నారు. ఆయన చేసే అద్భుతాలను కొందరు మాయా జాలంగా అభివర్ణించారు. ఆయనకు వ్యతిరేకంగా కొన్ని ఆర్థిక అక్రమాల ఆరోపణలు కూడా వచ్చాయి. అయితే, ఆయన భక్తులు ఈ విమర్శలను తోసిపుచ్చి, ఆయనను భగవంతుని అవతారంగా భావిస్తూ తమ విశ్వాసాన్ని కొనసాగించారు. విమర్శలు ఆయన ఆధ్యాత్మిక ప్రభావాన్ని తగ్గించలేక పోయాయి. 2011 ఏప్రిల్ 24న సత్య సాయిబాబా తన భౌతిక దేహాన్ని విడిచారు. ఆయన



మరణం భక్తులకు చాలా బాధాకరమైన విషయం. అయితే, ఆయన స్థాపించిన సంస్థలు, ఆశయాలు మరియు సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. సత్య సాయిబాబా జన్మస్థలం పుట్టపర్తి, ఇప్పుడు ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. సాయిబాబా సమాధి దగ్గర అనేక భక్తులు ప్రతిరోజూ ప్రార్థనలు చేస్తూ ఆయన బోధనలను గుర్తు చేసుకుంటారు. విద్యా మరియు ఆరోగ్య సేవలు ఆయన మరణం తర్వాత కూడా ఆయన స్థాపించిన విద్యా, ఆరోగ్య సేవా సంస్థలు ప్రతిభావంతమైన విద్యార్థులకు విద్యను, పేదలకు వైద్య సేవలను అందిస్తున్నాయి. "మానవ సేవే దేవ సేవ" అన్న ఆయన సందేశం ప్రజల హృదయాల్లో గాఢంగా నిలిచి పోయింది. ఆయన స్థాపించిన సేవా కార్యక్రమాలు ప్రపంచానికి వెలుగునిచ్చే దీపాలుగా కొనసాగుతున్నాయి. సత్య సాయిబాబా జీవితం ఒక ఆదర్శంగా ఉంది. ఆయన చూపించిన మార్గం, బోధనలు ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తినిస్తున్నాయి. ఆధ్యాత్మికత, సేవ, ప్రేమ కలిసిన జీవితమే సత్య సాయిబాబా జీవన దర్శనం. ఆయన సేవా భావం మరెన్నో తరాల వరకు మార్గదర్శకంగా నిలుస్తుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

## పేదల గూడుకు చేదోడు

పెద్దపల్లి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు వీలైనంత మేరకు తోడ్పాటు అందిస్తోంది. ఈ విషయంలో నిత్యం పర్యవేక్షణ చేస్తోంది. కొందరు ఆసక్తితో నిర్మాణ పనులను చేపడుతున్నప్పటికీ చాలా చోట్ల తగినంత డబ్బు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ప్రభుత్వం అవసరమైన చర్యలు, సహాయ సహకారాలు అందిస్తోంది.

జిల్లావ్యాప్తంగా 9,951 ఇందిరమ్మ ఇళ్లు మంజూరుకాగా 7,178 ఇళ్ల పనులు జరుగుతున్నాయి. కరీంనగర్ నియోజకవర్గంలో ఇళ్ల మంజూరు ఆలస్యం కావడంతో ఇప్పుడిప్పుడే మొదలవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పనులు చేసేవారు ఉన్నారు. వీరిలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు ఉంటే ఉపాధిహామీ ద్వారా పనులు చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నారు జాబ్‌కార్డు ద్వారా 90 రోజులు పని చేస్తే రోజుకు రూ.307 చొప్పున అందుతాయి. ఈ లెక్కన 90 రోజుల్లో రూ.27,630 వస్తాయి. దీనికితోడు ఇందిరమ్మ ఇంటి



నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారు. ఇప్పటికి 489 మందికి మంజూరు చేశారు.

**మహిళా సంఘ సభ్యులకు..**

లబ్ధిదారు మహిళా సంఘ సభ్యురాలిగా ఉన్నట్లయితే ఆ సంఘం నుంచి రుణం ఇప్పించి నిర్మాణ పనులకు సహకరిస్తున్నారు. ఇప్పటి వరకు 784 మంది లబ్ధిదారులకు స్వశక్తి సంఘాల ద్వారా రుణ సౌకర్యం కల్పించారు. దీంతో వీరందరికి ప్రయోజనం చేకూరనుంది.

**అధికారులు ఏమన్నారంటే..**

మూడు నెలల నిర్దీత పనిదినాలను వినియోగించుకొని ఉపాధి కూలీలు ఆర్థిక లబ్ది పొందవచ్చని డీఆర్‌డీవో శ్రీధర్ తెలిపారు. ఇప్పటి వరకు 778 మంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారన్నారు. జిల్లావ్యాప్తంగా ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసేందుకు అన్ని విధాలా పర్యవేక్షణ చేయడమే కాకుండా తగిన తోడ్పాటు అందిస్తున్నట్లు ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

## 'చౌక'బారు పనులు

హైదరాబాద్: పేదల బియ్యం దళారుల పాలవుతోంది. పేదల అవసరాలను ఆసరాగా చేసుకొని దందా సాగిస్తున్నారు. వీరికి కొంతమంది డీలర్లు సహకరిస్తున్నారు. నేరుగా డీలర్లే పేదలకు డబ్బు ఇచ్చి బియ్యం కొంటున్నారు. వాళ్లే వ్యాపారులకు పెద్ద మొత్తంలో అమ్ముతున్నారు. నిఘా లేకపోవడంతో బియ్యం భారీగా నల్లబజారుకు తరలుతోంది. హైదరాబాద్ నుంచి చౌకదుకాణాల సన్నబియ్యం అక్రమ రవాణాకు కొందరు డీలర్లు తెరతీశారు. మార్కెట్‌లో సన్నబియ్యానికి మంచి డిమాండ్ ఉండడంతో డీలర్లు వ్యూహాత్మకంగా దందా కొనసాగిస్తున్నారు. కొంతమంది బడా వ్యాపారులకు విక్రయించడంతో ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. సన్నబియ్యం లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుండగా.. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధర రూ.40 అంతకంటే ఎక్కువగా ఉంటోంది.

**దొరుకుతున్నవి తక్కువే..**

ఖైరతాబాద్ బీజేఆర్ నగరంలో ఇటీవల పది క్వింటాళ్ల సన్నబియ్యాన్ని పట్టుకున్నారు. 10 కిలోల చొప్పున సంచుల్లో నింపి తరలిస్తున్నట్లు



పోలీసులు గుర్తించారు.

మలక్‌పేటలోనూ 56 క్వింటాళ్ల బియ్యం తరలిస్తుండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

లబ్ధిదారుల నుంచి రూ.20కు బియ్యం కొని రెట్టింపు ధరలకు బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు గుర్తించారు.

గత ఏడాది హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో చౌకదుకాణాల నుంచి అక్రమంగా బియ్యం నిల్వ, తరలింపు అంశంపై పదికి పైగా కేసులు నమోదయ్యాయి. వందల క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నారు. అక్రమాలకు చెక్‌పెట్టేందుకే బయోమెట్రిక్ విధానం అమల్లో తీసుకువచ్చామని పౌరసరఫరాలశాఖ ఉన్నతాధికారులు అన్నారు. పటిష్టంగా విధానం ఉన్నా కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారని వీరిని తనిఖీలతో గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్డుదారులు రూ.20కు విక్రయించడం సరికాదన్నారు.

## కన్నేసి.. అటవీ భూములు కలిపేసి

కుత్బుల్లాపూర్: గాజులరామారం రిజర్వుడ్ ఫారెస్టు భూములపై రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ సర్వే విభాగం (ఆర్‌డీడీఎస్) అందజేసిన సర్వే నివేదికను నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్(ఎన్‌జీటీ) తప్పుపట్టింది. సర్వే లోపభూయిష్టంగా ఉందని, తిరిగి నిర్వహించాలని ఆదేశాలు జారీచేసింది. ఆ భూములను ప్రైవేటు వెంచర్లలో కలుపుకొని క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు 2022లో ఓ వ్యక్తి ఎన్‌జీటీని ఆశ్రయించడంతో కోర్టు విచారణ చేపట్టింది. ఇందులో భాగంగా ఆర్‌డీడీఎస్ అధికారులు ఇటీవల సర్వే నిర్వహించి 430 ఎకరాలు ఉన్నట్లు నివేదిక ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

**ఎన్‌ఓసీ లేకుండానే అనుమతులు**

గాజులరామారం 19వ సర్వే నంబరులో 471.14 ఎకరాలు, సూరారం 193 సర్వే నంబరులో 596 ఎకరాలు రిజర్వు ఫారెస్టు భూములున్నాయి. కొందరు వాటిని కలుపుకొని వెంచర్లు చేశారు. నిబంధనల ప్రకారం అటవీ శాఖ నిరభ్యంతర పత్రం జతచేస్తేనే లేఅవుట్లకు అనుమతులివ్వాల్సి ఉంది. కానీ అలా జరగలేదు. రూ.1230 కోట్ల విలువచేసే 41 ఎకరాల భూమి కన్పించలేదు.

**నోటీసులతో సరిపెట్టిన జీహెచ్‌ఎంసీ..**గాజులరామారానికి చెందిన కిరణ్ అనే వ్యక్తి ఎన్‌జీటీకి ఫిర్యాదు చేయడంతో 2022 ఏప్రిల్ 27న జీహెచ్‌ఎంసీ, అటవీ, నీటి పారుదల, రెవెన్యూ, కాలుష్య నియంత్రణ మండలి, హెచ్‌ఎండీఏ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి 16.21 ఎకరాల మేర అటవీ భూములు ప్రైవేటు వెంచర్లలో కలిపిఉన్నట్లు గుర్తించారు. అందులో వెలిసిన 21 నిర్మాణాలకు అదే ఏడాది జూన్ 30న నోటీసులు జారీచేశారు.

# ఆకలి బాధ.. ఏకాగ్రత కుదిరేదెలా!



కరీంనగర్ :పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. రెండు నెలలుగా నిత్యం సాయంత్రం అదనంగా గంట పాటు ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేశారు. కానీ విద్యార్థులు ఆకలితో సతమతమవుతున్నారు. విద్యార్థులందరికి అల్పాహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో యోచించినా అమలు కాలేదు. మధ్యాహ్న భోజనంపై ఆధారపడిన విద్యార్థులు సాయంత్రం ఆకలి బాధతో చదివిన విషయాలపై దృష్టి సారించడం లేదు.

కేవలం మధ్యాహ్న భోజనం వారి ఆకలి తీరుస్తోంది.

సాయంత్రం అదనంగా గంట పాటు పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతుల్లో పాల్గొని ఇళ్లకు చేరే సరికి మరో అరగంట వరకు సమయం పడుతోంది. దూరప్రాంతాల విద్యార్థులకు ఇంకాస్త సమయం పడుతోంది. ఆకలి, అలసటతో ఇళ్లకు వెళ్లాక చదువులను పక్కన పడేస్తున్నారు. ఓ వైపు ఆకలి వేస్తుండగా, మరో వైపు ప్రత్యేక తరగతుల్లో వారు సన్నద్ధమవడం, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను అర్థం చేసుకునే ఏకాగ్రతను కోల్పోతున్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలలల్లోని పదో తరగతి విద్యార్థులకు నిత్యం సాయంత్రం 4.15 నుంచి 5.15 గం.ల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పాఠశాలలు ఉదయం 9 గంటలకే ప్రారంభమవడంతో మెజారిటీ విద్యార్థులు అల్పాహారం చేయకుండానే హాజరవుతున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఆకలి బాధతో ప్రత్యేక తరగతులకు గైర్హాజరవుతున్నారు.

**ముందే స్పందిస్తే..**

సాయంత్రం స్నాక్స్ సమకూరిస్తే ప్రయోజనమని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. గత కొన్నేళ్లుగా ఫిబ్రవరి నుంచి స్నాక్స్ కోసం ఒక్కో విద్యార్థికి రూ.10-15లను అధికారులు సమకూరుస్తున్నారు. వాటిని ఇప్పటి నుంచే అందిస్తే విద్యార్థుల సన్నద్దత మరింత మెరుగుపడనుంది. దాతల సహకారంతో విద్యా సంవత్సరం చివరిలో గతంలో జిల్లా యంత్రాంగాలు అల్పాహారం సమకూర్చాయి. ఇప్పటి నుంచే అమలు చేస్తే విద్యార్థులను ఉత్తమ ఫలితాల దిశగా ప్రోత్సహించినవారవుతారు.

. పదో తరగతి విద్యార్థుల ఆకలి తీర్చేందుకు దాతలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సేవాభావంతో ముందుకు రావాలి.

# రైతులంటే అలుసు.. అడగలేరని తెలుసు



వికారాబాద్ : "నవాబ్‌పేట మండలం వట్టిమీనపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డికి ఆరున్నర ఎకరాల పొలం ఉంది. అందులో అరెకరం విస్తీర్ణంలో పత్తిసాగు చేశారు. వర్షాలకు పూత నిలబడక పంట ఆశాజనకంగా లేదు. ప్రస్తుతం ఒకటిన్నర క్వింటాలు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పెట్టిన పెట్టుబడి కూడా చేతికందకుండా పోయింది. పరిగి మండలం యాబాజీగూడ గ్రామానికి చెందిన సదానందం ఎకరం పొలంలో టమాట సాగు చేశారు. భారీ వర్షాల కారణంగా పంట పూర్తిగా పాడైంది. ప్రస్తుతం నేలను దున్ని రబీసాగుకు సిద్ధం చేస్తున్నారు."భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ఇప్పటి వరకు పరిహారం మంజూరు చేయక పోవడంతో అన్నదాతలు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే యాసంగి సీజన్ ప్రారంభమైంది. ఓవైపు పంట కోతలు ఇంకోవైపు పెట్టుబడుల సమస్య గుదిబండగా మారింది. ఎన్నో ఆశలతో సాగు చేసుకున్న పంటలన్నీ దాదాపు వర్షార్పణమయ్యాయి. పెసర, మినుము పైర్లు పొలాల్లోనే మొలకెత్తాయి. మొక్కజొన్న, పత్తి, వరి, కంది తదితర పంటలు పాడయ్యాయి. వాగులు, వంకల పక్కన పొలాలు ఇసుక మేటలు పెట్టాయి. ఉద్యాన పంటలకు తీరని నష్టం ఏర్పడింది. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితులు నెలకొని కోట్లాది రూపాయల పంట నష్టం వాటిల్లింది. మిగిలిన కొద్దిపాటికి కూడా దిగుబడులు పడిపోయి దిగాలు పడ్డారు. ప్రభుత్వం పరిహారం అందజేసి ఆదుకునే చర్యలు చేపట్టాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

**ఆగస్టులో జరిగిందిలా..**

ఆగస్టు మాసం నుంచే వర్షాలు రైతులను వెంటాడాయి.

103 గ్రామాల్లో 1430 మంది రైతులకు చెందిన 1537 ఎకరాల్లో వివిధ రకాల పంటలు దెబ్బతిన్నాయి.

33శాతానికి పైగా పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదికను అందజేసింది. కానీ పైసా పరిహారం అందలేదు.

సెప్టెంబరులో..సెప్టెంబరు 26నుంచి అక్టోబరు రెండో వారం వరకు 131 గ్రామాల్లో 5262 మంది రైతులకు చెందిన 7506 ఎకరాలు దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయారు. వీటిలో ప్రధానంగా 326 ఎకరాల్లో వరి, 5448 ఎకరాల్లో పత్తి, 855 ఎకరాల్లో కంది, 205 ఎకరాల్లో మొక్కజొన్న, 25 ఎకరాల్లో మినుము పంట చేతికందకుండా పోయింది. పరిగి, బంట్వారం, వికారాబాద్, పెద్దేముల్, కోట్‌పల్లి, మర్పల్లి, నవాబ్‌పేట, దౌల్తాబాద్, తాండూరు, కోట్‌పల్లి, బషీరాబాద్ మండలాల్లో అధిక నష్టం వాటిల్లింది.

తుపాన్ ప్రభావంతో 483 మంది రైతులు 535 ఎకరాల్లో నష్టపోవాల్సి వచ్చింది. మొత్తంగా ఇది అధికారిక సమాచారం అయితే అనధికారికంగా మొత్తంగా పదివేల ఎకరాలకు పైగా నష్టం జరిగినట్లు సమాచారం.

ఆశలు చచ్చిపోయాయి

– తలారి శాంతయ్య, కౌలు రైతు, మాదిరెడ్డిపల్లి, నవాబ్‌పేట మండలం

తెల్లబంగారం సాగుతో చేసిన అప్పులు తీరుతాయని ఎంతో ఆశతో ఎకరం విస్తీర్ణంలో పొలం కౌలుకు తీసుకుని పంట సాగు చేస్తే పూతదశ వరకు వానలు వదల్లేవు. గూడ పూర్తిగా రాలిపోయి నీరుపట్టి పొలమంతా మోడుగా మారింది. నీరుపట్టి 50కిలోల పత్తి మాత్రమే వచ్చే అవకాశముంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

**వివరాలు అందజేశాం**

– రాజారత్నం, జిల్లా వ్యవసాయాధికారి

పంట నష్టం వివరాలపై ఇప్పటికే నివేదికను అందజేశాం. ఈ విషయమై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

వానాకాలం సాధారణ సాగు ఎకరాలు: 5,93,491

సాగైన పంటలు: 5,51,577

ఎన్ని గ్రామాల్లో నష్టం: 234

ఎన్ని ఎకరాలు: 9,471

నష్టపోయిన రైతులు: 7,175

# చిన్నారులకు కష్టాల పరీక్ష



హైదరాబాద్: నిలోఫర్‌లో చిన్నారులకు కష్టాలు తప్పడం లేదు. ఇక్కడ చికిత్సలు చేయిస్తూ కొన్ని టెస్టుల కోసం గాంధీ, ఉస్మానియా, ఎంఎన్‌జే, నిమ్స్‌కు తరలించాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. నిత్యం 20 మందికి తక్కువ కాకుండా చిన్నారులను అంబులెన్సుల్లో పంపుతున్నారు. నిలోఫర్‌లో దాదాపు వేయి పడకలు ఉన్నా కొన్నిరకాల సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులో లేవు. చలి పెరుగుతుండడంతో శ్వాసకోశ వ్యాధులతో చాలామంది చిన్నారులు ఆసుపత్రిలో చేరుతున్నారు. దాదాపు 150 మంది ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కొందరిలో రెస్పిరేటరీ సెన్సిటియర్ వైరస్(ఆర్ఎస్‌వీ), ఇన్‌ఫ్లూయింజా వైరస్ లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇవి న్యుమోనియాకు దారి తీస్తోంది. ఈ రెండు వైరస్‌లను నిర్ధారించాలంటే పరీక్షలు చేయాలి. టెస్టులకు గాంధీకి పంపుతున్నారు. అంబులెన్సులు లేక ఆటోలను సమకూర్చుకుని వెళ్తున్నారు.

**ఎంఆర్ఐ టెస్టులకు నిరీక్షణే..**

చిన్నారులకు ఎంఆర్ఐ టెస్టులు అవసరమయ్యే సందర్భంలో పక్కనే ఉన్న ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి తరలిస్తుంటారు. నిలోఫర్ పిల్లల కోసం ప్రత్యేకంగా స్లాట్లు అందుబాటులో లేవు. ఇక్కడ రోజుకు 20 కంటే ఎక్కువ టెస్టులు చేసే పరిస్థితి ఉండదు. ఈ నేపథ్యంలో వారం, పది రోజులపాటు నిరీక్షణ తప్పదు. అత్యవసరంలో ఉన్నతాధికారుల సూచనలతో పరీక్షలు చేస్తున్నారు.

పుట్టుకతోనే చాలామంది పిల్లలకు గుండెల్లో రంధ్రాలు ఉంటాయి. వీటికి అత్యవసర శస్త్రచికిత్సలు అవసరం. ప్రస్తుతం నిలోఫర్‌లో ఈ చికిత్సలు అందుబాటులో లేవు. నిమ్స్ లేదా ఇతర ప్రైవేటు ఆసుపత్రుల్లో చేయించుకోవాలి. నిమ్స్‌లో ప్రత్యేక శిబిరం ద్వారా చిన్నారులకు చికిత్సలు అందిస్తున్నారు. ప్రైవేటులో చేయాలంటే అధిక ఖర్చుతో కూడిన వ్యవహారం. నిలోఫర్‌లోనే ప్రత్యేక గుండె శస్త్రచికిత్సల విభాగాన్ని ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో ప్రతిపాదన ఉన్నా కార్యరూపం దాల్చలేదు.

నిత్యం 600-700 మధ్య నిలోఫర్‌లో ఓపీ ఉంటోంది. సీజన్‌లో వేయి మందికి దాటుతోంది. ఏటా నిలోఫర్‌లో 20-30 శాతం ఓపీ పెరుగుతోంది. ఆ మేరకు మౌలిక వసతులు, సేవలు పెంచాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

## ఆంగ్ల బోధన.. ఆటలతో సాధన

హైదరాబాద్: సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరహా మూడేళ్ల చిన్నారులకు తరగతులు ప్రారంభించింది. పిల్లలకు ఆటపాటలు, తెలుగు, ఆంగ్లం పదాలు నేర్పుతున్నారు. వారికి అర్థమయ్యేలా పదాలు చెప్పేందుకు ఒక ఉపాధ్యాయురాలు, సంరక్షురాలిని విద్యాశాఖ అధికారులు నియమించారు. ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు వారు విద్యార్థులతో ఉంటున్నారు. మధ్యాహ్నం భోజనం తినిపించి ఇళ్లకు పంపుతున్నారు. ఇలా గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ఎంపిక చేసిన 135 ప్రభుత్వ విద్యాలయాల్లో తరగతులు ఆరంభించారు. కొన్నింటిలో పుస్తకాలిచ్చి



అక్షరాలు నేర్పిస్తున్నారు.

**బడీడు పిల్లలను చేర్పించేలా..** గ్రేటర్ హైదరాబాద్‌లోని 1489 ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ లేకపోవడంతో కాలనీలు, బస్తీల్లో నివసిస్తున్న పిల్లల తల్లిదండ్రులు తమ ఇళ్లకు సమీపంలోని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో ప్రీ-ప్రైమరీ తరగతులను మరిన్ని పెంచేందుకు విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. హిమాయత్‌నగర్, నారాయణగూడ, ముషీరాబాద్, సికింద్రాబాద్, అబిడ్స్, కోఠి, అంబర్‌పేట ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రాథమికంగా నిర్ణయించారు.

## జర్మన్..జపనీస్.. ఉద్యోగ ఉషస్సు

సంగారెడ్డి: ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో చదివే విద్యార్థినులు విదేశీ ఉద్యోగాలు పొందేందుకు ప్రభుత్వం జర్మనీ, జపనీస్ నేర్పించేందుకు కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా ఆ సంస్థతో ఇటీవలే సంగారెడ్డి వైద్యకళాశాలలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆధ్వర్యంలో ఒప్పందం చేసుకుంది. ఉమ్మడి జిల్లాలోని నర్సింగ్ కళాశాలల్లోని విద్యార్థినులు ఇప్పటికే కొందరు విదేశీ భాషలు నేర్చుకునేందుకు పేర్లు నమోదు చేయించుకున్నారు.

**సమృద్ధిగా అవకాశాలు**

జర్మన్‌తో పాటు జపనీస్ భాషల్లో ప్రైవేటుగా శిక్షణ పొందాలంటే రూ.లక్షల్లో వ్యయం చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం నర్సింగ్ కళాశాలల్లో ఉచితంగా నేర్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. జర్మన్ భాషలో ఉత్తీర్ణత సాధిస్తే ఎన్నో అవకాశాలు లభిస్తాయి. ఏడేళు అక్కడ విధులు నిర్వహిస్తే ఆ దేశ పౌరసత్వం వస్తుంది.

ఆన్‌లైన్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినులకు ఆయా దేశాల్లో ఉద్యోగావకాశాల కల్పనకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక చొరవ చూపనుంది.

నాలుగు స్థాయిల్లో

ఎ-1, ఎ-2, బి-1, బి-2గా విభజించి తరగతులు నిర్వహించాలని నిర్ణయించారు. విద్యార్థినుల ప్రతిభ, ఉత్తీర్ణత సాధించిన ఆధారంగా భాష నైపుణ్యాలపై తర్ఫీదు నివ్వనున్నారు.

ఉద్యోగాలు సాధిస్తే

జర్మనీ, జపాన్ దేశాల్లో ఉద్యోగాలు సాధించిన వారికి నెలకు రూ.2.50 లక్షల నుంచి రూ.3లక్షల వరకు వేతనం లభించే అవకాశాలున్నాయి. సేవలతో పాటు, బోధనకు అవకాశాలున్నాయని వైద్యశాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

**ఎందుకంటే**

జర్మనీ, జపాన్‌లో నర్సింగ్ విద్యార్థులకు భారీ వేతనాలు, ఉపాధి అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నర్సింగ్ తరగతులు ముగిసిన అనంతరం ఆన్‌లైన్ ద్వారా భాషలు నేర్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్దేశిత పాఠ్యాంశాల బోధనకు ఇబ్బందులు లేకుండా కొనసాగించనున్నారు.

ఏం నేర్పిస్తారు

ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ(నర్సింగ్), జీఎన్‌ఎం చదువరులకు జర్మనీ ఆసుపత్రుల్లో రోగులు, వైద్యులతో సంభాషణకు ఎనిమిది నుంచి పది నెలల పాటు శిక్షణ ఇస్తున్నారు.

విద్యార్థినులు ముందుకు రావాలి

ప్రభుత్వం జర్మనీ, జపనీస్ భాషలు నేర్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఆసక్తి ఉన్న విద్యార్థులను పేర్లు నమోదు చేసుకోవాలని కోరింది. మా కళాశాలకు చెందినవారు పేర్లు నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లోనే ఈ భాషలు నేర్పించనున్నారు.పద్మ, ప్రిన్సిపల్, నర్సింగ్ కళాశాల, జోగిపేట

### తండోప'తండా'లుగా ప్రభుత్వ ఉద్యోగులు..!

రఘునాథపాలెం : రఘునాథపాలెం మండలం హర్యాతండా గ్రామపంచాయతీ చదువులో ముందుంది. దీని పరిధిలో హర్యాతండా, జేత్యాతండా, సుకినితండా ఉన్నాయి. హర్యాతండాలో సుమారు 600 మంది నివసిస్తుంటారు. ఈగ్రామంలో 100 మందికిపైగా పట్టభద్రులు (వీరిలో సగానికి పైగా ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు) ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు 40 మందికిపైగా చేస్తున్నారు. జేత్యాతండాలో సుమారు 200 మంది జనాభా ఉంటారు. సుమారు పది మంది ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. సుకినితండాలో 250 మంది నివసిస్తుంటారు.



ఈ గ్రామానికి చెందిన మాలోతు కార్తీక్ ఐఆర్‌ఎస్ అధికారిగా పనిచేస్తున్నారు. ఆరుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు, ఒక ఎక్సైజ్ ఎస్సై, ఇద్దరు బ్యాంకు మేనేజర్లు ఉన్నారు. అంతే కాదండోయ్ ఈ గ్రామాల్లో ఆధ్యాత్మిక చింతన ఎక్కువే. తండాల్లోని ఆలయాల్లో విశేషమైన పూజలు నిర్వహిస్తుంటారు. ఏటా నిష్ఠగా వ్రతం ఆచరించి శబరిమలై అయ్యప్పస్వామి, పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మ అమ్మవారు, విజయవాడ దుర్గామాత దర్శనాలకు వెళ్లి వస్తుంటారు. వివాదాలకు దూరంగా ఉండే ఈగ్రామాల్లో పోలీసు కేసులు తక్కువగానే నమోదవుతుండటం మరో విశేషం.

# బండి.. పిల్లలకివ్వకండి

సికింద్రాబాద్ :పరిధిలో పదోతరగతి విద్యార్థి ద్విచక్రవాహనం నడుపుతూ ఆటోను ఢీకొట్టాడు. తలకు బలమైన గాయమైంది. ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇప్పటికి రూ.8 లక్షలు ఖర్చుచేసినా కోలుకోలేదని వైద్యుడు తెలిపారు.

గోల్కొండ సమీపంలో పదేళ్ల పిల్లాడు.. తమ్ముడితో స్కూటీపై బంధువుల ఇంటికెళ్తూ వాహనం అదుపు తప్పటంతో కిందపడ్డారు. వారిపై నుంచి ఆటో వెళ్లడంతో తీవ్రగాయాలపాలయ్యారు.

ఈనాడు, హైదరాబాద్: పిల్లలు మారాం చేస్తున్నారని.. వాహనం నడపటంలో అనుభవం ఉందనే ధీమాతో మైనర్ల చేతికి ద్విచక్రవాహనాలు, కార్లు ఇస్తే తర్వాత పెద్దలు బాధపడాల్సి వస్తుంది. చేతికి బండి రాగానే అతివేగంతో దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. కొన్నిసార్లు తీవ్రగాయాలతో ఆసుపత్రిపాలవుతున్నారని నగర ట్రాఫిక్ పోలీసులు అంటున్నారు. ఈ ఏడాది 10 నెలల వ్యవధిలో మైనర్ డ్రైవింగ్‌పై 6,497 కేసులు నమోదు చేశారు. 3,326 మంది వాహన యజమానులకు కోర్టు సామాజిక, కమ్యూనిటీ సర్వీసెస్ శిక్షలు, రూ.56.22 లక్షల జరిమానా విధించింది.

ప్రమాదమని తెలిసి.. విద్యార్థుల చేతికిచ్చి

14 ఏళ్ల పిల్లాడు తండ్రి ఇంట్లోలేని సమయంలో ద్విచక్రవాహనం తీసుకొని స్నేహితులతో బంజారాహిల్స్ వచ్చాడు. పోలీసుల తనిఖీల్లో దొరకటంతో వాహనం స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ట్యాక్సీ నడుపుతూ కుటుంబాన్ని పోషించే అతడు.. బండి చేతికి వచ్చేవరకు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

నగరంలో 2–3 శాతం విద్యార్థులు పాఠశాలలకు బైక్‌లపై వచ్చి వెళున్నట్టు పోలీసులు గుర్తించారు. పిల్లల్ని పాఠశాల బస్సులు, వ్యాన్‌లు, ఆటోల్లో పంపటం ఖర్చుగా భావించి సెకండ్‌హ్యాండ్‌లో ద్విచక్రవాహనాలు కొనుగోలు చేసి బిడ్డల చేతికిస్తున్నారు.



సుమారు 100 మంది విద్యార్థులు బైక్‌లపై పాఠశాలకు వెళ్తున్నట్టు ట్రాఫిక్ పోలీసులు గుర్తించారు. విరామ సమయంలో ఒకే బైక్‌పై ఇద్దరు–ముగ్గురు చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తున్నారు. పాఠశాల ప్రాంగణంలోకి పిల్లలు ద్విచక్ర వాహనాలతో వస్తే అనుమతించ వద్దని విద్యాసంస్థల యాజమాన్యానికి సూచించారు.

కొందరు రీల్స్ మోజులో వాటిపై విన్యాసాలు చేస్తున్నారు. రాత్రివేళ తల్లిదండ్రుల కన్నుగప్పి బయటకు తీసుకొచ్చి రేసింగ్‌లో పాల్గొంటున్నారు.అతి గారాబం ప్రాణాంతకమే- జోయల్ డేవిస్, జాయింట్ సీపీ, నగర ట్రాఫిక్ విభాగం

బిడ్డలపై ప్రేమతో వారి చేతికి వాహనాలిచ్చి ప్రాణాలతో చెలగాటమాడొద్దు. తమ పిల్లలు వాహనం బ్రహ్మాండంగా నడపగలరనే నమ్మకం చాలామంది తల్లిదండ్రుల్లో ఉంటుంది. మైనర్లకు వాహనం అదుపు చేయటంలో పూర్తి పరిణితి ఉండదు. అకస్మాత్తుగా ఏదైనా అవరోధం ఎదురైనప్పుడు ఆందోళనకు గురవుతారు. విద్యాసంస్థల యాజమాన్యాలు, తల్లిదండ్రులు బాధ్యత తీసుకొని మైనర్ డ్రైవింగ్‌ను కట్టడి చేయటంలో సహకరించాలి.

# ఆరు నెలల శిక్షణ.. ఆ వెంటే ఉద్యోగం

హైదరాబాద్: ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులకు బహుళజాతి సంస్థలు, పరిశ్రమల్లో ఉద్యోగాలు వెంటనే లభించేందుకు జేఎన్‌టీయూ హైదరాబాద్ అధికారులు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఈ ఏడాది కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ పాసైన 40 మంది విద్యార్థినులకు నైపుణ్యాలు నేర్పించి, ఆరు నెలలు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఆపై ఉద్యోగాలు పొందేలా కార్యచరణను రూపొందించారు. ఇందుకోసం బెంగుళూరులోని ఎమర్టెక్స్ అనే ఐటీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. విద్య, పరిశ్రమలను అనుసంధానించడం డీప్‌టెక్ డొమైన్లలో విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించనున్నారు. శిక్షణ పూర్తయ్యాక ఒక్కొక్కరికి రూ.4.5 లక్షలు నుంచి రూ.6 లక్షల వార్షిక వేతనం లభించనుందని అధికారులు తెలిపారు.



**పేద వారిని ప్రోత్సహించేందుకు..**

జేఎన్‌టీయూ క్యాంపస్, అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల్లో చదివిన పేద, మధ్యతరగతి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థినులను ప్రోత్సహించేందుకు జేఎన్‌టీయూ అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. క్యాంపస్ ఇంటర్వ్యూలలో కొద్దిపాటి తేడాతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చేజార్చుకున్న విద్యార్థినులు వృత్తిపరంగా స్థిరపడేందుకు ఎమర్టెక్స్ సంస్థను అధికారులు ఎంచుకున్నారు. బెంగుళూరు కేంద్రంగా 22 ఏళ్లుగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న ఈ సంస్థ ఎలక్ట్రానిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో భాగస్వామిగా కొనసాగుతోంది. పరిశ్రమ ఆధారిత శిక్షణను అందించడం, ప్రఖ్యాత కంపెనీలు, సంస్థల్లో ఉద్యోగ అకాశాలు లభించేలా సహకరించడం వంటి పనులను ఈ సంస్థ కొన్నేళ్ల నుంచి చేస్తోంది.

# సీసీఐ కొనదు.. ప్రైవేటులో ధరుండదు



పెద్దపల్లి : పత్తి రైతులపై ఒకవైపు ప్రకృతి కన్నెర్ర చేయగా.. మరోవైపు మార్కెట్ ధరల సరళి ఆందోళనకు గురిచేస్తోంది. అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తిని నాణ్యత సాకుతో సీసీఐ కొనుగోలు చేయకపోవడం, ప్రైవేటు ట్రేడర్లు నామమాత్రం ధర నిర్ణయిస్తున్నారు. పత్తి సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడిచినా.. ఇప్పటికి సీసీఐ ఖాతా తెరవలేదు. మార్కెట్‌లో ధరల పరిస్థితి రోజురోజుకు దిగజారుతు ంది. బేళ్ల ధరలు పడిపోవడం, గింజలకు డిమాండ్ లేకపోవడంతో వీటి ప్రభావం పరోక్షంగా పత్తి ధరలపై పడుతుండటంతో సీసీఐ నిబంధనలను అందుకోలేని రైతులకు నిరాశే ఎదురవుతుంది.

**అధికారుల గాలి మాటలు..**కొనుగోలు కేంద్రాలు మిల్లులలోనే ఉండటంతో సీసీఐ తిరస్కరించినా మిల్లు యజమాని మాత్రమే కొనుగోలు చేసే అవకాశముండగా.. పెద్దపల్లి మార్కెట్‌లో ఖరీదుదారులు ఆరేడుగురు ఉన్నప్పటికి.. ఒక్కరు మినహా మిగిలిన వారందరూ మిల్లుల యజమానులే కావడంతో పత్తి అవసరమైన సందర్భంలో మినహా ధర పెరిగే అవకాశం లేకుండా పోయింది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయిస్తామని చెప్పిన అధికారుల మాటలు గాలి మూటలే అయ్యాయి.

**గ్రామాల్లోకంటే అధ్వానం**–లక్కం మల్లేశం, కాకర్లపల్లి, మంథని

మా గ్రామంలో ఇంటివద్దనే దళారులు క్వింటాలుకు రూ.5900 చెల్లిస్తామన్నారు. కానీ మార్కెట్‌లో ఎక్కువ రేటు పలుకుతుందని వస్తే ఇక్కడ కేవలం రూ.6200లకే పరిమితమైంది. కనీసం రూ.7500 వరకు పలికితే రైతులకు ప్రయోజనముంటుంది.

**పెట్టుబడి రాలేదు–మల్లేశ్వరి, కన్నాల, పాలకుర్తి మండలం**

ఎకరం పొలంలో పత్తి సాగు చేశాం. పెట్టుబడి రూ.50 వేలు దాటింది. అమ్మితే వచ్చిన డబ్బులు పెట్టిన పెట్టుబడి ఖర్చులకు కూడా సరిపోవు. క్వింటాల్ రూ.5700 పలికింది. కనీసం రూ.7 వేలు ఇస్తే కొంతమేర ప్రయోజనం కలిగేది.

**రూ.6200 దాటడం లేదు–శ్రీనివాస్, హన్మంతునిపేట, పెద్దపల్లి**

సీసీఐ కొనుగోళ్లలో మెలిక పెట్టడంతో మార్కెట్‌కు పత్తి తీసుకువచ్చాం. ఇక్కడ నాణ్యత బాగున్నా.. క్వింటాలు ధర రూ.6200లకు మించలేదు. అవసరముంటేనే అమ్ముకొండని ఇక్కడివారు బహిరంగంగా చెబుతున్నారు.

# చచ్చినా 'చావే'..!



సిరిసిల్ల : ఆరేళ్లుగా పట్టింపు కరవు : ఈ చిత్రంలో కనిపిస్తోంది రాజీవ్‌నగర్‌లోని ఈదుల చెరువు సమీపంలో వైకుంఠధామం నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం. 2019లో స్థానిక ఎమ్మెల్యే వైకుంఠధామం నిర్మాణానికి శిలాఫలకం వేశారు. ఆరేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు తట్టెడు మట్టి పోయలేదు. ఎవరైనా మరణిస్తే చెరువు శిఖంభూమిలో ఖననం చేస్తున్నారు. వర్షాకాలం చెరువు నిండటంతో దహన సంస్కారాలు చేయడానికి ఇబ్బందులు పడుతున్నారు.

ఆఖరి మజిలీ గౌరవప్రదంగా జరగాలన్న పేదల కోరిక నెరవేరడం లేదు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాల, ముష్టిపల్లి, రగుడు, చంద్రంపేట, పెద్దూరు, సర్ధాపూర్ తదితర గ్రామాల్లో వైకుంఠధామాలు లేక.. ఉన్నచోట కనీస వసతులు లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి అంతిమ సంస్కారాలు చేయడానికి ప్రజలు, కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. వారు చనిపోయిన దుఃఖం కంటే అంతిమ సంస్కారాల ఎలా చేయాలనేది వారిని ఎక్కువగా బాధిస్తోంది. సిరిసిల్ల మున్సిపల్‌లో ఈ గ్రామాలు వీలినమై ఏళ్లు గడుస్తున్నా శ్మశానవాటికలు పూర్తి స్థాయి నిర్మాణానికి నోచుకోవడం లేదు. కొన్ని చోట్ల శిలాఫలకాలకే పరిమితం కాగా.. మరికొన్ని చోట్ల అసంపూర్తి దశలో ఉన్నాయి.

**నిర్లక్ష్యం.. చెట్ల పొదలే నిదర్శనం :** సిరిసిల్ల మున్సిపల్ పరిధి సర్ధాపూర్‌లో రూ.లక్షలు వెచ్చించి శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టారు. రెండు గదులు నిర్మించగా, బర్నింగ్ ప్లాట్ ఫామ్, విద్యుత్తు, నీటి వసతులను ఏర్పాటు చేయలేదు. అటు పాలకులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడంతో ఇలా చెట్ల పొదలతో దర్శనమిస్తోంది. సొంత భూమి లేని పేదల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చివరకు మానేరు వాగులో ఖననం చేస్తున్నా.. వాగు ప్రవహించినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**పట్టించుకోని అధికారులు**విలీన గ్రామమైన చిన్నబోనాలలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దహన సంస్కారాలకు చెరువులు కుంటలు దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రగుడులో రూ.లక్షలు పెట్టి వైకుంఠధామ నిర్మాణం చేపట్టినా అరకొర వసతులతో ఇబ్బందులు పడుతున్నారు. చంద్రంపేటలో ఉన్న వైకుంఠధామం అసంపూర్తి నిర్మాణ ంతో కొట్టుమిట్టాడుతోంది. నీరు, విద్యుత్తు సరఫరా ఇతర వసతులు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి వైకుంఠధా మాల్లో పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# రసీదులిస్తూ.. సొమ్ము కాజేస్తూ..



జగిత్యాల : పురపాలికలకు ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను వసూళ్లలో సిబ్బంది చేతివాటం పరిపాటిగా మారింది. జగిత్యాల పట్టణంలో సుమారు 24 వేల గృహాలుండగా ఏటా రూ.5 కోట్ల ఆస్తిపన్ను వసూలవుతోంది. కొందరు బిల్ కలెక్టర్లు యజమానుల నుంచి స్వీకరించిన సొమ్మును సొంతానికి వాడుకుంటున్నారు. కార్యాలయంలో దస్త్రాలపై పర్యవేక్షణ లేకపోవడంతో పాటు మూడేళ్లుగా 16 మంది కమిషనర్లు మారడంతో సిబ్బంది 'ఆడిందే ఆట'గా మారింది.

**జరుగుతోంది ఇలా..**

వసూలు చేసిన ఆస్తిపన్ను సొమ్మును కాజేయడానికి కొందరు సిబ్బంది ప్రత్యేక వ్యూహం అమలు చేస్తున్నారు. రూ.వేలల్లో బకాయిలున్న యజమానుల వద్దకు వెళ్లి వసూలు చేసి రసీదు అందజేస్తారు.

రసీదు పుస్తకంలో రెండు కాగితాలుంటాయి. పైదాన్ని యజమానికి రాసిస్తారు.

కార్యాలయానికి సంబంధించిన రెండో రసీదులో సొమ్మును తక్కువగా చెల్లించినట్లు నమోదు చేస్తారు.

కార్యాలయంలో రసీదు పుస్తకమే ప్రామాణికం కావడంతో ఎవరికీ అనుమానం రాదు.

సంబంధిత యజమాని కార్యాలయానికి వచ్చి విచారణ చేస్తే తప్ప అక్రమాలు వెలుగులోకి రావనే ధీమా సిబ్బందిలో ఉంది.

ఈ క్రమంలోనే బిల్‌కలెక్టర్ గంగనర్సయ్యకు సంబంధించిన లెక్కల్లో రూ.60 వేల తేడా రావడంతో అతడిని సస్పెండ్ చేశారు. అయితే అప్పుడే మరింత లోతుగా విచారణ జరిపితే రూ.17 లక్షల వ్యవహారం కూడా బయటపడి ఉండేది.

ఉన్నతాధికారులు విచారణ జరిపితే గత రెండేళ్ల అక్రమాలు మరిన్ని బయటపడే అవకాశం ఉంది.

**జైలుకు వెళ్లినా ఏదీ మార్పు?**

మూడేళ్లలో 8 మంది పురపాలక సిబ్బంది జైలుకు వెళ్లారు.

ఆస్తిమార్పిడి కేసులో ఏకంగా కమిషనర్ సైతం జైలుకు వెళ్లినా దిద్దుబాటు చర్యలు లేవు.

పన్ను వసూలుకు సంబంధించి ఇటీవల వార్డు అధికారులకు బాధ్యతలు కేటాయించారు.

వాహనాల మరమ్మతు, ఇంధన వినియోగం, ఆస్తిమార్పిడి, పన్ను వసూలులో తరచూ అక్రమాలు వెలుగుచూసినా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, రెవెన్యూ విభాగాల్లో పారదర్శక సేవలు అందుబాటులోకి వస్తేనే అవినీతికి అడ్డుకట్ట పడుతుంది.

**ఇదీ వసూలు విధానం**పురపాలిక రెవెన్యూ విభాగంలోని బిల్ కలెక్టర్లు వార్డుల్లో ఇంటింటికీ తిరిగి యజమానుల నుంచి ఆస్తిపన్ను వసూలు చేసి రసీదు అందజేస్తారు. సాయంత్రం కార్యాలయానికి వచ్చిన తర్వాత యజమాని ఇంటి నంబరు, కార్యాలయ రసీదు నంబరు నమోదు చేయాల్సి ఉంటుంది. దీనిపై ఆర్‌వో, మేనేజర్ సంతకాలు చేస్తారు. క్యాషియర్ డబ్బు బ్యాంకులో జమ చేసిన తర్వాత సీనియర్ అకౌంటెంట్ ఈ వివరాలన్నీ సరిపోల్చి ధ్రువీకరించాల్సి ఉంటుంది.

# ఇలా 'గాలి'కొదిలేస్తే ఎలా?

ఖమ్మం: పెట్రోల్ బంకుల నిర్వాహకులు నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. చట్టం ప్రకారం వినియోగదారులకు సేవలందించటం లేదు. చాలా బంకుల్లో సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలున్నాయి. పెట్రోల్, డీజిల్ తక్కువగా వస్తోందని, నీళ్లు కలుపుతున్నారని కొన్ని బంకుల వద్ద వినియోగదారులు తరచూ ఆందోళనలు చేయటం సర్వసాధారణంగా మారింది. ఆ సమయంలో హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. **అలంకారప్రాయంగా యంత్రాలు**

పెట్రోల్ బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లలో గాలి చెక్ చేసి అవసరమైతే ఉచితంగా వాయువు నింపాలి. ప్రతి బంకులో గాలి నింపే యంత్రాలు ఏర్పాటుచేసినా అవి చాలాచోట్ల పనిచేయవు. యంత్రం పనిచేయటం లేదని, వర్కర్లు లేరని సిబ్బంది చెబుతున్నారు. తర్వాత రావాలని సూచిస్తుంటారు. చాలా బంకుల్లో యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి.


బంకుల్లో ఉచితంగా గాలి నింపేందుకు నిర్వాహకులు ఆసక్తి చూపనందున వాహనదారులు నష్టపోతున్నారు.

రోడ్డు పక్కన నిర్వహించే టైర్ పంక్చర్ దుకాణాల్లో ద్విచక్రవాహనానికి చెందిన ఒక టైరులో గాలి నింపితే రూ.10 తీసుకుంటున్నారు.

కారు, ఆటోలకు ఒక టైర్‌కు రూ.20 చొప్పున ఛార్జీ వసూలుచేస్తున్నారు. లారీలు, ట్రాక్టర్లు, బస్సులకు సంబంధించి ఒక్కో టైర్‌కు రూ.25 నుంచి రూ.50 తీసుకుంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో సేవలు మరింత దారుణంగా ఉన్నాయి.

మరుగుదొడ్లు ఉన్నా అనుమతించరు..



స్వచ్ఛభారత్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రతి బంకులో మరుగుదొడ్లు నిర్మించాలని సూచించింది. వాటిని పౌరులెవరైనా వినియోగించుకునే అవకాశం కల్పించింది.

పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేసినా, చేయకున్నా అటుగా వెళ్లే వ్యక్తులు అత్యవసరంగా బంకుల్లో మరుగుదొడ్లు వినియోగించుకోవచ్చు.

ఆయా బంకుల వద్ద అందరికీ కనిపించే విధంగా మరుగుదొడ్లు ఉన్నాయని, వాడుకోవచ్చునని బోర్డులు అమర్చాలి.

బంకుల వద్ద చిన్నసైజులో బోర్డులు ఏర్పాటుచేసినా నిర్వాహకులు లోపలికి అనుమతించటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొన్ని బంకుల్లో మరుగుదొడ్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అనేక బంకుల్లో తాగునీటి సదుపాయం లేదు.

గాలి నింపే యంత్రాలను బంకుల్లో ఏర్పాటుచేశారు. వినియోగదారులు కోరితే టైర్లలో గాలి చెక్ చేసి అవసరం మేరకు నింపుతున్నారు. మరుగుదొడ్లు వాడితే అభ్యంతరం చెప్పొద్దు. సేవల్లో లోపాలుంటే తహసీల్దారు లేదా పౌరసరఫరాలశాఖ లేదా చమురు సంస్థల అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

ఎం.గోపాలరావు, పెట్రోల్ బంకుల యజమానుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖమ్మం

రోజుకు సగటున పెట్రోల్, డీజిల్ విక్రయాలు (లక్షల లీటర్లలో)


ఖమ్మం: 16 భద్రాద్రి: 5.25పెట్రోల్ బంకులు

ఖమ్మం: 223 భద్రాద్రి: 105

# అధిక సాంద్రత.. దిగుబడుల మోత

సంగారెడ్డి: ఉమ్మడి జిల్లాలోని నేలలు అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేందుకు అనువైనవని మహారాష్ట్ర నాగపూర్‌లోని ఐసీఎఆర్ (కేంద్ర పత్తి పరిశోధన సంస్థ) నిర్ధారించింది. దీంతో మూడేళ్లుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులను ఎంపిక చేసి, వారి భూముల్లో సాగు చేయిస్తూ ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా, ఈ ప్రాజెక్టును నిలిపి వేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా పత్తి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో ఈ విధానాన్ని మరో మూడేళ్ల పాటు కొనసాగించాలని కర్షకులు కోరుతున్నారు. 2023 నుంచి ఐసీఎఆర్ (కేంద్ర పత్తి పరిశోధన సంస్థ), జాతీయ ఆహార భద్రతా మిషన్ కింద పత్తి ప్రత్యేక ప్రాజెక్టును అమలు చేస్తోంది. మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలతో పాటు తమిళనాడుల్లో ఈ విధానంలో పత్తి సాగు చేస్తున్నారు. ః ఉమ్మడి జిల్లాలో మూడేళ్లుగా ఎంపిక చేసిన రైతుల ద్వారా సాగు చేయించారు. సాధారణ సాగుతో పోల్చితే పెట్టుబడి ఎక్కువ వ్యయం చేయాల్సి ఉంటుంది. అందువల్లే ఎకరానికి రూ.6 వేలు ప్రోత్సాహకంగా ఐసీఎఆర్ అందిస్తోంది సాగు విధానం..దిగుబడులు

ఉమ్మడి జిల్లాలో 90ఐ90 సెం.మీ. అంతరంలో విత్తనాలు నాటుతూ



ఎకరానికి 10వేల మొక్కలు ఉండే చతురస్ర నాటు విధానాన్ని కొనసాగిస్తున్నారు.అధిక సాంద్రత విధానంలో 90 15 సెం.మీ.అంతరంలో ఎకరానికి 30 వేల మొక్కలు నాటిస్తున్నారు. మొక్కల సంఖ్య పెరగడం వల్ల అవసరాన్ని బట్టి పీజీఆర్(ప్లాంట్ గ్రోత్ రెగ్యులేటర్)ను ఒకటి రెండు సార్లు పిచికారీ చేయాల్సి ఉంటుంది. మొక్కల మధ్య గాలి ప్రసరణకు వీలు కలుగడంతో పాటు తెగుళ్ల వ్యాప్తిని నివారిస్తుంది.

సాధారణ పద్ధతితో ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, అధిక సాంద్రత విధానంలో 12 నుంచి 16క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తోంది. ఈ పద్ధతి ద్వారా ఒక్కో ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35వేల వరకు ఆదాయం వస్తుంది.

ఎంపిక చేసిన పొలాల్లో సాగు చేయిస్తున్నాం

డాక్టర్.రవికుమార్, శాస్త్రవేత్త, కృషివిజ్ఞాన కేంద్రం, తునికి

ఎంపిక చేసిన రైతుల ఆధ్వర్యంలో పొలాల్లో పత్తి సాగు చేయిస్తూ అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నాం. సాధారణం కంటే అధిక సాంద్రత విధానంలో పత్తి సాగుచేస్తేనే లాభాలు రానున్నాయి. సలహాలు, సూచనలు అందించేందుకు తునికి కృషివిజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారు.

# మెదడులో.. కల్లోలం

హైదరాబాద్ : విదేశాల్లో ఉంటున్న ఓ యువకుడికి (30) ఏడాది క్రితమే పెళ్లి అయింది. ఇటీవల పాప పుట్టింది. పాపను చూసేందుకు హైదరాబాద్‌కు వచ్చాడు. ఇంతలోనే బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయాడు. నిమ్స్‌కు నిత్యం పది వరకు బ్రెయిన్ స్ట్రోక్ కేసులు వస్తున్నాయి. వీటిలో 1-2 కేసులు యువతేనని వైద్యులు చెబుతున్నారు. ఇందులో ఎక్కువ ఇస్కీమిక్ స్ట్రోక్ (బ్రెయిన్‌లో క్లాట్ వల్ల రక్తనాళం మూసుకుపోవడం), తర్వాత స్థానంలో హెమరేజిక్ స్ట్రోక్ (రక్తనాళం పగిలిపోవడం వల్ల మెదడులో రక్తస్రావం సంభవించడం) కేసులు ఉంటున్నాయని నిమ్స్ వైద్యులు పేర్కొంటున్నారు. గతేడాది కంటే 10-15శాతం కేసులు పెరిగాయని వివరించారు.

**ఆ రెండే ఎక్కువ..:** బ్రెయిన్‌స్ట్రోక్‌లో మూడు రకాలు నమోదవుతున్నాయి. మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు ఇస్కీమిక్ స్ట్రోక్, మెదడులో రక్తనాళాలు పగిలితే హెమరేజిక్ స్ట్రోక్, మెదడుకు రక్తసరఫరా ఆగినప్పుడు ట్రాన్సియంట్ ఇస్కీమిక్ స్ట్రోక్(టీఐఏ)గా వ్యవహరిస్తారు. ఎక్కువగా ఇస్కీమిక్ స్ట్రోక్,



హెమరేజిక్ స్ట్రోక్ నమోదవుతుంటాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

**అది పాత మాట..**

ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో ఎక్కువగా బ్రెయిన్‌స్ట్రోక్ కన్పించేది. మారుతున్న జీవనశైలితో యువతలోనూ ఈ సమస్య పెరుగుతోంది. మెదడు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన తర్వాత తొలి 6 గంటలు చాలా కీలకం. ఆలస్యమైన కొద్దీ ప్రాణాలకు ముప్పే.

**ప్రధాన కారణాలు..**

అధిక రక్తపోటు
మధుమేహం
అధిక కొలెస్ట్రాల్
నిద్రలేమి
పొగతాగడం, మద్యపానం
శారీక శ్రమ లేకపోవడం
తీవ్ర ఒత్తిడి, ఆందోళన

**నిమ్స్‌లో..**

నిత్యం ఓపీ-2000పైనే
న్యూరాలజీ- 250-300
బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు-10-15
ఇస్కీమిక్ కేసులు-6-7
హెమరేజిక్-3-4

**ఆసుపత్రికి తరలించే సమయమే కీలకం...**

- డాక్టర్ వంశీకృష్ణ, సీనియర్ న్యూరోసర్జన్, నిమ్స్

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తిని ఎంత వేగంగా ఆసుపత్రికి తరలిస్తే అంత మేలు జరుగుతుంది. గతంతో పోల్చితే కేసులు సంఖ్య పెరిగింది. పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడి తగ్గించుకోవడం, సరైన నిద్ర, నిత్యం వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి.

# మ్యుటేషన్ ఇక ఆన్‌లైన్‌లో


హైదరాబాద్ : మ్యుటేషన్ దరఖాస్తు ప్రక్రియను జీహెచ్‌ఎంసీ డిజిటలీకరణ చేసి.. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవలు మొదలయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మీసేవా కేంద్రాలు, పౌర సేవాకేంద్రాలు, అధికారుల వద్దే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఫలితంగా దళారుల జోక్యం, లంచాల వసూలు పెరిగింది. ఈ విషయమై ఫిర్యాదులు పెరగడంతో దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేశారు.

**పాత రిజిస్ట్రేషన్లకే..**

గత సర్కారు హయాంలో భూమి, ఇంటి రిజిస్ట్రేషన్‌తో పాటు ఆస్తిపన్ను రికార్డుల్లో యజమాని పేరు మారే విధానం అందుబాటులోకి వచ్చింది. అప్పటినుంచి రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ జరిగిపోతోంది. 2020 సంవత్సరానికి ముందు రిజిస్ట్రేషన్లు చేసుకుని, ఇంకా పన్ను రికార్డుల్లో పేరు మార్చుకోని వారు వేలల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో యజమానులు నేరుగా దరఖాస్తు చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**మొత్తం సేవలన్నీ..**

కొత్తగా కట్టిన భవనాలకు ఆస్తిపన్ను స్వీయ మదింపు(సెల్ఫ్



అసెస్‌మెంట్)నకూ ఆన్‌లైన్‌లో స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చు. పన్ను సవరణ, విశ్రాంత సైనికుల కేటగిరీలో పన్ను మినహాయింపు, ఫోన్ నంబరును మార్చుకోవడం, తప్పుల సవరణ తదితర సేవలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌలభ్యాన్ని జీహెచ్‌ఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చింది. మూతపడిన వ్యాపారాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్సుల రద్దుకు ఆన్‌లైన్‌లో అర్జీ సమర్పించవచ్చు.

ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) మ్యుటేషన్‌కూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు అందుబాటులోకి వచ్చింది. ఒకే ఇంటికి రెండు, మూడు ఆస్తిపన్ను నంబర్లు(పీటీఐఎన్) తీసుకున్నారు. వాటిని రద్దు చేసుకోవాలనుకునే వారికి, ఖాళీ స్థలాలకు ఉండే అదనపు పన్ను నంబర్ల రద్దుకూ దరఖాస్తు అందుబాటులోకి వచ్చింది.

# అశాస్త్రీయంగా బ్యాటరీల రీసైక్లింగ్



హైదరాబాద్: పదుల సంఖ్యలో లెడ్ యాసిడ్ బ్యాటరీ రీసైక్లింగ్ యూనిట్లు నిబంధనలను ఉల్లంఘిస్తూ నగరంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వెలువడే వ్యర్థాలను జలాశయాలకు తరలిస్తూ కాలుష్యాన్ని పెంచుతున్నాయి. కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో), కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీఎఫ్‌ఈ) అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తుంటడంతో కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నిఘా లేకుండా పోతోంది. అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేస్తుండటంతో భూ, జల, వాయుకాలుష్యం ఏర్పడుతోంది.

**ప్రక్రియ ఇదీ...**

బ్యాటరీలను శాస్త్రీయ పద్ధతుల్లో, పీసీబీ సూచనల మేరకు రీసైక్లింగ్ చేయడం ద్వారా ప్రమాదకర రసాయన పదార్థాలు బయటకు రాకుండా కాలుష్యాన్ని నివారించొచ్చు. ఉపయోగించిన బ్యాటరీల నుంచి నికెల్, లిథియం, కోబాల్ట్ వంటి లోహాలను తిరిగి పొందడం ద్వారా కొత్త బ్యాటరీల తయారీకి గనులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఈ ప్రక్రియలో బ్యాటరీలను ముందుగా డిశ్చార్జి చేసి ఆపై జాగ్రత్తగా విడదీసి, చిన్న చిన్న ముక్కలుగా కత్తిరిస్తారు. వాటి భాగాల నుంచి లోహాలను వేరు చేయడానికి పైరో మెటలర్జీ (అధిక ఉష్ణోగ్రతలను ఉపయోగించి లోహాలను కరిగించి వేరు చేస్తారు), హైడ్రో మెటలర్జీ (రసాయన ద్రావణాలను వినియోగించి విలువైన లోహాలను కరిగించి వేరు చేస్తారు).

లోహాలను శుద్ధి చేసి బ్యాటరీలలో లేదా ఇతర వస్తువుల్లో తిరిగి ఉపయోగిస్తారు.

**ఏం చేస్తున్నారు..?**

సాధారణంగా డీలర్లు, సర్వీస్ సెంటర్లు లేదా స్పెషల్ కలెక్షన్ పాయింట్ల ద్వారా పాత బ్యాటరీలను సేకరించాలి. తయారీదారులు, డీలర్లు ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్) కింద వీటిని తిరిగి సేకరించాలని సీపీసీబీ నిబంధనలు వెల్లడిస్తున్నాయి. నగరంలో ఈ బాధ్యతను 40 సంస్థలకు అప్పగించారు. కానీ ఇవి అనధికారికంగా ఏర్పాటవుతున్న కేంద్రాలకు తరలివెళ్తుండటం గమనార్హం.

అనుమతి లేకుండా ఉన్న యూనిట్లలో ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ ఎక్విప్‌మెంట్‌లు ఏర్పాటు చేయడం లేదు. ఫర్నేస్‌లకు బ్యాగ్ ఫిల్టర్లు ఏర్పాటు చేయడం లేదు. చేసినా వాటి నిర్వహణను విస్మరిస్తున్నారు. బ్యాటరీల నుంచి వచ్చే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు.

ఉదయం పూట పనిచేస్తే స్థానికుల నుంచి ఇబ్బందులొస్తాయని రాత్రి 12నుంచి ఉదయం 8గంటల వరకు వీటిని నిర్వహిస్తున్నారు.

# వడ్డీపై ఆశలు.. ఊడ్చేస్తున్నారు అసలు



తాండూరు : తాండూరుకు చెందిన ఓ మెడికల్ దుకాణం యజమాని, చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ.. సుమారు రూ.10 కోట్లకు పైగా బకాయిలు పెట్టి చెప్పా పెట్టకుండా కనిపించకుండా పోయాడు. తాండూరులోని రెండు చిట్‌ఫండ్ సంస్థలు అధిక వడ్డీ, చిట్టీల డబ్బులను ఎగ్గొట్టి చేతులెత్తేశాయి. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఓ వ్యాపారి ఒక ప్రముఖ కంపెనీ ఏజెన్సీ నడిపించి తెలిసిన వ్యాపారుల వద్ద రూ.3 కోట్ల వరకు అప్పు చేశాడు. కోర్టును ఆశ్రయించి రక్షణ కోరారు. మూడేళ్లు గడిచినా ఒక్కరికీ ఆ డబ్బులు చెల్లించలేదు. అధిక వడ్డీలకు ఆశ పడుతున్నారా.. జాగ్రత్త.. మొదటికే మోసపోయే ప్రమాదం ఉంది. తాండూరులో ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో రూపాయి కూడబెట్టుకోవాలన్నా.. తెలిసిన వారి వద్ద చీటీలు వేసుకొని రెట్టింపు చేసుకోవాలన్నా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి. ఒకరిద్దరు కాదు పదుల సంఖ్యలో స్థానికంగా బడాబాబులు పేద, మధ్యతరగతి ప్రజలను మోసగించి ఉడాయించారు. కొన్ని ఘటనలు బయటపడుతున్నా.. చాలా వెలుగుచూడడంలేదు.

**వ్యాపార కేంద్రం కావడంతో..**

తాండూరు వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం రూ.కోట్లలో చేతులు మారుతుంటాయి. ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా కొందరు ప్రైవేటు చిట్టీ వ్యాపారులు అధిక వడ్డీలను ఆశ చూపిస్తున్నారు. ముందుగా నమ్మకం కల్పిస్తూ లావాదేవీలు రూ.కోట్లకు చేరుకోగానే అసలుతో సహా ఊడ్చుకొని అడ్రసు లేకుండా పోతున్నారు. కొందరు వ్యాపారస్థులు పెట్టుబడుల కోసం రోజువారీ రూ.లక్ష నుంచి ఆపై ఇచ్చిపుచ్చుకోవడాలు చేస్తున్నారు. ఇలాంటి లావాదేవీల్లో జాగ్రత్తలు తీసుకోకపోతే మోసపోయే ప్రమాదం ఉంది.

**కుమార్తె పెళ్లి కోసం దాచుకున్నా..** - వెంకట కృష్ణ, తాండూరు

చిట్టీ ముగిశాక రూ.5 లక్షలు నిర్వాహకుడికే అప్పగించాను. వచ్చే వడ్డీతో మరో చీటీ నడుస్తుందని రెండేళ్లలో రూ.10 లక్షలు ఇస్తానని చెబితే నమ్మాను. వచ్చే నగదుతో కుమార్తె వివాహం చేయాలనుకున్నా. ముఖం చాటేశాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా.

**బ్యాంకులు, విశ్వసనీయ సంస్థలనే నమ్మాలి** - విశ్రాంత పోలీసు అధికారి

డబ్బు దాచుకోవాలన్నా.. భవిష్యత్తవసరాలకు పొదుపు చేసుకోవాలన్నా.. బ్యాంకులు, విశ్వసనీయ లిమిటెడ్ సంస్థలను ఆశ్రయిస్తే మంచిది. పెద్ద సంస్థలు సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులకు చిట్టీ మొత్తాన్ని డిపాజిట్ చేస్తాయి. ఆ శాఖ తరచూ లావాద్లేవీలనూ పర్యవేక్షిస్తుంది. అందువల్ల దాచుకున్న డబ్బుకు భద్రత ఉంటుంది.

# వర్ష సూచన.. రైతుల యాతన



జగిత్యాల : జిల్లాలో రాగల అయిదు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు తెలపటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన.. కోసిన ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక వారికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. జిల్లాలో దాదాపు 30 శాతం వరి కోతలు పూర్తి కాగా.. వంద వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కానీ ఎక్కడా తూకం ప్రారంభిచకపోవటంతో రైతులకు శాపంగా మారింది. ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుందని సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎస్.హరీష్‌కుమార్‌శర్మ చెప్పారు. గాలిలో తేమ 61-96 శాతం, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21-23 డిగ్రీలు, గరిష్ఠంగా 26-32 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

**అనేక రకాలుగా నష్టం**జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. బుధ, గురు, శుక్రవారాల్లో భారీ వర్షసూచన ఉండటంతో సాగు పంటలు, నూర్పిడి చేసిన ఉత్పత్తులు తడిసి తీరని నష్టం వాటిల్లుతుందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మక్కలను ఆరబెట్టడం, మార్కెటింగ్ చేస్తున్న తరుణంలో వర్షాలతో నాణ్యత దెబ్బతిని మార్క్‌ఫెడ్ సేకరణకు వీలులేకుండా పోతోంది. 3.15 లక్షల ఎకరాల్లో సాగుచేసిన వరిలో అన్ని గ్రామాల్లో నూర్పిడి చేపడుతూ.. ధాన్యాన్ని విక్రయ కేంద్రాల్లో ఆరబెడుతున్నారు. అయితే అన్ని కేంద్రాలు మట్టివి కావటం, తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో లేకపోవటంతో తడిసే అవకాశం ఉంది. 27 వేల టార్పాలిన్లు ఉన్నట్లు అధికారులు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో 10వేలు కూడా ఉండవనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్యార్డుల్లో వసతులు లేక కుప్పలు పోసిన ధాన్యం వరదనీటికి కొట్టుకుపోవటం, తడవటంతో రైతులకు నష్టం వాటిల్లనుంది. పంట ఉత్పత్తులు తడిస్తే నాణ్యత దెబ్బతిని ప్రభుత్వరంగ సంస్థలు సేకరించక పోగా.. తక్కువ ధరకు ప్రైవేటుగా అమ్ముకుని కర్షకులు నష్టపోతారు. వర్షాలతో గాలిలో తేమశాతం పెరిగి దీర్ఘకాలిక వరి రకాల్లో సుడిదోమల తీవ్రత పెరగటం, మామిడి, పసుపు, కంది, కూరగాయలు తదితర వాటిల్లో చీడపీడల ఉద్ధృతి పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎత్తు ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచిస్తున్నారు.

# సరిహద్దు దాటితే.. ఆరోగ్య భద్రత లేనట్టే..!

కొత్తగూడెం : దేశవ్యాప్తంగా పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యమందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలుచేస్తోంది. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్యశ్రీ'లో విలీనం చేసింది. తద్వారా తెలంగాణలోని ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రత్యేకంగా అందించలేదు. ఉద్యోగ నిర్వహణ, చదువుల నిమిత్తం ఇతర రాష్ట్రాల్లో ఉండే తెలంగాణ వాసులు అక్కడ ఆయుష్మాన్ భారత్ పథకానికి నోచుకోలేకపోతున్నారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యసేవలు పొందుతుండటం గమనార్హం. పరిష్కారం దిశగా ఆలోచిస్తేనే..రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈకేవైసీ పూర్తిచేసుకున్న అర్హులకు భౌతిక-డిజిటల్ ఆయుష్మాన్ భారత్ కార్డులను జారీ చేయాలి. తెలంగాణలో తెల్లరేషన్‌కార్డులు కలిగిన కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యమందుతున్నప్పటికీ.. ఆయుష్మాన్ భారత్ కింద ఇతర రాష్ట్రాల్లో రూ.5లక్షల వరకు వైద్యసేవలు పొందలేకపోతున్నారు. ఇదే విషయంపై ఓ వైద్యాధికారిని 'ఈనాడు' వివరణ కోరగా.. ఇది రాష్ట్రవ్యాప్త సమస్య అని, ఆరోగ్యశ్రీలో ఆయుష్మాన్ భారత్ విలీనమవటం వల్ల తెలంగాణలో తెల్లరేషన్‌కార్డులు ఉన్నవారందరికీ రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందుతోందని తెలిపారు. ఆయుష్మాన్ కార్డులు లేకపోవటం వల్ల ఇతర రాష్ట్రాల్లో వైద్యసేవలు అందట్లేదని చెప్పారు.

# కొత్త మార్కెట్‌పై దృష్టి

గోదావరిఖని: సింగరేణి వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. ఉత్పత్తి చేసిన బొగ్గును మార్కెట్ చేసుకోవడంపై దృష్టి సారించింది. కొత్త వినియోగదారులను సమకూర్చుకునే పనిలో పడింది. తాజాగా తమిళనాడు పవర్ కార్పొరేషన్‌కు 2.88 మిలియన్ టన్నుల బొగ్గు రవాణాకు ఒప్పందం చేసుకొంది. ఒడిశాలోని నైనీ నుంచి జీ-11 గ్రేడ్ బొగ్గు సరఫరాకు ఆ సంస్థతో ఒప్పందం కుదిరింది. తమిళనాడు నార్త్ చెన్నై విద్యుత్తు కేంద్రానికి 1.75 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేస్తోంది. కొత్త మార్కెట్‌ను సమకూర్చుకుంటున్న సింగరేణి నైనీ బ్లాకు నుంచి ఈ ఏడాది 4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకొంది. ఇంకా 1.12 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు కొత్త వినియోగదారులను సమకూర్చుకొనే దిశగా ప్రయత్నాలు చేస్తోంది.

**నగదు వినియోగదారులపై దృష్టి**

సంస్థ నగదు వినియోగదారులపై ఎక్కువ దృష్టి సారించింది. ఇప్పటికే బొగ్గు సరఫరా చేయడం ద్వారా రావాల్సిన బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థికంగా



ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో కొత్తగా మార్కెట్ విస్తరిస్తూ బొగ్గు సరఫరా చేయడం ద్వారా వెంటనే డబ్బులు చెల్లించే సంస్థలకు బొగ్గు సరఫరా చేయనుంది. ప్రస్తుతం ఎన్టీపీసీ మాత్రమే సింగరేణికి వెంటనే బిల్లులు చెల్లిస్తోంది. ఏటా 12 మిలియన్ టన్నుల బొగ్గును తీసుకుంటున్న ఎన్టీపీసీ ఏ రోజుకారోజు చెక్కులు అందజేస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లోని విద్యుత్తు సంస్థలు కూడా దాదాపుగా వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జెన్‌కోల నుంచే భారీ మొత్తంలో బకాయిలు రావాల్సి ఉంది.

**అందుబాటులోకి ధరలు** వినియోగదారులకు బొగ్గు ధరలు అందుబాటులోకి తెచ్చేందుకు సంస్థ ఆలోచన చేస్తోంది. దీని ద్వారా మార్కెట్‌ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కోల్ ఇండియా కంటే సింగరేణి బొగ్గు ధర ఎక్కువగా ఉండటంతో వినియోగదారులు ముందుకు రావడం లేదు. బొగ్గు ధర తగ్గించుకోవడం ద్వారా కొత్త వినియోగదారులను తమ వైపు తిప్పుకోవడానికి సంస్థ ప్రయత్నిస్తోంది. సాధారణంగా కోల్ ఇండియాతో పోల్చితే సింగరేణి బొగ్గు ధర టన్నుకు రూ.1000 నుంచి రూ.2000 వరకు ఎక్కువగా ఉంది. దీంతో వినియోగదారులకు సింగరేణి బొగ్గు భారంగా మారుతుంది. రానున్న కాలంలో కొంత వరకు బొగ్గు ధరను తగ్గించి సరఫరా చేసే యోచన చేస్తోంది.

# ఆర్వోబీ పనులకు 'గేట్' పడింది

పెద్దపల్లి : జిల్లా కేంద్రంలో కూనారం రైల్వే గేట్ కష్టాలు తొలగించేందుకు రెండేళ్ల కిందట చేపట్టిన ఆర్వోబీ నిర్మాణ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. గేట్ వేసిన ప్రతీసారి వాహనదారులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు.

**నిర్వహణలో ఆలస్యం**

పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో రూ.199.5 కోట్ల అంచనా వ్యయంతో ఆర్వోబీ నిర్మాణ పనులకు 2022లో ప్రారంభించారు. రైల్వే నియంత్రణలోని వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరగా ఆర్అండ్‌బీ పరిధిలో రెండువైపులా అప్రోచ్ వంతెనల పనులకు భూసేకరణ అవరోధంగా మారింది. కూనారం వైపు నిర్మించిన ఓ వంతెనకు 14 పిల్లర్లు, మరో వంతెనకు 13 పిల్లర్లు మాత్రమే నిర్మించారు. ఇక్కడ ఓ గ్యాస్ గోదాంకు సంబంధించిన స్థలానికి చెల్లింపులు జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి 3 ఎకరాల స్థలం సేకరించాల్సి ఉంది. ఓ వైపు భూసేకరణ పూర్తి కాకపోవడం, మరోవైపు చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో గుత్తేదారు తప్పుకుంటున్నట్లు ఉన్నతాధికారులకు మౌఖిక సమాచారం ఇవ్వడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

**ఇక్కడ సైతం ఇబ్బందే..**

పాలకుర్తి మండలంలోని కన్నాల, పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి, గౌరెడ్డిపేట, చీకురాయి, ఓదెల మండలంలోని పొత్కపల్లి, కొలనూరు, ఓదెల వద్ద రైల్వేగేటు కష్టాలు నిత్యకృత్యం. ఓదెల మండలం ఉప్పరపల్లి,



పెద్దపల్లి మండలం కొత్తపల్లి వద్ద నిర్మించిన ఆర్‌యూబీలు వర్షాకాలంలో నీట మునుగుతుండటంతో కష్టాలు తప్పడం లేదు. ఇటీవల వినియోగంలోకి వచ్చిన కొత్తపల్లి అండర్‌పాస్‌లో మూడు వైపుల నుంచి దారులుండగా ఆర్‌యూబీ ప్రమాదకరంగా మారింది.

**ప్రతి పది నిమిషాలకు..**

కాజీపేట-బల్లార్ష సెక్షన్‌లో రైళ్ల రద్దీ అధికంగా ఉండటంతో ప్రతీ పది నిమిషాలకు ఒకసారి గేటు పడుతూ ఉంటుంది.

పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట, రాంపల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాలతోపాటు కాల్వశ్రీరాంపూర్ పూర్తిగా, ముత్తారం మండల కేంద్రంతోపాటు మరికొన్ని గ్రామాలకు అత్యవసర పరిస్థితుల్లో గేటు అవరోధంగా మారింది. గేటు పడితే 108 వాహనాల్లో తీసుకొచ్చిన వారిని అవతలవైపు ఇతర వాహనాల్లోకి మార్చి తరలించిన రోజులున్నాయి. ఈ పరిస్థితులు చక్కదిద్దేలా పనులను వేగిరం చేయాల్సిన అవసరముంది.

# వెలుగోడును ఆక్ర'ముంచారు'

నంద్యాల : అక్టోబరు చివర్లో మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు వెలుగోడు పట్టణాన్ని ముంచేశాయి. మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌తో సహా పలు ప్రాంతాల్లో మూడడుగులకు పైగా నీరు ప్రవహించింది. కొన్ని గంటలపాటు రాకపోకలు స్తంభించిపోయాయి. వెలుగోడు చరిత్రలో ఇప్పటివరకు కనీవిని ఎరుగని రీతిలో వరదలు ముంచెత్తడం స్థానికులను తీవ్ర ఆందోళనకు గురిచేసింది. దీనంతటికీ ప్రధాన కారణం.. పట్టణంలో ప్రవహించే రాళ్లవాగులో ఆక్రమణలే. ప్రధాన రహదారి చెంతనే ఉన్న ఈ వాగులో రెండు దశాబ్దాలుగా పెద్దగా నీరు పారిన దాఖలాల్లేవు. దీంతో అక్రమార్కుల కన్ను వాగు స్థలాలపై పడింది. పలువురు నాయకులు యథేచ్ఛగా ఆక్రమించి.. తప్పుడు సర్వే నంబర్లతో అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

**2 కి.మీలు.. వందకు పైగా కబ్జాలు**

వెలుగోడు మీదుగా రాళ్లవాగు సుమారు రెండు కిలోమీటర్ల మేర ప్రవహించి మంచినీళ్ల వాగులో కలుస్తుంది. ఈ రెండు కిలోమీటర్ల పరిధిలోని విలువైన భూముల్లో వందకు పైగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కొందరు తెలివిగా ఆలయాలు నిర్మించారు. వాటి పక్కనే అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఆలయాలు ఉంటే కట్టడాల జోలికి అధికారులు రారన్న ఉద్దేశంతో గుళ్లు కట్టారని స్థానికులు చెబుతున్నారు.

**శాఖల సహకారం**

అక్రమార్కులకు వివిధ శాఖల అధికారులు తమవంతు సహకరించారు. ఆక్రమించిన స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లకు రాకపోకలు సాగించేందుకు వీలుగా అధికారులు సీసీ రహదారులు ఏర్పాటు చేశారు. ఇళ్లకు



విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి విద్యుత్తుశాఖ అధికారులు స్తంభాలు ఏర్పాటు చేశారు. వసతులు కల్పిస్తుండటంతో మరికొందరు ముందుకొచ్చి వాగు భూములను వాటాలేసుకున్నారు.

**అధికారులకు కాసుల వర్షం**

అక్రమార్కులు కొందరు పంచాయతీ అధికారులకు భారీగా ముడుపులు ఇచ్చి భవన నిర్మాణానికి అనుమతులు పొందుతున్నారు. ఆస్తిపన్ను వేయించుకుని సక్రమం చేయించుకుంటున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఓ అధికారిణి అనుమతులు ఇచ్చేందుకు నిరాకరించారు. ఆమె బదిలీపై వెళ్లిన వెంటనే అనుమతులు ఇచ్చేయడం గమనార్హం.

**పొంచి ఉన్న ముంపు ముప్పు**

ఆక్రమణలకు గురైన వాగు భూముల విలువ రూ.వంద కోట్లకు పైగానే ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. అంతటి విలువైన భూములు అన్యాక్రాంతమవుతున్నా జల వనరులశాఖ అధికారులు చోద్యం చూశారు. వాగుతో పాటు బఫర్‌జోన్‌లో కూడా ఎలాంటి నిర్మాణాలు జరగకుండా కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముకాశారు. వాగులో ఆక్రమణలను తొలగించకపోతే భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి గ్రామంలోని వేలాది ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాగు భూములను సమగ్రంగా సర్వే చేయించి హద్దులు గుర్తిస్తే ఆక్రమణలు పూర్తిస్థాయిలో వెలుగు చూస్తాయి. ఎంత మొత్తం ఆక్రమణకు గురైంది? ఆక్రమిత భూముల్లో ఏఏ నిర్మాణాలున్నాయి తేల్చి చర్యలు చేపట్టాలని వెలుగోడు వాసులు డిమాండ్ చేస్తున్నారు.

# 'కని'కుట్టు

అచ్యుతాపురం : మహిళలు ఇంటివద్దే స్వయం ఉపాధి పొందడానికి కుట్లు, అల్లికలు చక్కటి మార్గం. అందుకే కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మహిళలకు మూడు నెలలపాటు ఉచితంగా కుట్టు, అల్లికలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ అనంతరం జీవనోపాధి పొందేలా కుట్టు మిషన్లు సైతం ఉచితంగా అందిస్తామని ముందే ప్రకటించారు. దీంతో ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. వేలాదిమంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. నెలలు గడుస్తున్నా వీరికి కుట్టుమిషన్లు ఇవ్వలేదు. పోనీ ధ్రువపత్రాలైనా చేతిలో పెట్టారా అంటే అదీ లేదు. దీంతో మహిళల ఆశలు అడియాశలుగా మారాయి. జిల్లాలో బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 24 మండలాల పరిధిలోని 19 కేంద్రాల్లో మహిళలకు కుట్టు శిక్షణ, అల్లికలపై మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చారు. రోజూ ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఒక విడతగా.. ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు విడతగా నేర్పించారు. ఇందులో మిషన్ కుట్టడంతోపాటు డిజైన్ ఆధారంగా దుస్తులు కత్తిరించడం, ప్రస్తుత మహిళల అభిరుచికి అనుగుణంగా మెలకువలతో ఎలా కుట్టాలి తదితర అంశాలపై నైపుణ్యం కలిగిన శిక్షకులతో తర్ఫీదు ఇచ్చారు. అనకాపల్లి నియోజకవర్గంలో చింతనిప్పుల అగ్రహారం, కశింకోట, పట్టణంలో తాకాశివీధి తదితర కేంద్రాల్లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కేంద్రాలను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సైతం సందర్శించి



మహిళలను ప్రోత్సహించి అభినందించారు.

తరగతుల్లో 75 శాతం హాజరు ఉన్నవారికి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామని ప్రకటించారు. డిజిటల్ విధానంలో ప్రతిరోజూ హాజరు నమోదు చేశారు. జిల్లావ్యాప్తంగా 2,268 మంది మూడు నెలల శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరంతా కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలు ఎప్పుడు ఇస్తారని రెండు నెలలుగా ఆశగా ఎదురు చూస్తున్నారు. చదువు, అర్హతతో సంబంధం లేకుండా శిక్షణ పూర్తిచేసిన మహిళల ందరికీ 50 శాతం రాయితీతో ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణాలు ఇవ్వనుందని సైతం అధికారులు ప్రకటించారు. కనీసం ఇదీ అమలు చేయలేదు.

**పరికరాలు రాగానే అందిస్తాం**

–జ్యోతిశ్రీ, కార్యనిర్వాహక సంచాలకులు, బీసీ కార్పొరేషన్

జిల్లాలోని మూడు నెలలపాటు కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళల జాబితాను తయారు చేసి ప్రభుత్వానికి పంపించాం. కుట్టు మిషన్లు, ధ్రువపత్రాలు ప్రభుత్వం నుంచి రాగానే మహిళలకు అందిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సి అవసరం లేదు.

# ఆధ్యాత్మిక క్షేత్రం నుంచి అంతరిక్ష రంగం



తిరుపతి :ఆధ్యాత్మిక క్షేత్రాలకు నిలయంగా ఉన్న తిరుపతి జిల్లాను అంతరిక్ష రంగంలోనూ అగ్రపథంలో నిలపాలనే కృతనిశ్చయంతో కూటమి ప్రభుత్వం ఉంది. పరిశోధన, ఉపగ్రహాల తయారీ, అసెంబ్లింగ్ యూనిట్లు, విడిభాగాల తయారీ, తదితర పరిశ్రమలు ఏర్పాటయ్యేలా కృషి చేస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 14న స్పేస్ సిటీకి శంకుస్థాపన చేశారు. తదనుగుణంగా జిల్లా యంత్రాంగం ఇప్పటికే భూముల సేకరణపై కసరత్తు ప్రారంభించింది. ఔత్సాహిక పెట్టుబడిదారులు యూనిట్ల స్థాపనకు ముందుకొస్తున్నారు. ఇవన్నీ వీలైనంత త్వరగా కార్యరూపం దాల్చితే జిల్లా ఖ్యాతి మరింత పెరుగుతుంది.

**లక్ష్యం.. 3వేల ఎకరాలు**

జిల్లాల పునర్విభజనతో తిరుపతికి సముద్ర తీర మూ వచ్చింది. శ్రీహరికోటలోని షార్ జిల్లా పరిధిలో ఉంది. ఈ నేపథ్యంలోనే స్పేస్ సిటీ ఏర్పాటుకు జిల్లా అనువుగా ఉంటుందని సీఎం చంద్రబాబు భావించారు. తొట్టంబేడు మండలం రౌతుసూరమాలను ఎంచుకున్నారు. తొలుత స్పేస్ సిటీకి 2,100 ఎకరాలు కేటాయించాలని అనుకున్నా భవిష్యత్తులో 3వేల ఎకరాలు అవసరమని అంచనా వేశారు. 4 బ్లాక్‌లుగా విభజించారు.

**571 ఎకరాల్లో మౌలిక వసతులు**

ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు రాగానే కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రాథమికంగా కొంత భూమి సేకరించాలని ఏపీఐఐసీ అధికారులను ఆదేశించారు. తొలుత 571.70 ఎకరాల్లో ప్రధాన, అంతర్గత రోడ్లు, విద్యుత్తు, డ్రైనేజీ, తదితర మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడ్డాయి. వీలైనంత త్వరగా ఈ పనులు పూర్తి చేసి పెట్టుబడిదారులకు అప్పగించాలని అనుకుంటున్నారు.

**ఇప్పటికే 300 ఎకరాలు కావాలని**

సీఐఐ భాగస్వామ్య సదస్సులో బెంగళూరుకు చెందిన ఓ సంస్థ 150 ఎకరాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరింది. మరో సంస్థ 150 ఎకరాల్లో పరిశ్రమ స్థాపిస్తామని పేర్కొంది. ఇప్పటికే 300 ఎకరాలను ఆయా సంస్థలకు అప్పగించే పనిలో ఏపీఐఐసీ నిమగ్నమైంది. తక్కువ ఖర్చుతో రాకెట్లు, శాటిలైట్లను తయారు చేసే స్టార్టప్‌లు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, దేశీయ, అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం స్పేస్ పాలసీ 4.0ను రూపొందించింది.

**అన్నీ అనుకూలతలు**–వెంకటేశ్వర్, కలెక్టర్

స్పేస్ సిటీకి అవసరమైన అన్ని అనుకూలతలు జిల్లాలో ఉన్నాయి. పరిశోధనలకు సహకారం అందించడానికి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నాయి. శ్రీహరికోట కూడా సమీపంలోనే ఉంది. పెట్టుబడిదారులు పరిశ్రమల స్థాపనకు ఉత్సాహం చూపుతున్నారు. అంతే వేగంగా వారికి భూములు కేటాయించనున్నాం.

# సబ్జెక్టు ఖాళీ.. విద్యార్థి కంగాళీ



నంద్యాల : బేతంచెర్ల మండలం సిమెంట్‌నగర్ హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడు మహేశ్వరరెడ్డి ప్యాపిలి ఎంఈవో–1గా అదనపు బాధ్యతలపై వెళ్లారు.. ఆ పాఠశాలలో ప్రస్తుతం గణిత ఉపాధ్యాయుడు లేరు.. ఆరు నెలలుగా లెక్కలు చెప్పే వారు కరవయ్యారు.

ఉమ్మడి జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు పదో తరగతి విద్యార్థులకు గ్రహపాటుగా మారింది. ఈసారి ఎట్టి పరిస్థితిలోనూ వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. చాలా పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడం ఆటంకంగా మారింది.

**బదిలీలు తెచ్చిన తంటా**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జిల్లా పరిషత్తు, మున్సిపాలిటీ, ఎయిడెడ్, ప్రభుత్వ పాఠశాలల్లో కలిపి 34,544 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఈ నెలాఖరులోపు సిలబస్ పూర్తి చేసి డిసెంబరు నుంచి రోజువారీ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. చాలా చోట్ల సబ్జెక్టు ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠాలు పూర్తికాలేదు. ఉమ్మడి జిల్లాలో నాలుగు వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేశారు. ఎక్కువ మంది కర్నూలు జిల్లాకు వెళ్లారు.. చాలా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి.

ఉమ్మడి జిల్లాలో 250 హిందీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కర్నూలులో 214, నంద్యాలలో 36 జడ్పీ హైస్కూళ్లలో హిందీ చెప్పే వారు కరవయ్యారు. కొన్ని పాఠశాలల్లో సగం పాఠాలు కూడా పూర్తి కాలేదు.

**వంద రోజుల ప్రణాళికపై నీలినీడలు**

గతేడాది పదో తరగతి పరీక్షల్లో వందరోజుల ప్రణాళిక సత్ఫలితాలు ఇచ్చింది. ఈ ఏడాది మరింత పకడ్బందీగా నిర్వహించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎఫ్ఏ–1, 2 పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏ, బీ, సీ, డీలుగా విభజించాలని సూచించారు. ఎఫ్ఏ–1, 2, ఎస్ఏ–1 పరీక్షలో వెనుకబడిన వారిని ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాల్సి ఉంది. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులే లేకపోవడంతో వంద రోజుల ప్రణాళిక అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

**సర్దుబాటు.. గ్రహపాటు**

క్షేత్రస్థాయిలో అవసరాల దృష్ట్యా ప్రభుత్వం ఎంఈవోల భర్తీకి కొన్ని సడలింపులు ఇచ్చింది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు ఉపాధ్యాయులు అక్కడికి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. డిప్యుటేషన్ల కోసం జూనియర్లు ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొన్ని చోట్ల డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు బదిలీ అయిన ఉపాధ్యాయుల పోస్టులు చూపకపోవడంతో కొంతమంది ఇంకా రిలీవ్ కాలేదు.

**సబ్జెక్టు ఖాళీలు**

భౌతిక 6
జీవశాస్త్రం 4
హిందీ 214
సాంఘిక 3

# కల్లాల్లో కన్నీటి రాసులు

పాణ్యం : కాలం 'వరిం'చింది.. కాల్వలు నిండుగా ప్రవహించాయి.. ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున మొక్కజొన్న, 30 సంచుల చొప్పున వరి ధాన్యం దిగుబడులొచ్చాయి. చేతికొచ్చిన పంటను మొంథా తుపాను వెన్నువిరిచింది. ఉన్న పంట అమ్ముకోవడానికి రైతులు కల్లాల్లో నిరీక్షిస్తున్నారు.. జిల్లాలో ఎక్కడ చూసినా మక్క, ధాన్యం రాసులే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులు దోచుకొంటున్నారు.

**అన్నదాతకు తీరని నష్టం**

మొక్కజొన్నకు కేంద్రం మద్దతు ధర క్వింటాకు రూ.2,400గా నిర్ణయించింది. బహిరంగ మార్కెట్‌లో రూ.1300 నుంచి రూ.1700 పలుకుతోంది. మొంథా తుపాను సమయంలో 40 శాతం కోతలు పూర్తయ్యాయి. దళారుల దోపిడీ అధికమైంది. క్వింటాకు రూ.700 చొప్పున రైతులు నష్టపోతున్నారు.ఏ–గ్రేడ్ వరి ధాన్యం క్వింటాకు రూ.2,389 మద్దతు ధరగా నిర్ణయించింది. దళారులకు 77 కిలోల సంచి కేవలం రూ.1500 విక్రయిస్తున్నారు. అంటే క్వింటాకు రూ.1950 దక్కుతోంది. దీంతో ఒక క్వింటాపై రూ.440 కోల్పోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కొనుగోళ్లు ఎప్పుడో..**

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. వారం రోజులుగా ముమ్మరంగా కోతలు సాగుతున్నాయి. తక్కువ ధరకు విక్రయించలేక కొందరు కల్లాల్లోనే



నిల్వ చేసుకుంటున్నారు. మరికొందరు నిల్వకు అవకాశం లేకపోవడం, వాతావరణంలో మార్పులు రావడంతో వచ్చిన ధరకే విక్రయించి నష్టపోతున్నారు. జిల్లాలో మొక్కజొన్న కోతలు 70శాతం పూర్తయ్యాయి. కొనుగోలు కేంద్రాలపై స్పష్టత కరవైంది. అసలు కొనుగోలు చేస్తారో లేదో కూడా తెలియని దుస్థితి నెలకొంది. " కొనుగోళ్ల అంశాన్ని మార్క్‌ఫెడ్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. ఆర్థిక శాఖ వద్ద దస్త్రం ఉంది.. త్వరలోనే ప్రారంభిస్తామని" మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ తాతిరెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు."13 ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశా.. కొంత పంటను విక్రయించా. ధర పతనం కావడంతో మరికొంత కొంత నిల్వ చేశా. గతేడాది మొక్కజొన్నకు మద్దతు ధర క్వింటాలుకు రూ.2,225 ఉండగా.. ఈ ఏడాది రూ.2400గా నిర్ణయించారు. మద్దతు ధర పెంచినట్లు ప్రచారం చేసినా.. రైతుకు దక్కుతోంది రూ.1700 మాత్రమే.. ఇప్పటి వరకు ప్రభుత్వం కొనుగోళ్లు చేయకపోవడం దారుణమని" గడివేములకు చెందిన మాబాషా ఆందోళన వ్యక్తం చేశారు.

# సేవల్లో రాజమార్గం..
# ఆపదలో అభయహస్తం

డెంకాడ: జాతీయ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు టోల్‌ప్లాజాల వద్ద ఫాస్టాగ్‌తో ఫీజును వసూలు చేస్తుంటారు. ప్రయాణం చేసే వాహనదారులకు టోల్ రుసుము వసూలు చేసే యాజమాన్యాలు కొన్ని సౌకర్యాలు కల్పించాలి. అత్యవసర పరిస్థితుల్లో సేవలు వినియోగించుకోవడంపై చోదకులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

**ఎస్‌వోఎస్ పెట్టెలు..**

జాతీయ రహదారులపై ప్రతి 2, 3 కి.మీ దూరంలో ఎస్‌వోఎస్ పెట్టెలు ఉంటాయి. ఏవైనా ప్రమాదాలు, తక్షణ సాయం కోసం ఈ పెట్టెపై ఉండే బటన్ నొక్కి చెబితే వెంటనే టోల్ సిబ్బంది చేరుకుని సాయం అందిస్తారు.

**అప్‌లోడ్ చేస్తే రివార్డులు**

జాతీయ రహదారిపై వెళ్లే సమయంలో అత్యవసరాలు ఏర్పడితే పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్ల సదుపాయాలను హైవే అధికారులు కల్పిస్తున్నారు. ఇవి అపరిశుభ్రంగా ఉంటే ఫొటో తీసి 'రాజమార్గ్ యాత్ర' యాప్‌లో అప్‌లోడ్ చేస్తే రివార్డులు సైతం పొందవచ్చు.చోదకుల కోసం అక్కివరం కూడలి, రణస్థలం సమీపంలో




విశ్రాంతి గదులు నిర్మించారు. వాహనాలు నిలిపేందుకు అక్కివరం కూడలి సమీపంలో ట్రక్కు బే త్వరలో అందుబాటులోకి రానుంది.

**పార్కింగ్, విశ్రాంతికి..**

వాహనాల పార్కింగ్, డ్రైవర్లు విశ్రాంతి తీసుకునేందుకు స్థలాలు ఉండాలి. ఇంధన స్టేషన్లు, వాహన మరమ్మతు దుకాణాలు సమీపంలోనే ఉండాలి. నగదు జమ, ఉపసంహరణకు ఏటీఎం యంత్రాలు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**15 నిమిషాల్లో అత్యవసర సేవలు**

ప్రయాణికులకు తాగునీరు, ఇతరత్రా సేవలతోపాటు ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందిస్తారు. టోల్‌ప్లాజా వద్ద ఉన్న అంబులెన్స్ 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటుంది. జాతీయ రహదారిలో వాహనదారుల సేవలపై అవగాహన కల్పిస్తున్నామని ఎన్‌హెచ్–16 ఇన్సిడెంట్ మేనేజర్ పి.రామస్వామి చెప్పారు.

**ఉమ్మడి జిల్లాలోని టోల్‌గేట్లు**

చెన్నై–కోల్‌కతా(నాతవలస, విజయనగరం)
విశాఖపట్నం–రాయపూర్(జొన్నాడ, విజయనగరం)
విజయనగరం–పార్వతీపురం(మానాపురం, గజపతినగరం)
సబ్బవరం–రాయపూర్, ఎక్స్‌ప్రెస్ హైవే (జామి వద్ద, ఇంకా ప్రారంభం కాలేదు)
గజపతినగరం–బొబ్బిలి (ఇంకా ప్రారంభం కాలేదు)
టోల్‌గేట్ల నుంచి వెళ్లే వాహనాలు: రోజుకు సుమారు 50 వేలు

**1033కి కాల్ చేస్తే..**

రహదారిపై వాహనం ఆగిపోతే.. నెట్టడానికి ఎక్కడి నుంచో ఎవరినో పిలవాల్సిన అవసరం ఉండదు. పెట్రోల్, డీజిల్ అయిపోయినా 1033 నంబరుకు కాల్ చేస్తే తక్షణ సాయం అందుతుంది. పోలీసు సేవల కోసం 112 నంబరును సంప్రదించాలి. ఇలా విజయనగరం జిల్లాలో ప్రతినెలా 10–15 కాల్స్‌కు సమాధానం ఇస్తున్నారు.

# కష్టాలు తీరితేనే..
# లాభాలు వరించేది

రాజాం: ఖరీఫ్ వరి పంట చేతికొచ్చింది. రైతులు ముమ్మరంగా కోతలు, నూర్పులు చేపడుతున్నారు. విక్రయాలకు సిద్ధమవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు కూడా ఒక్కొక్కటిగా ప్రారంభమవుతున్నాయి. ఇటీవల మొంథా తుపానుకు కొంత నష్టపోయిన రైతులు ఉన్న పంటనైనా సమయానికి విక్రయించాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గతేడాది ఎదురైన ఇబ్బందులు అధికారులు ఈసారి అధిగమిస్తేనే అన్నదాతలకు ప్రయోజనం చేకూరుతుంది.

**లక్ష్యాలతో తంటా..**

లక్ష్యాల మేరకు ధాన్యాన్ని సేకరిస్తారు. ముందుగా పంట వచ్చిన మండలాల్లో శతశాతం సేకరిస్తున్న అధికారులు.. తర్వాత చేతులెత్తేస్తున్నారు. గతేడాది ధాన్యం సేకరించాలని సంతకవిటి, రేగిడి, వంగర మండలాల్లో రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది.

**తేమ ఉందంటూ దోపిడీ**

గతేడాది ఆర్ఎస్‌కేల్లో కొనుగోళ్లు జరిపి మిల్లులకు పంపినా అక్కడ కొర్రీలు పెట్టారు. తేమ శాతంలో తేడా ఉందని రెండు నుంచి అయిదు కిలోల వరకు అదనంగా పిండేశారు. రైతులకు గోనె సంచులు సమకూర్చలేదు. ఇచ్చినవీ పాడయ్యాయి. చాలా మందికి రవాణా ఛార్జీలూ చెల్లించలేదు.

మిల్లుల వద్ద సరిపడా హమాలీలు ఉండకపోవడం, నిల్వ సామర్థ్యం లేకపోవడంతో రోజుల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. ట్రక్ షీట్లు సకాలంలో ఇవ్వలేదు.

మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు సమర్పించలేదు. ఈ ఏడాది 159 మిల్లులు గుర్తించినా.. ఇంకా చాలావరకు బ్యాంకు గ్యారెంటీలు అందలేదు.ఆర్ఎస్‌కే, మిల్లుల వద్ద ఒకే రకమైన తేమ యంత్రాలు ఉండాలి. చాలా చోట్ల మిల్లర్లు ఇందులో తేమ మరోలా ఉందంటూ మోసం చేశారు.

**పటిష్ఠం చేయాలి**

ధాన్యాన్ని ఎక్కడైనా విక్రయించుకునేందుకు వీలుండడంతో దళారులు ఇతర ప్రాంతాలకు తరలిస్తుంటారు. తనిఖీ కేంద్రాల్లో లెక్కలు ఉండడం లేదు. ఏ రైతు వద్ద ఎంత మేర కొనుగోలు చేశారనేది తేలడం లేదు. ఒడిశాలో తక్కువ ధరకు ధాన్యం దొరుకుతున్నాయి. వాటిని తెచ్చి ఇక్కడ రైతుల పేరున విక్రయించే అవకాశముంది.

ప్రత్యేక దృష్టి.. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్, జేసీ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఈసారి ఎలాంటి ఇబ్బందులు రానీయం. 4 లక్షల టన్నులు సేకరిస్తాం. కామన్ రకం క్వింటా రూ.2,369.. 'ఏ' గ్రేడ్ రూ.2,389 చొప్పున పూర్తి మద్దతు ధర చెల్లిస్తాం. బి.శాంతి, డీఎం, పౌరసరఫరాల సంస్థ

## భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలియదా?

తిరుపతి : 'ఉత్తరాఖండ్‌లోని భోలేబాబా ఓరోగానిక్ డెయిరీ తిరుమలకు కల్తీ నెయ్యి సరఫరా చేస్తోందని ఎప్పటి నుంచి తెలుసు? ఆ సంస్థకు టెండరు దక్కేలా ఎవరైనా సహకరించారా? తిరుమల లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీలో కల్తీ నెయ్యి వినియోగంతో భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తెలియదా? మొదటే మీ దృష్టికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులకు చెప్పి ఉంటే అప్పటికైనా నియంత్రించేవారు కదా?' అంటూ తితిదే మాజీ ఛైర్మన్, వైకాపా రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి మాజీ పీఏ చిన్న అప్పన్నను సిట్ అధికారులు ప్రశ్నించారు. కల్తీ గురించి తనకు తెలియదని, ఇతర వివరాలు అప్పటి ప్రొక్యూర్‌మెంట్ అధికారులకే తెలుస్తాయని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. మూడోరోజు ఆయనను తిరుపతిలోని సిట్ కార్యాలయంలో విచారించారు. అంతకుముందు తూర్పు పోలీసు స్టేషన్ నుంచి రుయా



ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాక విచారించారు. పలు ప్రశ్నలకు చిన్న అప్పన్న ముక్తసరిగా సమాధానా లిచ్చినట్లు తెలుస్తోంది. వైవీ సుబ్బారెడ్డితో ఉన్న పరిచయం నేపథ్యంలోనే అడపాదడపా తిరుమలకు వచ్చి వెళ్లేవాడినే తప్ప ఇక్కడి వ్యవహారాలతో సంబంధం లేదని చెప్పినట్లు సమాచారం. 'అటువంటప్పుడు భోలేబాబా డెయిరీపై తితిదే మాజీ ఛైర్మన్‌కు ఎందుకు ఫిర్యాదు చేశారు? కల్తీ నెయ్యి తిరుమలకు వస్తోందన్న సంగతి తెలిసీ ఎందుకు మిన్నకుం డిపోయా ర'ని అడగ్గా చిన్న అప్పన్న మౌనం వహించినట్లు తెలుస్తోంది. 2021–24 మధ్య తగరపువలసలో 5, లంకెలపాలంలో 8, రుషికొండలో ఒక ఫ్లాటు ఎలా కొన్నారని, ఆ డబ్బులు ఎలా వచ్చాయని అడగ్గా సొంత సంపాదనతోనే వాటిని కొన్నానని చెప్పినట్లు సమాచారం.

## తీరానికి ఉగ్రవాదులొస్తే!

అచ్యుతాపురం : తీరానికి ఉగ్రవాదులు వస్తే వారిని ఎదుర్కొనేందుకు కేంద్ర రక్షణ బలగాలు, పోలీసులు ఎంతవరకు సంసిద్ధంగా ఉన్నారనే విషయాన్ని తెలుసుకోవడానికి సాగర్ కవచ్ నిర్వహించడానికి పక్కా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర పోలీసులతోపాటు నేవీ, తీర రక్షణ దళం, కేంద్ర కస్టమ్స్, ఎక్సైజ్, హోంశాఖ అధికారులు దీని నిర్వహణకు సిద్ధమయ్యారు. గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు తీరప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. కవచ్‌ను పక్కాగా నిర్వహించాలని అన్ని విభాగాలకు చెందిన అధికారులు విస్తృత స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

ముంబయి తరహా దాడులు తీర ప్రాంతాల్లో మళ్లీ జరగకుండా ఉండాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తీర ప్రాంతాలున్న రాష్ట్రాల్లో సాగర్ కవచ్ పేరుతో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నారు. తీవ్రవాదులు తీరం గుండా భూభాగంలోకి ప్రవేశించి విధ్వంసం సృష్టించాలని పన్నాగం పన్నితే ఏవిధంగా ఎదుర్కొవాలనే విషయాన్ని దీనిద్వారా అన్ని విభాగాల సిబ్బందికి, అధికారులకు అవగాహన కల్పించనున్నారు. ఏడాదికి రెండుసార్లు అన్ని రక్షణ విభాగాల అధికారులు దీనిని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది ఏప్రిల్ నెల 9, 10 తేదీల్లో దీన్ని తీర ప్రాంతాల్లో నిర్వహించారు. తీర రక్షణదళం, నేవీ సిబ్బంది తీవ్రవాదుల ముసుగులో సముద్ర జలాల్లోకి వెళ్లి తిరిగి జిల్లాలో ఏదో ఒక మూలన ఉన్న తీరానికి చేరుకోవడం ఈ కవచ్‌లో ముఖ్యాంశం. వీరు తీరానికి చేరుకుని అక్కడి నుంచి బయటకు వచ్చేలోగా పోలీసులు, మెరైన్ విభాగం సిబ్బంది గుర్తించి



వీరిని అదుపులోకి తీసుకోవాల్సి ఉంటుంది.

తీవ్రవాదుల ముసుగులో వచ్చే పోలీసులు భూభాగంలోకి రాకుండా తీరం ఒడ్డున గస్తీ నిర్వహించడంతోపాటు పడవల్లో అన్వేషించడం, వాహనాలు తనిఖీ చేయడం వంటి కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తారు. ఈ నమూనా ప్రదర్శనను నిజమైన ఉగ్రవాదులను పట్టుకోవడానికి పోలీసులు, రక్షణదళం సిబ్బంది ఎంత ప్రయత్నిస్తారో అంతేస్థాయిలో నిర్వహిస్తారు.

దీనిని చూసే ప్రజలకు మాత్రం నిజంగానే శత్రుమూకలు మన ప్రాంతంలో ప్రవేశించారా అనిపిస్తుంది. అవగాహన కార్యక్రమంలో మెరైన్ సీఐ సింహాద్రినాయుడు, ఎస్సైలు సుధాకరరావు, వెంకటరావు, 60మంది సిబ్బంది పాల్గొన్నారు.

## అద్భుత 'వనం'.. నగరానికి వరం..!

పెదవాల్తేరు : అరుదైన మొక్కలకు కేంద్రంగా విరాజిల్లుతోంది నగరంలోని జీవ వైవిధ్య ఉద్యానవనం. 2వేలకుపైగా మొక్కలను ఇక్కడ సంరక్షిస్తున్నారు. రాక్షస బల్లుల (డైనోసార్స్) కాలం నాటి వృక్షాలు, గాలిని శుద్ధి చేసేవి, నీటిలో పెరిగేవి, రాత్రి వేళల్లో అధిక ఆక్సిజన్ ఇచ్చే మొక్కలు ఇక్కడ ఉండటం విశేషం. పెదవాల్తేరు రాణి చంద్రమణి దేవి (ఆర్సీడీ) ఆసుపత్రిలో 2001లో డాల్ఫిన్ నేచర్ కన్జర్వేటివ్ సంస్థ ఏర్పడింది. సంస్థ ఆధ్వర్యంలో జీవ వైవిధ్య ఉద్యాన వనం ఏర్పాటుకు రాణి చంద్రమణి దేవి 2002లో 3 ఎకరాల స్థలం కేటాయించారు. అంతరించిపోతున్న మొక్కలను భావితరాలకు అందించాలనే లక్ష్యంతో వాటిని దేశ విదేశాల నుంచి సేకరించి ఇక్కడ సంరక్షిస్తున్నారు. **విద్యార్థులకు అధ్యయన కేంద్రంగా..:** 2013లో వుడా, ఆర్సీడీ ఆసుపత్రి సహకారం అందించడంతో ఉద్యానవనం ఒక రూపురేఖలు సంతరిం చుకుంది. గత వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్ సూచనల మేరకు నిర్వాహకులు డాక్టర్ రామమూర్తి ఉద్యాన వనాన్ని విద్యార్థులకు అధ్యయన కేంద్రంగా తీర్చి దిద్దారు. ఫలితంగా నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి బోటనీ విద్యార్థులు ఈ వనాన్ని సందర్శి స్తున్నారు. విదేశీ పర్యాటకులు కూడా సందర్శించి అబ్బుర పడుతున్నారు.

**12జాతులకు చెందిన మొక్కలు..:** ఈ వనంలో 12 జాతులకు చెందిన 2వేల మొక్కలున్నాయి. వివిధ దేశాలు, హిమాలయాలు, తదితర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి వీటిని సేకరించారు. శీతల వాతావరణంలో పెరిగే మొక్కల కోసం తక్కువ ఉష్ణోగ్రతలు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని కోసం షేడ్ నెట్స్ ఏర్పాటు చేశారు. వాతావరణం పొడిబారకుండా నిత్యం తేమ ఉండేలా స్ప్రింక్లర్లు అమర్చారు.ఏటా రూ.10లక్షల వ్యయం: ఉద్యానవనం నిర్వహణకు ఏటా రూ.10 లక్షల వరకు వ్యయమవుతోంది. ఇటీవల వీఎఆర్డీఏ వాకింగ్ ట్రాక్, డ్రిప్ ఇరిగేషన్, కంచె, విద్యుత్తు సౌకర్యం కల్పించింది. వివిధ సంస్థల సభ్యులు, విద్యార్థులు విరాళాలు అందజేస్తున్నారు.

# తత్కాల్ టికెట్ల జారీలో మతలబు




గుంతకల్లు : గుంతకల్లు జంక్షన్‌లో రైలు ప్రయాణానికి సంబంధించిన తత్కాల్ రైల్వే టికెట్ల జారీలో వివాదాలకు దారి తీస్తోంది. స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్‌లో ఉదయం అర గంట మాత్రమే టికెట్లు విక్రయిస్తారు. ప్రధానంగా ఏసీ టికెట్లు ఉదయం 10 గంటలకు, స్లీపర్ టికెట్లు 11 గంటలకు విక్రయిస్తారు. వీటికి ఉండే డిమాండ్ కారణంగా కొందరు దళారులు కాసులపంట పండించుకుంటున్నారు. కొందరు క్యూలైన్లలో నిలబడలేక దళారులను ఆశ్రయిస్తున్నారు. దీనికి గాను దళారులకు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా ఇస్తున్నారు.

రైల్వే డివిజన్ : గుంతకల్లు
రైళ్ల సంఖ్య : 120
కౌంటర్లు : 02
రోజూ వారి రిజర్వేషన్లు : 1500
తత్కాల్ టికెట్ల జారీ సమయం : అర గంట

దబాయిస్తూ.. టికెట్లు తీసుకుంటూ!

ఎవరు ముందు టికెట్ బుకింగ్ కౌంటరులోకి చేతులు పెడతారో వారికి అధికారులు టికెట్లు ఇవ్వాల్సి ఉంది. దీంతో కొందరు రాత్రే వెళ్లి క్యూలైన్లలో ఉదయం వరకు కూర్చోవడం, నిద్రపోవడం జరుగుతోంది. ఇలా కొందరు ఇబ్బంది పడుతుంటే దళారులు రాత్రే రిజర్వేషన్ ఫారాలను బుకింగ్ కౌంటరు వద్ద పెట్టి వెళ్లిపోతారు. ఉదయం టికెట్లు ఇచ్చే సమయానికి క్యూలైన్ వద్దకు వచ్చి తాము రాత్రే ఫారాలను కౌంటరు వద్ద ఉంచామని దబాయించి టిక్కెట్లను తీసుకుంటున్నారు. రాత్రంతా క్యూలైన్‌లో నిల్చున్నవారికి అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. రైల్వే పోలీసులు సైతం పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. రిజర్వేషన్ కౌంటర్‌లో ఉన్న ఉద్యోగులు సైతం దళారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీనిపై స్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణను అడుగగా క్యూలైన్‌లో ఉన్న వారు మాత్రమే టికెట్లను పొందేవిధంగా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# తూకం తక్కువ.. ధర ఎక్కువ



అనంతపురం : మొక్కజొన్న, టమాటా, తదితర విత్తనాలను దుకాణం యజమానులు కొందరు నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. రైతులు ఇలాంటి నాసిరకం విత్తనాల పొట్లాలు కొనుగోలు చేసి, ఆపై పంట దిగుబడి రాక అప్పులపాలవుతున్నారు. కొందరు వినియోగదారులను ఆకర్షించేలా నిత్యావసర సరకులను ఆకర్షణీయ పొట్లాల్లో ప్యాక్ చేసి అమ్ముతున్నారు.

చౌక ధాన్యం డిపోల డీలర్లు కొందరు ప్రభుత్వం అందిస్తున్న బియ్యాన్ని పది కిలోలకు రెండు, మూడు కిలోలు తక్కువ తూకంతో ప్రజలకు ఇస్తున్నారు. నగరం, గుల్జార్‌పేటలో డీలరు ఒకరు తక్కువ తూకంతో బియ్యం ఇస్తున్న తీరు రెవెన్యూ అధికారుల తనిఖీలో గుర్తించి, డీలరును సస్పెండ్ చేశారు. పొట్లాల్లో సరకులు ప్యాక్ చేయడానికి తూనికలు కొలతల అధికారుల అనుమతి తీసుకోవాలి. అలాకాకుండా ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు.

కొనుగోలు చేసిన దానికి బిల్లు తీసుకోవాలి. తూకం చూడాలి. పొట్లంపై ధర, సరకు నాణ్యత, తయారుదారు, తేదీ, ఈ మెయిల్, ఫోన్ నంబరు, తదితర వివరాలు చూసుకోవాలి. తేడా ఉంటే సహాయ నియంత్రణ అధికారి : 984 909 5707, అనంతపురం డివిజన్ అధికారి: 984 981 6216, టోల్‌ఫ్రీ నంబరు: 1800 425 4202 నంబర్లకు ఫోన్ చేయాలని అనంతపురం డివిజన్ తూనికలు, కొలతలశాఖ తనిఖీ అధికారి ఖాజా చెబుతున్నారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు కేసుల నమోదు ఇలా..

ప్యాకేజీ కమాడిటీ చట్టం అతిక్రమణ : 90
తూనికలు, కొలతల చట్టం ఉల్లంఘన: 44
అపరాధ రుసుం వసూళ్లు రూ.12.11 లక్షలు
ముద్ర రుసుం : రూ.8.35 లక్షలు

# ఆందోళనకర రీతిలో ఆంత్రాక్స్ విజృంభణ



అనంతపురం : గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాధి సోకి మృత్యువాత పడుతున్నాయి. గొర్రె మూతి, ముక్కు నుంచి నురుగుతో కూడిన నల్లని గడ్డ కట్టిన రక్తం బయటకు వస్తోంది. ఈ వ్యాధి సోకిన గొర్రెలు చూడటానికి బాగానే ఉంటాయి. ఉదయం లేచేసరికి చనిపోవడంతో కాపర్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాలుగు నెలల నుంచి ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 28 గొర్రెలు వ్యాధి బారిన పడి చనిపోవడం గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో ఆంత్రాక్స్ వ్యాధి విజృంభించింది. నాలుగు నెలల్లో తొమ్మిది గ్రామాల్లో 28 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం దేవగిరిలో 2, విడపనకల్లు మండలం పెంచలపాడులో 2, కూడేరు మండలం పి.యాలేరులో 10, ఆత్మకూరు మండలం శింగంపల్లి, శింగంపల్లి తాండాలో 3, కూడేరు మండలం పి.నాగిరెడ్డిపల్లిలో 2, తాడిపత్రి మండలం గంగదేవపల్లిలో ఒకటి చొప్పున మృత్యువాత పడ్డాయి. శ్రీసత్యసాయి జిల్లాలో కనగానపల్లి మండలంలో కోనేటిపాలెంలో 6, బత్తలపల్లి మండలం దంపెట్లలో 2 చొప్పున చనిపోయాయి.

**69,973 గొర్రెలకు..**

గొర్రెలకు ఆంత్రాక్స్ వ్యాధి సోకడంతో పశుసంవర్ధకశాఖ అప్రమత్తమైంది. ఆయా మండలాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. కాపర్లకు అవగాహన కల్పించడంతోపాటు 69,973 గొర్రెలకు టీకాలు వేశారు. అనంతపురం జిల్లాలో ఆరు గ్రామాల్లో 35,473, శ్రీసత్యసాయి జిల్లాలో రెండు గ్రామాల్లో 34,500 గొర్రెలకు టీకాలు వేశారు.

**వ్యాధి నిర్ధారణ అయితే..**

ఆంత్రాక్స్ వ్యాధి నిర్ధారణ అయితే గొర్రె శరీరాన్ని పోస్టుమార్టం చేయకూడదు. చనిపోయిన గొర్రెలను కాల్చివేయాలి. లేకపోతే గుంత తీసి సున్నం చల్లి పూడ్చేయాలి. మందలో చనిపోతే ఆ ఊరు చుట్టు 5 కిలోమీటర్ల మేర గొర్రెలకు టీకాలు వేయాలి. 3–5 ఏళ్లు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలి. వ్యాధి సోకిన జీవాలు తిన్న గడ్డిని, దాణాను కాల్చివేయాలి. చర్మం, ఉన్ని, మాంసం, కొమ్ములు వినియోగించకూడదు. **ఉచితంగా టీకాలు: డాక్టర్ రవిబాబు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (ఉమ్మడి జిల్లా)**

ఆంత్రాక్స్ వ్యాధి గడ్డి తినే జంతువుల్లో బాసిల్లస్ ఆంత్రాక్స్ అను స్పోర్స్ ఏర్పరిచే బ్యాక్టీరియాతో వస్తుంది. నివారణకు టీకా ఉంది. ఈ ఏడాది 60 లక్షల డోసులు జిల్లాకు వచ్చాయి. గొర్రెలకు ప్రతి ఏటా సెప్టెంబరులో శాఖ ద్వారా ఉచితంగా టీకాలు వేస్తున్నాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు. లక్షణాలు కనిపిస్తే పశువైద్యులకు తప్పనిసరిగా తెలపాలి.

# కొలువక్కడ.. ఉండేదిక్కడ

చిత్తూరు : ప్రభుత్వ ఉద్యోగమంటే ఉన్నతాధికారుల ఆదేశానుసారం విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలి.. ఇక్కడేమో రూ.లక్షల్లో వేతనాలు, అలవెన్సులు పొందుతున్నారు.. అయినా కొందరు ఉద్యోగ బాధ్యతలు పక్కన పెట్టేసి నిబంధనలు వారికి అనుకూలంగా మార్చుకున్నారు.. అడిగేవారెవరు.. అంతా మా ఇష్టం.. అనే రీతిలో విద్యుత్తు శాఖలో కొందరు వ్యవహరిస్తున్నారు.

**విభజన కాగితాల్లోనే..**

గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు విద్యుత్తుశాఖ సర్కిల్ కార్యాలయం తిరుపతిలో ఉండేది. గతేడాది సెప్టెంబరు 25న చిత్తూరులో సర్కిల్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయగా తొలి ఎస్ఈగా ఇస్మాయిల్ అహ్మద్ బాధ్యతలు స్వీకరించారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిపి 70–80 మంది వరకు కేటాయించారు. కేవలం జిల్లాస్థాయి అధికారులు, ఇంజినీర్లు మాత్రమే విధుల్లో చేరగా.. జేఏవో, సీనియర్, జూనియర్ సహాయకులతోపాటు ఒప్పంద ఉద్యోగులు నేటికీ బాధ్యతలు స్వీకరించలేదు. చిత్తూరుకు కేటాయించిన కొందరు శాశ్వత, ఒప్పంద ఉద్యోగులు సైతం తిరుపతిలో విధులు నిర్వహిస్తుండటం గమనార్హం.

**పైరవీలు, అధికారుల అండదండలతోనే..**

కొందరు ఉద్యోగులు రాజకీయ పైరవీలు, ఉన్నతాధికారుల అండతో తిరుపతిలోనే పని చేస్తున్నారు. వీరికి అక్కడ నిర్దిష్టమైన పోస్టు, బాధ్యతలు లేకపోయినప్పటికీ విధులకు తిరుపతిలోనే హాజరవుతున్నట్లు నమోదు చేయడమే కాకుండా వేతనాలు పొందుతున్నారు. కొందరికి మెమోలు జారీ చేసినా ఉలుకూపలుకూ లేదని ఆశాఖ అధికారులే విమర్శిస్తున్నారు. అందుబాటులో ఉన్న ఉద్యోగులు అధిక పనిభారంతో అవస్థలు పడుతున్నారు. **రెండుసార్లు లేఖలు రాశాం..** – ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ తక్షణమే విధుల్లో చేరేలా ఆదేశాలు జారీ చేయాలని రెండుసార్లు ఉన్నతాధికారులకు లేఖలు రాశాం. నేటివరకు స్పందన లేదు. ఉద్యోగుల కొరతతో పనులు ఆగిపోతున్నాయి.

## అక్రమాలకు 'సహకారం'.. గుదిబండలా 'గోదాం'

కర్నూలు : గత ఐదేళ్ల వైకాపా పాలనలో సహకార వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. బహుళ ప్రయోజన గోదాములను బలవంతంగా సహకార సంఘాలకు అప్పగించడంతో.. కొంతమేర లాభాల్లో ఉన్న సంఘాలు సైతం పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయాయి. కొందరు వైకాపా పెద్దలకు లబ్ధి చేకూర్చేందుకు నిర్మించిన ఈ గోదాములకు చేసిన ఖర్చుల అసలు, వడ్డీ చెల్లించలేని పరిస్థితి. అప్పులు తీర్చేందుకు కొత్తగా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

**201 మంజూరు.. వంద అప్పగింత**

గత ప్రభుత్వంలో ఓ వైకాపా నేతకు ప్రయోజనం చేకూర్చేందుకు రాష్ట్ర వ్యాప్తంగా గోదాముల నిర్మాణం చేపట్టారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 99 ప్రాథమిక సహకార సంఘాల పరిధిలో 500, వెయ్యి టన్నుల సామర్థ్యం కలిగిన 201 బహుళ ప్రయోజన గోదాములు మంజూరు చేశారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు రుణాలతో 500 టన్నుల గోదాముకు రూ.45 లక్షలు, వెయ్యి టన్నుల గోదాముకు రూ.80 లక్షలు చొప్పున కేటాయించారు. ఇందుకోసం సహకార బ్యాంకు ద్వారా సుమారు రూ.70 కోట్ల రుణం మంజూరు చేశారు. ఇప్పటి వరకు కర్నూలు 22, నంద్యాల జిల్లాలో 95 నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిలో కర్నూలులో 21, నంద్యాల జిల్లాలో 79 చొప్పున మొత్తం వంద గోదాములను మార్కెటింగ్ శాఖ ప్రాథమిక సహకార



సంఘాలకు అప్పగించింది.

**వాడకున్నా.. వడ్డీతో సహా చెల్లించాలి**

సహకార సంఘాలు స్వాధీనం చేసుకున్న గోదాములకు సంబంధించి మొదటి రెండేళ్లు వడ్డీ రూపంలో 500 టన్నుల గోదాముకు ఏడాదికి రూ.1.80 లక్షలు, వెయ్యి టన్నుల గోదాముకు రూ.3.60 లక్షల చొప్పున చెల్లింపులు చేయాలి. ఆ తర్వాత ఏడాదికి రూ.9 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు ఐదేళ్ల పాటు రుణం చెల్లించాలి. గోదాముల వల్ల ఎలాంటి ఉపయోగం లేకపోయినా రూ.లక్షల్లో అసలు, వడ్డీ చెల్లించాల్సి రావడం ప్రాథమిక సహకార సంఘాలకు భారంగా మారింది. అప్పులు చేసి మరీ వడ్డీలు, రుణ చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని సంఘాల అధ్యక్షులు, సీఈవోలు వాపోతున్నారు. దీంతో సంఘాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వినియోగానికి దూరం**

నంద్యాల జిల్లాలో 79 బహుళ ప్రయోజన గోదాములను సంఘాలకు అప్పగించారు. వీటిలో 8 గోదాములు మాత్రమే వినియోగంలోకి వచ్చాయి. కర్నూలులో 21కి గాను ఒక్కటి కూడా వినియోగంలోకి రాలేదు. ఉమ్మడి జిల్లాలో సంఘాలకు అప్పగించిన వాటిలో 92 గోదాములు నిరుపయోగంగా మారాయి. వాటిని అద్దెకు ఇస్తామంటున్నా.. తీసుకునేందుకు ఎవరూ ముందుకురాని పరిస్థితి నెలకొంది. గ్రామాలకు దూరంగా.. ఎలాంటి రవాణా సౌకర్యం లేని కొండలు, గుట్టలు, లోతట్టు ప్రాంతాల్లో వీటిని నిర్మించారు. దీంతో వాటిలో పంట ఉత్పత్తులు, వ్యవసాయ రంగానికి సంబంధించిన ఉత్పత్తులను నిల్వ ఉంచుకునేందుకు ఎవరూ ముందుకురావడం లేదు.

## సంద్రం తీర్చనుంది దాహం!

ఒంగోలు : జిల్లాలో గత కొన్నేళ్లుగా లోటు వర్షపాతంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గతంలో పశ్చిమ ప్రకాశంలో మాత్రమే ఉన్న తాగునీటి సమస్య ప్రస్తుతం కోస్తా తీర ప్రాంత మండలాల్లోనూ నెలకొంది. తద్వారా సురక్షిత జలాలు కరవయ్యాయి. పైగా కొత్తపట్నం తీర ప్రాంతంలో రొయ్యల చెరువుల సాగు, హెచరీల నిర్వహణతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. వ్యవసాయ బోర్లతోపాటు అనాధికార బోర్ల ద్వారా విచ్చలవిడిగా నీటిని తోడేస్తుం డడంతో ఇప్పటికే తాగునీటి సమస్య నెలకొంది. రానున్న రోజుల్లో తాగునీటి సమస్య మరింత తీవ్రం కానున్నట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు భావిస్తున్నారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించాయి. ఈ క్రమంలో సముద్ర తీరంలోని ఉప్పునీటిని మంచినీటిగా మార్చే ప్రాజెక్టు మరోసారి తెరపైకి వచ్చింది. ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా లు ప్రత్యేక నిధులు కేటాయించడంతోపాటు భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ప్రాజెక్టుకు శ్రీకారం చుట్ట నున్నాయి. జిల్లాలో తొలివిడతగా కొత్తపట్నం మండలంలో సూపర్ ఆర్వో ప్లాంటును ఏర్పాటు చేసేందుకు 2021లో గత ప్రభుత్వ హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రతిపాదించారు. అప్పట్లో ప్రాజెక్టు నిర్మాణ నిమిత్తం రూ.35 కోట్లతో



అంచనా వేశారు. అనంతరం నిధుల మంజూరు ఊసేలేదు. తాజాగా కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్ కింద నిధులు కేటాయించేందుకు పచ్చజెండా ఊపింది.

**తీరానికి 500 మీటర్ల దూరంలో...**

జిల్లా కేంద్రమైన ఒంగోలు నగరంతోపాటు కొత్తపట్నం మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించే క్రమంలో గుండ్లకమ్మ నీటిని సరఫరా చేసేందుకు గతంలో వాటర్‌గ్రిడ్ కింద ప్రతిపాదించారు. అన్ని గ్రామాలకు మధ్యగా ఉండేలా గవండ్లపాలెంలో రిజర్వాయరు నిర్మించేందుకు ప్రణాళిక చేశారు. సహజంగా సముద్రపు ఒడ్డున సుమారు 5 మీటర్ల లోతు వరకు మంచినీరు లభిస్తోంది. ఆర్వో ప్లాంటు నిర్వహణకు సరిపడా నీటి అవసరాల నిమిత్తం 20 మీటర్ల లోతున బోరు వేయనున్నారు. దీంతో అక్కడ లభ్యమయ్యే ఉప్పునీటిని మంచినీటిగా మార్చేందుకు ప్లాంటు నిర్మించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకు జిల్లా అధికారులు రూ.55 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. మార్గదర్శకాల ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం చొప్పున నిధులు కేటాయించాలి. సముద్ర తీరానికి 500 మీటర్ల దూరంలో ప్లాంటుతోపాటు రిజర్వాయరు నిర్మించేందుకు ప్రతిపాదించారు.

## డివిజన్ కేంద్రాల్లో డీఎల్‌డీవో కార్యాలయాలు

మార్కాపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన పరంగా పూర్తిగా సంస్కరణలు చేపట్టింది. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) వ్యవస్థను పూర్తిగా బలోపేతం చేసి వారికి విధులు, అధికారాలు, బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమైంది.

**పనులు చురుగ్గా సాగుతున్నాయి**

జిల్లాలోని డివిజన్ కేంద్రాల్లో డీఎల్‌డీవో కార్యాలయాల నిర్మాణాల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే కార్యాలయాలకు సంబంధించి 90 శాతం పనులు పూర్తి చేశారు.

ప్రకాశం జిల్లాలో మార్కాపురం, కనిగిరి, ఒంగోలు మూడు డివిజన్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. 2020లో ప్రతి డివిజన్‌కు డీఎల్‌డీవోలను నియమించారు. డివిజన్ కేంద్రాల్లోని మండల కార్యాలయాల్లో ఓ గది తీసుకుని ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ సమయంలోనే జడ్పీ నుంచి ఇద్దరు సిబ్బందిని సర్దుబాటు చేసి కేటాయించారు.




**ప్రక్షాళనలో భాగంగా ప్రత్యేక అధికారాల బదలాయింపు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రక్షాళనలో భాగంగా డీఎల్‌డీవోలకు ప్రత్యేకమైన అధికారాలు ఇచ్చి డివిజన్‌లో మిగిలిన అన్నిశాఖల పర్యవేక్షణ చేయాలనే ఆలోచనతోనే కార్యాలయాలు సిద్ధం చేశారు. మార్కాపురం మండలంలోని రాయవరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో రూ.15 లక్షలతో పూర్తిగా ఆధునికీకరించారు. ఈ కార్యాలయంలో డీఎల్‌డీవో, డీఎల్‌పీవో (డివిజనల్ పంచాయతీ అధికారి) డ్వామా ఏపీడీ కార్యాలయాలను సిద్ధం చేశారు. కనిగిరి డివిజన్ కేంద్రంలో స్త్రీశక్తి భవనంలో రూ.10 లక్షలతో పూర్తిగా ఆధునికీకరించారు.

ఒంగోలు డివిజన్ కేంద్రంలో పాత జిల్లా పరిషత్తు కార్యాలయంలో డీఎల్‌డీవో కార్యాలయం, డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ కార్యాలయాలు సిద్ధం చేశారు. వీటిని నవంబర్ 1వ తేదీ నుంచి పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిషత్తు సీఈవో చిరంజీవి తెలిపారు.

## నిధులు నేలపాలు.. సామగ్రి చోరుల పాలు

దొనకొండ : పర్యాటకులు ఏదైనా సుందర ప్రదేశాన్ని చూడటానికి వచ్చినప్పుడు వారికి ఆహారానికి ఎలాంటి ఇబ్బంది ఉండకూడదు. తద్వారా వారు ఎంతో ఉపశమనం పొందుతారు. ఇదే ఉద్దేశంతో దొనకొండ మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని బౌద్ధ స్తూపం చూసేందుకు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు ఉండాలని ఏపీ టూరిజం 17సంవత్సరాల క్రితం ఫలహారశాల నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం రూ.45 లక్షలు మంజూరు చేశారు. వచ్చిన నిధులతో పనులు పూర్తిచేసి మిగిలినవి చేయలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఏర్పాటుచేసిన సామగ్రి దొంగలపాలైంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**2వ శతాబ్దంలో స్తూపం నిర్మాణం**

క్రీ.పూ.2వ శతాబ్దంలో ఈ బౌద్ధస్తూపంను నిర్మించారు. ఎంతో విశిష్టత ఉండటంతో ఇక్కడకు పర్యాటకులు వస్తారని వారికి అన్ని వసతులు



కల్పించాలని అప్పట్లో పనులు జరిపారేకాని పూర్తి చేయలేదు. రక్షణకు సిబ్బంది కూడా లేకపోవటంతో విద్యుత్ తీగలు, తలుపులు, బోరు దొంగలపాలయ్యాయి. అప్పుడప్పుడు పర్యాటకులు వచ్చినపుడు వారికి తాగడానికి కనీసం మంచినీరు కూడా లేకపోవటంతో ఉసూరుమంటూ వెనుదిరిగి వెంటనే వెళ్లిపోతున్నారు.

**కల్పించాల్సిన సౌకర్యాలు**

భవనం పనులు పూర్తిచేసి సిబ్బందిని ఏర్పాటుచేసి పూలమొక్కలు, చిన్నారులకు ఆటవస్తువులు, ఉండేందుకు వసతి, స్విమ్మింగ్‌పూల్, అవసరమైన తినుబండారాలు ఉంటే పర్యాటకులు పెరిగి ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. అప్పట్లో వీటికోసం నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించారే తప్ప పట్టించుకున్నవారు లేకపోవటంతో విలువైన చరిత్ర ప్రపంచానికి తెలిసే వీలు లేకుండా పోతోంది.

**ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది**చందవరం బౌద్ధ స్తూపాలు అన్నివిధాలా అభివృద్ధి చేయాలని ఉన్నతాధి కారుల దృష్టిలో ఉందని పురావస్తుశాఖ ఏడీఏ జరీనాకు తెలిపారు. నిధులు వచ్చిన వెంటనే మిగిలిన పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

## వలసెల్లిన గ్రామం.. దస్త్రాల్లో పదిలం

దొనకొండ :వీరఘట్టం మండలం రెవెన్యూ దస్త్రాల్లో ఉన్న విక్రమపురం పంచాయతీ పరిధిలోని మొదటికెల్ల, చిట్టపుడివలస పంచాయతీలోని శ్రీహరిపురం గ్రామాలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. పూర్వం ఆయా ప్రాంతాల్లో 20 నుంచి 30 వరకు కుటుంబాలు నివసించేవి. దశాబ్దాల కిందట ఇక్కడి జనం స్థానికంగా ఉపాధి లేకపోవడం, ఇతర కారణాలతో వలసెల్లిపోయారు. వారి భూములు పరిసర ప్రాంతాల వారికి విక్రయిం చేశారని స్థానికులు చెబుతున్నారు. భూమిపై లేకపోయినా మొదటికెల్ల రెవెన్యూ పరిధిలో 657 ఎల్‌పీఎం నంబర్లలో 337.68 ఎకరాలు, శ్రీహరిపురం 495 ఎల్‌పీఎం నంబర్‌లో 268.75 ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకం, వన్-బి దస్త్రాలున్నాయి. ఇటీవల భూసర్వే కూడా నిర్వహించారు.

## దుర్వాసన.. గ్రామీణుల వేదన



పుట్టపర్తి : బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ పరిశ్రమ నుంచి వెలువడే దుర్వాసన, వాయు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల పరిధిలోని నాలుగు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఆసుపత్రుల నుంచి వెలువడే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తే మానవాళికి ముప్పు ఉంటుందని గుర్తించిన ప్రభుత్వం వాటి నిర్వహణకు కొందరికి అనుమతి ఇస్తుంది. ఇలా ఉమ్మడి అనంతపురం, కడప జిల్లాల పరిధిలో వ్యర్థాల నిర్వహణకు బత్తలపల్లి మండలంలోని దంపెట్ల గ్రామ పరిధిలో పరిశ్రమకు అనుమతి తెచ్చుకుంది. దీంతో 2016లో పరిశ్రమను ఏర్పాటు చేశారు. దాని చుట్టూ దంపెట్ల, కట్టకిందపల్లి, సిద్ధన్నగారిపల్లి, ఉప్పలపాడు గ్రామాలున్నాయి.

గడువు ముగిసిన మందులు, వాడేసిన సిరంజిలు, శస్త్రచికిత్స సందర్భంగా వెలువడే వ్యర్థాలను ఇక్కడి పరిశ్రమలో వేరుచేసి పసుపు, ఎరుపు, నీలం రంగుల సంచుల్లో నింపుతారు. సూదులు, బ్లేడ్లు, తదితర పరికరాలను తెల్ల కంటైనర్లలో వేస్తారు. వాటి నుంచి దుర్వాసన వెలువడుతుంటుంది. సంచుల్లో నింపిన వాటిని రాత్రివేళల్లో కాల్చివేస్తారు. ఆ సమయంలో పొగ వెలువతున్న పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

**పనులు చేసుకోలేకున్నాం..**

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 1016, కడప జిల్లాలో 600 పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వాటిల్లో వెలువడే వ్యర్థాలను పరిశ్రమ రోజూ సేకరిస్తుంటుంది. ఇందుకుగాను ప్రతి ఆసుపత్రి నుంచి వాటిస్థాయికి అనుగుణంగా వేల రూపాయలు ప్రతి నెలా వసూలు చేస్తుంది. ఈ నేపథ్యంలో 33 శాతం గ్రీన్‌బెల్టు ఏర్పాటు చేయాలని... వాయుకాలుష్యం రాకుండా తగు చర్యలు తీసుకోవడం లేదని స్థానికలు అంటున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అనారోగ్యం బారిన పడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో పొలాలకు వెళ్లి పనులు చేసుకోలేకపోతున్నాం.. పశువులను మేపడానికి తీసుకెళ్లడమే మానేశామని చెబుతున్నారు.

ఈ విషయంపై పరిశ్రమ నిర్వాహకులు అశోక్‌ను వివరణ కోరగా నిబంధనల మేరకు నిర్వహిస్తున్నాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

నిబంధనలకు అనుగుణంగా చేస్తున్నారా.. లేదా? గ్రామీణులకు ఏవైనా ఇబ్బందులున్నాయా.. అనే విషయాలపై ఆరా తీస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

కిశోర్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి

## ఉరిమిన మొంథా.. అలజడే అంతా!



అనకాపల్లి : రావికమతం మండలం చీమలపాడు శివారులో జిలుగులోవలోని 26 గిరిజన కుటుంబాలను చీమలపాడు పునరావాస కేంద్రానికి తరలించారు. రాంబిల్లి మండలంలో సముద్ర తీర గ్రామాలైన వాడపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం, వేటకొత్తపట్నం, వెంకయ్యపాలెం, లోవపాలెం నుంచి ప్రజలను తరలించారు. ఎలమంచిలిలో 30 ఇళ్లను స్థానికంగా ఉన్న పునరావాస కేంద్రాలకు చేర్చారు.అనకాపల్లి మండలం వెంకుపాలెం రహదారిపై వెదుళ్లగెడ్డ పొంగి ప్రవహించింది. దీంతో కుంచంగి, రొంగలివానిపాలెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కశింకోట మండలం గొలగాం పంచాయతీ శివారు ఎల్లారమ్మ కాలనీ సమీపంలోని కొండచరియలు జారిపడి ఇల్లు ధ్వంసమైంది. మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెంలో ఇంటిగోడ కూలింది. కోటవురట్ల మండలం పి.కొత్తపల్లి సమీపంలోని రామన్నపాలెంలో పైల అప్పలనాయుడుకు చెందిన పెంకుటిల్లు స్వల్పంగా కూలింది.

నర్సీపట్నం – అడ్డురోడ్డు ప్రధాన రహదారిపై రామచంద్రాపురం వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. కొంత సమయం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై ఎలమంచిలిలోని పులపర్తి వద్ద ఈదురు గాలులకు భారీ చెట్టు కూలింది. స్థానికుల సహాయంతో దాన్ని తొలగించారు. నక్కపల్లి మండలంలోని గుల్లిపాడు వద్ద చెట్లు, వెదుళ్లపాలెంలో విద్యుత్తు స్తంభం విరిగిపడ్డాయి. ఉదయం నుంచి ఈదురుగాలులు వీస్తున్న నేపథ్యంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జలాశయాలు, నదులు, వాగులు, కాలువలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. గాలులకు అక్కడక్కడ చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రతి మండలంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి తరలించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడుపూటలా సకల సౌకర్యాలు అందించారు. తీరప్రాంత గ్రామాలను ముందస్తుగానే బహుళ ప్రయోజన భవనాల్లోకి తరలించారు. అడపాదడపా చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడినా.. జిల్లా యంత్రాంగం వెంటనే వాటిని తొలగించి, ప్రజాజీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు చేపట్టింది.

జిల్లాలో అధికంగా వర్షాలు పడుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ముందుగా రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన వినయ్‌చంద్.. జిల్లా అధికారులను సమన్వయం చేసుకుంటూ పక్కా ప్రణాళికతో ఎక్కడికక్కడ ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాలు సౌకర్యాలు కల్పించారు. ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్ల ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, రక్షిత భవనాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ కె.స్వప్న తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. గర్భిణిలను ఆసుపత్రులకు తరలించామన్నారు.

**ముందే రేషన్ పంపిణీ**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లాలో రేషన్ డిపోల ద్వారా సరకుల పంపిణీ ప్రారంభించామని సంయుక్త కలెక్టర్ జాహ్నవి పేర్కొన్నారు. జిల్లాలో 5,35,492 మంది కార్డుదారులకు రేషన్ నిర్ణీత గడువు కన్నా ముందే అందిస్తున్నామన్నారు. డిపోలకు బియ్యం, పంచదార తరలించామన్నారు. తొలిరోజు 30789 మంది కార్డుదారులకు 382 మెట్రిక్ టన్నుల బియ్యం, 27719 మందికి 30 మెట్రిక్ టన్నుల పంచదార పంపిణీ చేశామని తెలిపారు. **సబ్బవరంలో అధిక వర్షపాతం**తుపాను ప్రభావంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. నదులన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. ఉదయం 8.30 నుంచి సాయంకాలం 6 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా సబ్బవరంలో 167.8 మి.మీ. వర్షం కురిసిందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. రాంబిల్లి, పరవాడ, అచ్యుతాపురం, కె.కోటపాడు, చోడవరం, మునగపాక, నక్కపల్లి, బుచ్చె య్యపేట, ఎస్.రాయవరం, ఎలమంచిలి మండలాల్లో వంద మి.మీ. కంటే ఎక్కువ.. గొలుగొండ, నాతవరం, మాడుగుల మండలాలు మినహా మిగిలిన అన్నిచోట్లా 66 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

## ఉపాధి కోర్సులు

తిరుపతి : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఉపాధి కోర్సుల విద్యార్థినుల బంగారు భవితకు బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా పలు ఇంటిగ్రేటెడ్, ఒకేషనల్, హానర్స్ డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోంది. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థినులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సులు ఇవే.. బి.ఒకేషనల్‌లో.. మూడేళ్ల ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అప్పరల్ డిజైనింగ్ (50 సీట్లు), న్యూట్రిషనల్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ (50), బీఎస్సీ హానర్స్ స్టాటిస్టిక్స్ (40), బీఏ హానర్స్ సోషల్‌వర్క్(40), ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ (40), ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ కోర్సులో 35 సీట్లున్నాయి.

మొదటి, రెండు కౌన్సెలింగ్‌లలో సీట్లు పొందని విద్యార్థినులు వోఎండీసీ పోర్టల్‌లో బుధవారంలోగా నమోదు చేసుకోవాలి. నవంబరు 1వ తేదీ వరకు సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసుకోవాలి.

**ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో.. 253 పోస్టుల భర్తీకి అనుమతి**

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో 253 బోధనా సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రత్యక్ష




నియామకాలు చేపట్టేలా నోటిఫికేషన్ జారీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పశుసంవర్ధక శాఖ) బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

## మెరవని గ్రానైట్!

ఒంగోలు : జిల్లాకు మూలాధారమైన గ్రానైట్ పరిశ్రమల్లో కార్యకలాపాలు నెల రోజులుగా స్తంభించిపోయాయి. బండరాళ్లను పాలిష్ బండలుగా మార్చే కోత యంత్రాలు తిరగడం లేదు. ఫలితంగా చీమకుర్తి ప్రాంతంలో సందడి కనిపించడంలేదు. గ్రానైట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఉపాధిపై ప్రభావం పడింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వేలాదిమంది పనుల్లేక అల్లాడి పోతున్నారు. క్వారీ నుంచి తీసే గ్రానైట్ బండరాళ్లపై సీనరేజీ వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం ఏఎంఆర్ సంస్థకు అప్పగించింది. గనులశాఖ నిర్దేశించిన మేరకు వీరు పన్ను వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలి. పన్ను వసూలు చేసే ఏఎంఆర్ సంస్థ, గనులశాఖకు చెల్లించే సొమ్ముతో పాటు అదనంగా చెల్లించాలని కోరడంతో పరిశ్రమ యజమానుల్లో ఆందోళన మొదలైంది. ఒక్కో పరిశ్రమ యజమాని రూ.35 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఆ సంస్థ అదనంగా బండరాళ్లను కోసే అవకాశం ఉన్నందున మరో రూ.30 వేలు వరకు చెల్లించాలని డిమాండు చేస్తున్నారు. దీంతో యజమానులు ఈ నెల ఆరంభం నుంచి సమ్మెలో దిగారు. గత 15 రోజులుగా పనులు లేకపోవడంతో



కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఈలోగా దీపావళి పండగ రావడంతో మిగిలినవారు సొంతూళ్లకు తరలిపోయారు. దీంతో పరిశ్రమల్లో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత భారీ వర్షాలు కురుస్తుండడంతో పనులకు ఆటంకం ఎదురైంది. దాదాపు నెల రోజులుగా గ్రానైట్ పరిశ్రమలు మూతపడ్డాయి.

**ఎడతెగని వివాదం**అదనపు చెల్లింపులపై ఇప్పటికే ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులతో పరిశ్రమ యజమానులు పలు దఫాలుగా చర్చలు జరిపినా ఫలించలేదు. గ్రానైట్ క్వారీల నుంచి ఏ రాయి తీసుకొస్తే, దానికి ఆమేరకు పన్ను చెల్లించా ల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇలా తీసుకొచ్చిన ప్రతి రాయి పాలిష్ బండలుగా మారదని, పగుళ్లు ఉంటాయని కోత ఖర్చులు భరించి పన్ను చెల్లించాలంటే ఎలాగని యజమానులు వాదిస్తున్నారు. తాము ఎంతవరకు కోత కోసి పాలిష్ బండలుగా మార్చామో.. దాని వరకు పన్ను చెల్లించేందుకు సుముఖమేనని వాదన వినిపిస్తున్నారు. అవన్నీ తాము పట్టించుకోబోమని నిబంధనల ప్రకారం చెల్లించాల్సిందేనని ప్రైవేటు సంస్థ పట్టుబడుతోంది. గ్రానైట్ పరిశ్రమలు పూర్తిస్థాయిలో తెరచుకోకపోవడంతో కూలీలతో పాటు రవాణా రంగానికి చెందినవా రు, వీరిపై ఆధారపడిన చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలాది కుటుంబాల జీవనోపాధితో ముడిపడినందున ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది.

## అధికారులకు అగచాట్లే

నెల్లూరు : బహిరంగ మల, మూత్ర విసర్జన తగదని చెప్పే అధికారులకే ఆ సమస్య తలెత్తింది. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల వసతి లేదు. కొన్నిచోట్ల భవనాలు నిర్మించినా.. మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల నిర్మించినా నిరుపయోగంగా వదిలేశారు. ఫలితంగా అక్కడ విధులు నిర్వహించే అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకులు అత్యవసరానికి అవస్థలు తప్పడం లేదు.

**రెండు శాఖల్లోనూ..**

కావలి పట్టణంలోని మత్స్యశాఖ కార్యాలయంలో సహాయ సంచాలకులు ఉంటారు. కావలి ప్రాంత ఎఫ్‌డీవో కూడా ఇక్కడే విధులు నిర్వర్తిస్తుంటారు. ఇక్కడ మరుగుదొడ్ల వసతి లేకపోవడంతోపాటు భవనం పూర్తిగా శిథిలమైపోయింది. వర్షం వస్తే ఉరుస్తుంది. జలవనరులశాఖ ఈఈ కార్యాలయంలో కూడా మరుగుదొడ్లు లేవు. పలు సచివాలయాల్లోనూ ఇదే సమస్య నెలకొంది. అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగులు ఇక్కట్లకు గురవుతున్నారు.

**సముదాయంలో ఆ ఒక్కచోటే..**

కోవూరు పట్టణంలో తాలూకా ఆఫీసు వద్ద తహసీల్దారు, మండల పరిషత్తు, విద్య, వ్యవసాయం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహనిర్మాణ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. అన్నింటికీ మరుగుదొడ్ల వసతి ఉన్నా... గృహనిర్మాణ శాఖ కార్యాలయానికి లేదు. అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు అత్యవసరాలకు సులభ్ కాంప్లెక్స్‌కు వెళుతున్నారు. మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు.

**పంచాయతీల్లో స్వచ్ఛతను పర్యవేక్షించే వారికీ..**

నెల్లూరు నగరంలోని నూతన జడ్పీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కార్యాలయం ఉండగా.. అదేశాఖకు చెందిన ఈఈ కార్యాలయం ఆచారివీధిలోని పాత జడ్పీ కార్యాలయం వద్ద కొనసాగుతోంది. ఇక్కడ కార్యాలయ సిబ్బందికి మరుగుదొడ్లు లేవు. పంచాయతీల్లో స్వచ్ఛతను పర్యవేక్షించే అధికారులకే వసతి లేకపోవడం గమనార్హం.



పంచాయతీరాజ్ కార్యాలయంలో కూడా అక్కడకు వచ్చే వారికి ప్రత్యేకంగా ఎలాంటి మరుగుదొడ్లు లేవు. నెల్లూరు నగరంలోని ఆర్డీవో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి వసతి లేక అవస్థలు తప్పడం లేదు. **గదులు నిర్మించి..విస్మరించి..**రాపూరులోని ఉపాధి హామీ పథకం కార్యాలయంతోపాటు గ్రంథాల యంలో మరుగుదొడ్ల వసతి లేదు. ఉపాధి హామీ కార్యాలయంలో గదులు నిర్మించారేగానీ ఎలాంటి వసతులు లేకపోవడంతో గదులన్నీ నిరుపయోగంగా వదిలేశారు. సిబ్బంది మలమూత్ర విసర్జనకు బహిరంగ ప్రదేశాలకు వెళుతున్నారు. గ్రంథాలయంలో కూడా వసతి లేదు.

చురకలు



## నైపుణ్యానికి యువసత్వాలు

డోన్ : యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కేంద్రం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంపికైన వారికి ప్రతి నెలా స్టైఫండ్ అందించడమేకాక ప్రముఖ కంపెనీల్లో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తారు. కార్పొరేట్ సంస్థలకు నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల అవసరం ఎంతగానో ఉంది. విద్యార్థులకు అకడమిక్ థియరిటికల్ అంశాలపై అవగాహన ఉన్నప్పటికీ ప్రాక్టికల్ నాలెడ్జ్ అంతంతమాత్రమే. ఈ అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో 2024-25 నుంచి 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

**అర్హులు ఎవరంటే**

పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఫార్మసీ తదితర కోర్సులు చదివినవారు.

21-24 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు..

వీరు అనర్హులు

ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా వర్సిటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ, ట్రిపుల్



ఐటీ నుంచి గ్రాడ్యుయేటు, సీఏ, సీఎంఏ, సీఎస్, ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంబీఏ, ఏదైనా ఇతర ఉన్నత లేదా మాస్టర్స్ డిగ్రీ ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కింద ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారికి, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ సిస్టం, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ పథకం కింద శిక్షణ పొందినవారికి పీఎం ఇంటర్న్‌షిప్ లభించదు.

**కావాల్సిన పత్రాలు**

దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత పత్రాలు తప్పనిసరి.

**ఎంపిక ఇలా**

అభ్యర్థికి గరిష్ఠంగా మూడు ఐచ్ఛికాలు (కంపెనీలు) ఇస్తారు. ఎంపికైన వారికి ప్రముఖ సాఫ్ట్‌వేర్, బహుళజాతి సంస్థలు, చమురు, గ్యాస్, ఇంధన రంగం, టూర్స్ అండ్ ట్రావెల్స్, ఆతిథ్య రంగంలో అవకాశాలు ఇస్తారు.

**ఏడాదికి రూ.60 వేల వేతనం**


ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన వెంటనే విద్యార్థికి రూ.6 వేలు ఇస్తారు. దీంతోపాటు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ఏడాదిపాటు రూ.60 వేలు అందిస్తారు. ఇందులో కేంద్రం రూ.4,500, సదరు కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.500 లభిస్తుంది. విద్యార్థిలోని ప్రతిభను బట్టి సదరు కంపెనీ ఇంకనూ ఎక్కువ ఇవ్వొచ్చు.

## రక్తంలో రాకాసి..
## కొడవలిలా మాటేసి

విజయనగరం : ఉమ్మడి జిల్లాలో సికిల్‌సెల్ ఎనీమియా విజృంభిస్తోంది. రానురానూ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం దృష్టిసారించింది. అవగాహనతో పాటు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వైద్యులు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో 40 ఏళ్ల లోపు వయసున్న సుమారు 28,173 మంది గిరిజనులను గుర్తించి, 26,656 మందికి పరీక్షలు చేశారు. వీరిలో ఇద్దరికి పాజిటివ్ లక్షణాలు కనిపించాయి. వీరే కాకుండా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 162 మంది బాధితులు చికిత్స పొందుతున్నట్లు వైద్యారోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. మన్యంలో ఈ సంఖ్య 219కి చేరింది.

**ప్రత్యేకంగా నిధులు..**

రెండు జిల్లాల్లో తీవ్రతను గుర్తించిన దిల్లీలోని భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.4 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్ల పాటు పరిశోధనలు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టును సీటీయూ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా.పరికిపండ్ల శ్రీదేవి



పర్యవేక్షిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై దృష్టిసారించనున్నారు.

**లక్షణాలివీ..**

విపరీతమైన నొప్పి
రక్తహీనతజి
చేతులు, కాళ్లలో వాపు
ఊపిరి తీసుకోలేకపోవడం
తరచూ జ్వరం రావడం
డీహైడ్రేషన్
మూత్రం ద్వారా రక్తం

ప్రత్యేక దృష్టి..

'రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారిపోయి, అవయవాలను వెంటాడుతాయి. ఈమేరకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే వైద్య శిబిరాలు ప్రారంభించాం. కళాజాతలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు 130 శిబిరాల ద్వారా పరీక్షలు చేశాం. అవసరమైన వారికి సకాలంలో చికిత్సలు చేస్తున్నాం' అని జిల్లా పర్యవేక్షణాధికారిణి కె.రాణి తెలిపారు.

# రూ.173 కోట్ల నీటి పథకానికి గ్రహణం



పామిడి : గుత్తి, పామిడి పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఐదేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం భారీ నీటి పథకాలను మంజూరు చేసింది. పెనకచెర్ల డ్యాం నుంచి పామిడి మండలం మీదుగా గుత్తి మున్సిపాలిటీకి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నా సంకల్పంతో రూ.173 కోట్లతో పనులకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా పనులకు పెనకచెర్ల డ్యాం నుంచి కండ్లపల్లి, సొరకాయల పేట, కొత్తపల్లి, పామిడి గ్రామాల మీదుగా తాగునీటి పైపులైన్‌లతో పాటు తాగునీటి ట్యాంకుల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఇప్పటికీ అవి పూర్తి కాలేదు.

**వైకాపా అధికారంలోకి రావడంతో..**

తెదేపా ప్రభుత్వం మారిపోవడంతో అధికారంలోకి వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తాగునీటి పథకాల పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో పట్టణ వాసులకు తాగునీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారింది. అప్పటి వైకాపా ఎమ్మెల్యేలు నీటి పథకాలను పూర్తి చేసి తాగునీటిని అందిస్తామని చెప్పి ఐదేళ్ల కాలాన్ని వృథా చేసింది.

**నిర్మాణదశలోనే ట్యాంకులు**

పామిడి మండలంలోని సొరకాయల పేట, కొత్తపల్లి, పామిడి పట్టణంలోని గుప్తా కాలనీ తాగునీటి ట్యాంకులు 60 శాతం మేర పనులను పూర్తి చేసుకోగా, పామిడి ప్రభుత్వ బాలుర వసతి గృహ ఆవరణలో పిల్లర్ల దశలో ఆగిపోయింది.

**పెరిగిన వ్యయంతో మారిన టెండర్లు**

నీటి పథకాల నిర్మాణ వ్యయం ఏడాదికేడాది పెరుగుతోంది. తొలుత గుత్తి మున్సిపాలిటీకి తాగునీరు అందించేందుకు రూ.90 కోట్ల నిధులు ప్రతిపాదించారు. తరువాత పథకం వ్యయం పెరిగి రూ.120 కోట్లకు చేరింది. ఆ తరువాత నీటి పథకాన్ని పూర్తి చేసేందుకు గాను అంచనా వ్యయం పెరుగుతూ వస్తోంది. కూటమి ప్రభుత్వం తక్షణమే నీటి పథకాలను పూర్తిచేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# పత్తి దిగదుడుపే..!



అనంతపురం : సమయానికి కురువని వాన.. తెగుళ్ల విజృంభణ.. వెరసి పత్తి పంట రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఆశించిన మేర పూత, కాయ లేకుండా పోయి దిగుబడి తగ్గింది. తెల్లబంగారంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు దిగాలు చెందుతున్నారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు దోపిడీతో నేలను నమ్ముకుని వేలకు వేలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినా.. కనీసం రెక్కల కష్టం రాకుండా పోతోంది. దీంతో ఏటా పంట సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది.

**వర్షాధారం.. రైతులకు శాపం**

జిల్లాలో చాలా వరకు వర్షాధారంపై పత్తి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 44,001 హెక్టార్లలో సాధారణ సాగు లక్ష్యం కాగా 27,285 హెక్టార్లలోనే పంట వేశారు. జూన్, జులైలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మొక్కలు ఎదగలేదు. పూత, కాయ తగ్గింది. ఎకరాకు సుమారు 16 క్వింటాళ్ల నుంచి 18 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 4 నుంచి 5 క్వింటాళ్లు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని వ్యవసాయశాఖ అధికారులే అంచనా వేశారు. ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెడుతుండగా.. దిగుబడి అమ్ముకుంటే వచ్చేది రూ.30 వేలు.. రూ.5 వేలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులోనూ కొంతమేర పంట వేశారు. ప్రస్తుతం పూత దశలో ఉంది.

**నాణ్యత లేదని..** పత్తి నాణ్యత లేదని ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తేమ శాతం అధికంగా ఉందని.. వ్యాపారులు ధర తగ్గించేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. బళ్లారి, ఆదోని మార్కెట్లలో క్వింటాలు ధర రూ.4,005 నుంచి రూ.7,000 వరకు కొనుగోలు చేస్తున్నారు.

**త్వరలో రెండు కేంద్రాలు ఏర్పాటు**

రాఘవేంద్రకుమార్, సహాయ సంచాలకులు, మార్కెటింగ్‌శాఖ

జిల్లాలో తాడిపత్రి, గుత్తి మార్కెట్ యార్డులో కొనుగోలుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. మిల్లులకు రవాణా చేసేందుకు టెండర్లు తుది దశలో ఉన్నాయి. నవంబరు మొదటి వారంలో కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం. నిబంధనల ప్రకారం తేమ 8 నుంచి 12 శాతం ఉండాలి.

**మద్దతు ధర ప్రకటిస్తున్నా..**

ఈఏడాది 27,750 హెక్టార్లలో 24,975 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. మార్కెటింగ్‌శాఖ సహకారంతో కొనుగోలు బాధ్యతలను సీసీఐకు అప్పగించారు. ఈ ఏడాది గతంలో కంటే మద్దతు ధర ఎక్కువ ప్రకటించారు.

**గత మూడేళ్లలో పరిశీలిస్తే..** 2023లో క్వింటాలు మొదటి రకం రూ.7,020 కాగా రెండో రకం రూ.6,620 ఉంది. 2024లో మొదటి రకం రూ.7,521, రెండోది రూ.7,121, గతేడాది మొదటి రకం రూ.8,110 కాగా రెండోది రూ.7,710 ప్రకటించారు. గతం కంటే ఈ ఏడాది బాగా పెంచారు. అయినా కొనుగోళ్లు ప్రారంభించకపోవడం అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

# అక్రమార్కుల చేతిలో.. పెన్నా, జయమంగళి విలవిల



పరిగి : పరిగి మండల పరిధిలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి యథేచ్ఛగా అక్రమార్కులు ఇసుకను కొల్లగొడుతూ కాసుల పంట పండిస్తున్నారు. కొడిగెనహళ్లి, పరిగి, పైడేడి, శ్రీరంగరాజుపల్లి, మోదా, నేతులపల్లి నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఓ వైపు పోలీసు శాఖ దాడులు నిర్వహిస్తూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను జప్తు చేస్తున్న ఫలితం కానరావడం లేదు. పట్టుబడిన ట్రాక్టర్లకు చిన్నపాటి జరిమానాలు విధించి పంపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో నదుల నుంచి ఇసుక తరలిస్తూ పట్టుబడితే ఉన్నతస్థాయి నాయకుల నుంచి ఒత్తిడి తెచ్చి ట్రాక్టర్లను విడిపించుకుంటున్నారు.

కొడిగెనహళ్లిలో వైకాపాకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు తామేమి చేసిన అడిగేవారే లేరన్న రీతిగా కాలువపల్లి సమీపంలోని జయమంగళి నదిలో తెల్లవారుజాము నుంచే రెండు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దీంతో జయమంగళి, పెన్నా నదుల స్వరూపమే కోల్పోయాయి. రాత్రి వేళల్లో సైతం ఊటుకూరు, పైడేటి ప్రాంతాల్లో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను కర్ణాటక, సమీప మండలాలకు తరలిస్తున్నారు. **రైతుల ఆందోళన** నదుల నుంచి ఇసుక తరలిస్తుండటంతో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ బోర్లలో నీటి మట్టం అడుగంటుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డార్కె ఏరియా మండలంగా గుర్తింపు పొందిన పరిగి మండలంలో ప్రవహించే పెన్నా, జయమంగళి నదుల నుంచి ఇసుక తరలింపును ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్తులో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొంటుంది. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక తరలింపును అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**రాత్రిళ్లు నిఘా ఏర్పాటు చేస్తాం**


అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక ఇతర మండలాలకు తరలిస్తే ట్రాక్టర్లను జప్తు చేసి జరిమానాలు విధిస్తున్నాం. రెవెన్యూ, పోలీసు శాఖ సమన్వయంతో రాత్రివేళల్లో ఇసుక తరలించకుండా ఉండేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. హసీనాసుల్తానా, తహసీల్దార్, పరిగి

## నాడితప్పిన ఆసుపత్రి పాలన

కర్నూలు: సర్వజన ఆసుపత్రి నిర్వహణ, పాలన ఇష్టారాజ్యంగా సాగుతోంది. పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు.. వైద్యుల వద్ద కాంపౌండర్లుగా అనధికారికంగా కొనసాగుతున్నారు. భద్రత సిబ్బంది విధులకు హాజరుకాకపోయినా.. తక్కువ మంది వస్తున్నా అందరూ వస్తున్నట్లు నమోదు చేయడం తదితర పలురకాల అవకతవకలు ఇప్పటికే వెలుగుచూశాయి. మందులు, పరికరాలు, ఇంప్లాంట్ల కొనుగోళ్లలో ప్రభుత్వ ఖజానాకు నష్టం వచ్చేలా నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. వైద్యులు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉండగా మధ్యాహ్నం 2 దాటిన తర్వాత పలువురు వెళ్లిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా తనను తన విభాగంలో విధులు నిర్వర్తించే అవకాశం కూడా ఇవ్వడం లేదంటూ పి.అనితారాణి అనే వైద్యురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం ఆస్పత్రిలో పాలనకు అద్దం పడుతోంది.

**నిబంధనలకు తిలోదకాలు**

ఇద్దరు గైనకాలజిస్టులు జూన్‌లో అనాటమీ విభాగానికి బదిలీ అయినప్పటికీ కుటుంబ నియంత్రణ విభాగంలోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వం తనకు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బాధ్యతలు అప్పగించాలని సూపరింటెండెంట్‌కు కోరినా పట్టించుకోవడంలేదని డాక్టర్ అనితారాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేమని అడిగితే తననే సరెండర్ చేస్తానని.. కుటుంబ నియంత్రణ విభాగంలో విధులు నిర్వర్తించొద్దని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారని ఆమె వివరించారు. ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌తో వైద్యులను తిట్టిస్తున్నారని.. సీసీ టీవీ



దృశ్యాలు పరిశీలిస్తే వారు వైద్యులతో ఎలా ప్రవర్తిస్తున్నారన్న విషయం తెలుస్తుందని విన్నవించారు.

గైనకాలజిస్టులు, సర్జన్లు, ఎముకల వైద్య నిపుణులు ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేసుకునేందుకు సూపరింటెండెంట్ సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చర్మ వ్యాధుల విభాగంలో పనిచేయాల్సిన వైద్యుడు గుండె వైద్య విభాగంలో కొనసాగుతున్నారని, కొందరు సర్జన్లను సంబంధం లేని విభాగాల్లో నియమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## నిధుల 'పుర'వళ్లు

ఆదోని : ఉమ్మడి జిల్లాలో పురపాలక సంఘాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. కర్నూలు నగరపాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలక సంఘాలకు మొదటి విడత కింద రూ.43.71 కోట్లు ఇస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. టైడ్, అన్ టైడ్ కింద ఈ మొత్తం మంజూరు చేసింది.

**టైడ్.. రూ.26,22,77,881**

టైడ్ కింద ఇచ్చిన నిధుల్లో చెరి సగం వరకు తాగునీటి సరఫరా, మురుగు నీటి శుద్ధి నిర్వహణకు వినియోగించుకోవాలి. గత ప్రభుత్వంలో అమృత్ పథకం కింద ఇచ్చిన నీటి ప్రాజెక్టులు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు ఖర్చు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే



నిలిచిపోయాయి. ఈ పనులు పూర్తి చేసేందుకు ఈ నిధులు వినియోగించుకోనున్నారు.

**అన్‌టైడ్.. రూ.17,48,51,740**

అన్ టైడ్ కింద వచ్చే నిధుల్లో పాతిక శాతం సీసీ, బీటీ రహదారుల నిర్మాణాలకు వెచ్చించనున్నారు. మిగిలిన 75 శాతం నిధులతో పురపాలక ఆస్తులు, బహిరంగ స్థలాల సంరక్షణకు వినియోగించుకోవడం, క్రిమిటోరియం నిర్మాణాలు, సామూహిక శౌచాలయాల్లో నీటి వసతి, పార్కుల అభివృద్ధి తదితర పనులు చేయనున్నారు.

## బొప్పాయి పాలు.. విదేశాలకు

చిన్నవంగలి : చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

## 40లో రూ.20 కోట్లు... ఇది నయనతారకే చెల్లింది!

లేడీ సూపర్ స్టార్ నయనతార 2003లో 'మనస్సినక్కరే' అనే మలయాళ సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. మలయాళంలో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చినప్పటికీ ఈ అమ్మడు ఎక్కువగా తమిళ్ సినిమాలు చేసింది. తమిళ్‌లో ఈమె చేసిన అయ్యా, చంద్రముఖి సినిమాలతో ఒక్కసారిగా స్టార్‌డం దక్కించుకుంది. గజిని సినిమాతో వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. తమిళ్ లో బిజీగా ఉన్న సమయం లోనే తెలుగులో ఈ అమ్మడు లక్ష్మి సినిమాతో ఎంట్రీ ఇచ్చింది. నయనతార టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి దాదాపుగా ఇరవై సంవత్సరాలు అవుతుంది. ఇక ఈమె ఇటీవలే 41 ఏళ్ల వయసులో పడింది. సాధారణంగా హీరోయిన్స్ నాలుగు పదుల వయసులో పడితే ఆఫర్లు తగ్గుతాయి, ప్రేక్షకులు ఆసక్తి తగ్గిస్తారు. కానీ ఈమె విషయంలో మాత్రం అలా జరగడం లేదు. నాలుగు పదుల వయసులోనూ ఈమె జోరు ఏమాత్రం తగ్గలేదు.

**వరుస సినిమాలతో నయనతార బిజీ బిజీ...** గత పదేళ్ల కాలంగా నయనతారకు రాజయోగం అన్నట్లుగా టైం నడుస్తుంది అని ఆమె అభిమానులు మాట్లాడుకుంటూ ఉన్నారు. లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేసినా, హీరోలకు జోడీగా హీరోయిన్‌గా సినిమాలు చేసినా కూడా



ఈమెకు సక్సెస్‌లు పడుతున్నాయి. ఒకవేళ ఈమె నటించిన సినిమాలు ఫ్లాప్ అయినా కూడా ఆ ప్రభావం లక్కీగా ఈమె పై పడటం లేదు. అందుకే ఇప్పటికీ నయనతార సౌత్‌లో నెం.1 హీరోయిన్‌గా దూసుకుపోతుంది. ఈ మధ్య వస్తున్న హీరోయిన్స్ పదేళ్లు ఉంటే గొప్ప విషయం అన్నట్లుగా ఉంది. ఆ మధ్య వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్, పూజా హెగ్డే మరికొందరు ఒక్కసారిగా వెలుగు వెలిగి కనిపించకుండా పోయారు. కానీ నయనతార మాత్రం రెండు దశాబ్దాలు దాటినా, ఆమె వయసు నాలుగు పదులు దాటినా ఇప్పటికీ సినిమాలతో బిజీగా ఉంది. సినిమాలు చేయడం అంటే ఏదో అల్లాటప్పా సినిమాలు వరుసగా ఈమె చేయడం లేదు. ప్రస్తుతం చిరంజీవితో అనిల్ రావిపూడి దర్శకత్వంలో మన శంకర వరప్రసాద్ గారు సినిమాలో నటిస్తున్న నయనతార, ఇటీవలే బాలకృష్ణ, గోపీచంద్ కాంబో మూవీలో హీరోయిన్‌గా ఎంపిక అయింది. ఆ సినిమాలో రాణి పాత్రలో నయనతార కనిపించబోతుందని అధికారికంగా ప్రకటన వచ్చింది. బాలయ్య సినిమాకు నయనతార అత్యధిక పారితోషికం అందుకోబోతుంది అనే వార్తలు వస్తున్నాయి. 40 ఏళ్ల వయసులో ఈ స్థాయి పారితోషికం అందుకోవడం సౌత్‌లోనే కాకుండా ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో కేవలం నయనతారకు మాత్రమే చెల్లిందని ఆమె అభిమానులు, ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## అనుష్క నెక్స్ట్.. అది బెటర్ ఆప్షన్..!

స్వీటీ అనుష్క రీసెంట్ గా ఘాటి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా ఆ సినిమాతో ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. క్రిష్ డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ సినిమా కనీసం పమోషన్స్ కూడా సరిగా చేయకపోవడం వల్ల సినిమా డిజాస్టర్ అయ్యింది. సినిమా థియేట్రికల్ వెర్షన్ మాత్రమే కాదు ఓటీటీలో కూడా పెద్దగా ఇంపాక్ట్ చూపించలేదు. ఐతే అనుష్క ఘాటి స్పెషల్ ఫోన్ టాక్ లో భాగంగా రానాతో నెక్స్ట్ ఇయర్ నుంచి అసలు గ్యాప్ ఉండదని వరుస సినిమాలు చేస్తానని అన్నది. అనుష్క అలా చెప్పడం ఫ్యాన్స్ కి కాస్త ఉత్సాహాన్ని ఇచ్చింది.




**నిశ్శబ్ధం తర్వాత అనుష్క గ్యాప్..** ఐతే ఘాటితో మరోసారి ఫిమేల్ సెంట్రిక్ సినిమా అటెంప్ట్ చేసింది అనుష్క. ఇది కూడా అరుంధతి, భాగమతి, రుద్రమదేవి తరహాల్లో ఉంటుందని అనుకుంటే అది కాస్త మిస్ ఫైర్ అయ్యింది. నిశ్శబ్ధం తర్వాత అనుష్క గ్యాప్ ఇచ్చి మరీ నవీన్ పొలిశెట్టితో మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి సినిమా చేసింది. ఆ సినిమా పర్వాలేదు అనిపించుకుంది. ఐతే ఆ తర్వాత ఘాటితో మరో సూపర్ హిట్ కొడుతుందని అనుకుంటే అది కాస్త డిజాస్టర్ అయ్యింది. అనుష్క నెక్స్ట్ సినిమా విషయంలో ఫ్యాన్స్ ఇలాంటి ప్రయోగాలు వద్దు కమర్షియల్ సినిమా చేస్తే చాలని అంటున్నారు. స్టార్ సినిమాలకు అనుష్క పర్ఫెక్ట్ ఆప్షన్ అవుతుంది. ఆమె స్టార్స్ తో నటిస్తే ఆ ప్రాజెక్ట్ కి స్పెషల్ క్రేజ్ వస్తుంది. అలా కాకుండా లేడీ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తా అంటే మాత్రం కష్టమే అని చెప్పొచ్చు. ఫిమేల్ సెంట్రిక్ సినిమాలు ఆమెకు ఎంత పాపులారిటీ తెచ్చినా వాటికంటూ కొన్ని లిమిటేషన్స్ ఉంటాయి. అందుకే అనుష్క ఇమేజ్ కి తగినట్టుగా స్టార్ సినిమాలు చేస్తే ఆమెకు ప్లస్ అవుతుంది.

**సూపర్ సినిమాతో తెరంగేట్రం..** సూపర్ సినిమాతో తెరంగేట్రం చేసిన అనుష్క గ్లామర్ షోలో కూడా వెనక్కి తగ్గలేదు. ఇక ఫిమేల్ సెంట్రిక్ సినిమాలకు సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్ గా కొన్నాళ్లు కనిపించింది. ఐతే ఆ తర్వాత సైజ్ జీరో కోసం బాగా బరువు పెరిగి అది తగ్గించుకోవడం కోసం సినిమాలకు దూరమైంది. కెరీర్ పరంగా అనుష్క ప్లాన్స్ ఏంటన్నది అర్థం అవ్వక ఆడియన్స్ బాగా అప్సెట్ లో ఉన్నారు. అనుష్క కూడా మళ్లీ తిరిగి స్టార్ సినిమాలు చేస్తే మాత్రం ఫ్యాన్స్ కి పండగ అన్నట్టే లెక్క. ప్రస్తుతం అమ్మడు మలయాళంలో ఒక సినిమా చేస్తున్న అనుష్క తెలుగులో కూడా స్టార్ మూవీస్ కోసం ఎదురుచూస్తుంది. ఆమె చేయాలని అనుకోవాలో కానీ స్టార్ సినిమా ఛాన్స్ లు తప్పకుండా వస్తాయి.




## అఖండ 2 ట్రైలర్ టాక్: దుష్ట శక్తులపై బాలయ్య శివ తాండవం




అఖండ విజయం తర్వాత నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న సీక్వెల్ 'అఖండ 2: తాండవం' పై అంచనాలు ఏ రేంజ్ లో ఉన్నాయో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. టీజర్ లో చూపించిన కంటెంట్ అంతగా క్లిక్ కాలేదు. కానీ ట్రైలర్ తో బోయపాటి మరింత హై వోల్టేజ్ కంటెంట్ చూపించారు. భక్తి, యాక్షన్, ఎమోషన్.. అన్నీ సమపాళ్లలో కలిపిన ఈ ట్రైలర్ చూస్తుంటే బాక్సాఫీస్ దగ్గర మరోసారి రికార్డుల వేట ఖాయం అనిపిస్తోంది. ట్రైలర్ ఆరంభమే అద్భుతమైన విజువల్స్ తో మొదలైంది. ముఖ్యంగా కుంభమేళా, సనాతన ధర్మం అంటూ ఆడియెన్స్ కు కనెక్ట్ అయ్యేలా విజువల్ ట్రీట్ ఇవ్వనున్నట్లు అర్థమవుతుంది. దేవాలయాలు, హిమాలయాల బ్యాక్ డ్రాప్, అఘోరాల సమూహం.. అన్నీ కలిసి ఒక డివైన్ అట్మాస్ఫియర్ ని క్రియేట్ చేశాయి. ముఖ్యంగా బాలయ్య అఘోరా గెటప్ లో ఎంట్రీ ఇచ్చిన విధానం గూస్ బంప్స్ తెప్పిస్తుంది. దేశం కోసం దైవం కోసం అంటూ బాలయ్య చెప్పిన డైలాగ్ సినిమాలోని ఇంటెన్సిటీని తెలియజేస్తోంది. ఈసారి కథలో స్కేల్ పెరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాకుండా, దేశ సరిహద్దుల్లో జరిగే సంఘటనలను కూడా కథలో మిక్స్ చేసినట్లున్నారు. మిలిటరీ బ్యాక్ డ్రాప్ లో వచ్చే సీన్స్, టెర్రరిజం ఎలిమెంట్స్ ట్రైలర్ లో హైలైట్ అయ్యాయి. బాలయ్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవైపు అఘోరాగా, మరోవైపు పవర్ ఫుల్ పాత్రలో ఆయన వేరియేషన్స్ ఆకట్టుకున్నాయి. తమన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ట్రైలర్ కు ప్రాణం పోసింది. ముఖ్యంగా యాక్షన్ సీక్వెన్స్ లలో వచ్చే సౌండ్ డిజైన్ థియేటర్ లో విజిల్స్ వేయించేలా ఉంది. బోయపాటి మార్క్ స్లో మోషన్ షాట్స్, గ్రాండియర్ సెట్స్ సినిమా రిచ్ నెస్ ని చూపిస్తున్నాయి. హీరోయిన్ సంయుక్తతో ఆది పినిశెట్టి వంటి భారీ తారాగణం ఇందులో ఉంది. విలన్ గా ఆది ఏదో దుష్ట శక్తుల అధిపతిగా కనిపించడం మరో హైలెట్. ఏకంగా అఘోర మీదకు బుతాలను వదలడం వంటి సీన్స్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. ఒక పవర్ ఫుల్ నెగిటివ్ ఫోర్స్ ని బాలయ్య ఢీకొట్టబోతున్నాడని మాత్రం అర్థమవుతోంది. చెడు ఎక్కువైతే అక్కడ అఖండ ఉంటాడు అనే కాన్సెప్ట్ ని ఈసారి మరింత గ్లోబల్ లెవెల్ లో ప్రజెంట్ చేయబోతున్నారు. విజువల్ ఎఫెక్ట్స్ కూడా ఫస్ట్ పార్ట్ కంటే మెరుగ్గా ఉన్నాయనిపిస్తోంది. కాబట్టి పాన్ ఇండియా రేంజ్ కి సరిపోయే అంశాలు ఉన్నట్లు అర్థమవుతుంది. నిర్మాణ సంస్థ 14 రీల్స్ భారీగానే ఖర్చు చేసినట్లు అర్థమవుతుంది. మొత్తానికి 'అఖండ 2' ట్రైలర్ అంచనాలకు తగ్గట్టుగానే ఉంది. మాస్ ఆడియన్స్ కి కావాల్సిన ఎలివేషన్స్, ఫ్యామిలీ ఆడియన్స్ కి కావాల్సిన సెంటిమెంట్, డివోషనల్ టచ్.. అన్నీ ఇందులో ఉన్నాయి. డిసెంబర్ 5న రిలీజ్ కానున్న ఈ సినిమా, 'అఖండ' రికార్డులను బ్రేక్ చేస్తుందా లేదా అనేది చూడాలి.

## భారీ బడ్జెట్ చిత్రాలు.. అప్ కమింగ్ కాస్ట్లీ మూవీ లిస్ట్ ఇదిగో!



బడ్జెట్.. ఇది భాషతో సంబంధం లేకుండా ఏ సినిమాకు అయిన మెయిన్ పిల్లర్. అది లేకుంటే మూవీనే లేదు. దాని చుట్టూనే అంతా తిరుగుతుంది. అయితే ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో బడ్జెట్ రేంజ్ కొన్నాళ్ల క్రితం మారిపోయింది. ఒకప్పుడు తక్కువలోనే బడ్జెట్ లెక్కలు ఉండేవి. కానీ ఇప్పుడు వందల వేల కోట్ల వ్యయంతో అనేక సినిమాలు రూపొందుతున్నాయి. భారీ స్థాయిలో నిర్మించేందుకు, పెద్ద ఎత్తున ఆడియన్స్ ను ఆకట్టుకునేందుకు హై బడ్జెట్ లు పెడుతున్నారు ఆయా చిత్రాల నిర్మాతలు. అలా ఇప్పుడు ఇండియన్ ఫిల్మ్ ఇండస్ట్రీలో పలు భారీ బడ్జెట్ సినిమాలు రూపొందుతున్నాయి. త్వరలోనే ఆ కాస్ట్లీ సినిమాలు.. థియేటర్స్ లో విడుదలవుతున్నాయి. మరి టాప్-5 అత్యంత బడ్జెట్ తో తెరకెక్కుతున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

**2 భాగాలు.. రూ.4000 కోట్లు..** ఆ లిస్ట్ టాప్ ప్లేస్ రామాయణ మూవీదే. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఆ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. బాలీవుడ్ స్టార్ హీరో రణబీర్ కపూర్, నేచురల్ బ్యూటీ సాయిపల్లవి లీడ్ రోల్స్ లో నటిస్తుండగా.. నితీష్ తివారి తెరకెక్కిస్తున్నారు.

ఏకంగా రూ.4000 కోట్లతో నిర్మాత నమిత్ మల్హోత్రా సినిమాను భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. ఆ విషయాన్ని ఆయనే స్వయంగా చెప్పారు. మొదటి పార్ట్ 2026 దీపావళికి, రెండోది 2027 దీపావళికి విడుదల కానుంది.

**జక్కన్న వారణాసి బడ్జెట్ ఎంతంటే?...** తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసిన దర్శకధీరుడు రాజమౌళి.. ఇప్పుడు వారణాసి మూవీతో బిజీగా ఉన్నారు. సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా లీడ్ రోల్స్ లో గ్లోబల్ అడ్వెంచర్ డ్రామాగా సినిమాను రూపొందిస్తున్నారు. అత్యాధునిక టెక్నాలజీ, హై ప్రొడక్షన్ వాల్యూస్ తో రూపొందుతున్న ఆ మూవీ బడ్జెట్ రూ.1000 కోట్లుగా తెలుస్తోంది. కేఎల్ నారాయణ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్న ఆ సినిమా.. 2027లో థియేటర్స్ లోకి రానుంది.


**అల్లు అర్జున్- అట్లీ మూవీ..** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్ లో రూపొందుతున్న సైన్స్ ఫిక్షన్, ఫాంటసీ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే వివిధ షెడ్యూళ్లు పూరి అయినట్లు తెలుస్తోంది. సినిమాలో నెవ్వర్ బిఫోర్ అనేలా టెక్నాలజీ యూజ్ చేస్తున్నట్లు ఇప్పటికే క్లారిటీ వచ్చేసింది. వీఎఫ్ఎక్స్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని వినికిడి. అయితే మూవీని సన్ పిక్చర్స్ బ్యానర్ పై కళానిధి మారన్.. దాదాపు రూ.800 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నట్లు సమాచారం.

**కల్కి 2898 ఏడీ సీక్వెల్ సంగతేంటి?...** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబోలో రూపొందిన కల్కి 2898 ఏడీ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచిన విషయం తెలిసిందే. ఆ సినిమాకు సీక్వెల్ కూడా తెరకెక్కనుంది. ఇప్పటికే కొన్ని సీన్స్ ఫస్ట్ పార్ట్ టైమ్ లో మేకర్స్ చిత్రీకరించగా.. మరికొద్ది నెలల్లో రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలవ్వనున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో ప్రముఖ వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వనీదత్ నిర్మిస్తున్న కల్కి సీక్వెల్ బడ్జెట్ రూ.700 కోట్లు అని సమాచారం.

**బాహుబలి: ది ఎటర్నల్ వార్ పార్ట్ 1...** పై నాలుగు సినిమాల తర్వాత ప్రస్తుతం రూపొందుతున్న మరో హై బడ్జెట్ మూవీ బాహుబలి: ది ఎటర్నల్ వార్ పార్ట్ 1. 3%ఐ% యానిమేషన్ సినిమాగా తెరకెక్కుతున్న ఆ ప్రాజెక్టు బడ్జెట్ రూ.120 కోట్లకు పైగా ఉంటుందని ఇటీవల సమర్పకుడిగా వ్యవహరిస్తున్న రాజమౌళి వెల్లడించారు. ఇషాన్ శుక్లా దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. 2027లో ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి ఈ ఐదు హై బడ్జెట్ సినిమాలు.. ఎలా ఆకట్టుకుంటాయో.. ఎంతటి వసూళ్లను సాధిస్తాయో వేచి చూడాలి.

## ఏలియన్ వలలో చిక్కిన తమన్నా.. కాపాడేదెలా?

తనదైన గ్లామ్, డ్యాన్స్ మూవ్స్ తో కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టించే అందాల భామ తమన్నా ఇప్పుడు ఏలియన్ చేతికి చిక్కింది. ఇప్పుడు ఏలియన్ వల నుంచి విడిపించడం ఎలా?.. ఇదిగో ఇక్కడ తమన్నా ఫ్యాషన్ సెన్స్ చూశాక, యూత్ ఫీలింగ్ ఇది. ప్రయోగాలు చేయనిదే కొత్తదనం సాధ్యపడదు. ఫ్యాషన్ ప్రపంచంలో సృజనాత్మకతకు అంతూ దరీ లేదనడానికి ఇది ఒక చక్కని ఉదాహరణ. తాజాగా తమన్నా ఎంపిక చేసుకున్న ఆల్ బ్లాక్ డిజైనర్ డ్రెస్ చూడగానే, ఎవరు ఈ ఏలియన్ సుందరి? అనే సందేహం కూడా కలుగుతుంది.



ఇతర గ్రహం నుంచి ఈ భూమ్మీదికి వచ్చిందా? అంటూ మాట్లాడుకునేంత ట్రిక్కీగా కనిపిస్తోంది. పండోరా గ్రహం మీద దిగిన ఏలియన్ కన్యలాగా కూడా కనిపిస్తోంది! అంటూ అభిమానులు కామెంట్ చేస్తున్నారు. మొత్తానికి తమన్నా ప్రయోగం సూపర్‌హిట్ అయింది. ప్రస్తుతం ఈ యూనిక్ లుక్ ఇంటర్నెట్ తుఫాన్ లా దూసుకెళుతోంది. తమన్నా కెరీర్ మ్యాటర్ కి వస్తే, అటు ఉత్తరాది సహా దక్షిణాది సినిమాలతో కెరీర్ రన్ కొనసాగిస్తోంది. ప్రస్తుతం నాలుగు సినిమాలతో మిల్కీ వైట్ బ్యూటీ తమన్నా బిజీ బిజీగా ఉంది. అజయ్ దేవగన్ సరసన రేంజర్ అనే చిత్రంలో నటిస్తోంది. రోమియో, వివాన్ అనే చిత్రాలతోను బిజీగా ఉంది. రోహిత్ శెట్టి దర్శకత్వం వహిస్తున్న యాక్షన్ డ్రామాలోను తమన్నా నటిస్తోంది.

## గ్లామర్ తో కట్టిపడేస్తున్న ప్రియా ప్రకాష్ వారియర్..!

ఒక్క షాట్ తో ఓవర్ నైట్ లోనే స్టార్ సెలబ్రిటీ అయిపోయింది ప్రియా ప్రకాష్ వారియర్.. కన్నుగీటుతూ కుర్రకారు హృదయాలపై బాణాలు సంధించింది. ఒక్క మాటలో చెప్పాలి అంటే కుర్రకారుకు నేషనల్ క్రష్ అయిపోయింది అనడంలో సందేహం లేదు. అంతలా భారీ పాపులారిటీ సంపాదించుకున్న ప్రియా ప్రకాష్ వారియర్ హీరోయిన్గా నిలదొక్కుకోవడంలో కాస్త వెనకడుగు వేస్తోందనే చెప్పాలి. ముఖ్యంగా కథల ఎంపిక విషయంలో కూడా ఆచితూచి అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది . అందులో భాగంగానే ఇప్పుడు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫాలోవర్స్ ను పెంచుకునే ప్రయత్నం చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. ఇప్పుడు సోషల్ మీడియాలో నిత్యం ఆక్టివ్ గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ఫాలోవర్స్ ను ఆకట్టుకున్న ఈ చిన్నది .. అందులో భాగంగానే తాజాగా గ్రీన్ కలర్ చుడీదార్ ధరించింది. ఇందులో ఈమె తన ఎద అందాలను హైలెట్ చేస్తూ హాట్ ప్రదర్శన ఇచ్చింది. ఆ మెడను ఫుల్ ఫిల్ చేయడానికి ప్రత్యేకంగా డైమండ్స్ తో డిజైన్ చేసిన స్టెప్స్ హారాన్ని ధరించింది. ముఖ్యంగా ఈ హారం ఈమె అందాన్ని మరింత హైలెట్ చేస్తోందని చెప్పవచ్చు. మొత్తానికి అయితే



ప్రియా ప్రకాష్ వారియర్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా.. ముఖ్యంగా ఆమె కళ్ళకు అభిమానులు ఫిదా అవుతున్నారు. కాటుక కళ్ళతో మళ్లీ మాయ చేస్తోంది ఈ చిన్నది అంటూ ఇంస్టాగ్రామ్ వేదికగా కామెంట్ సెక్షన్ నింపేస్తున్నారు. ఏది ఏమైనా ప్రియా ప్రకాష్ వారియర్ షేర్ చేసిన ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారుతున్నాయని చెప్పవచ్చు. ప్రియా ప్రకాష్ వారియర్ విషయానికి వస్తే.. 1999 అక్టోబర్ 28న కేరళ పుంకున్నంలో జన్మించింది. ఈమె తండ్రి కేంద్ర ఎక్సైజ్ శాఖ ఉద్యోగి ప్రకాష్ వారియర్, తల్లి గృహిణి. త్రిసూర్ లోని సందీప్ విద్యానికేతన్ లో పాఠశాల విద్యను పూర్తి చేసిన ఈమె.. 2018లో త్రిసూర్ లోని విమల కళాశాలలో బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ కోర్సులో చేరింది. 2019లో వచ్చిన మలయాళ చిత్రం 'ఒరు ఆధార్ లవ్' అనే సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైన ప్రియా ప్రకాష్ వారియర్.. అందులో కన్ను గీటి ఓవర్ నైట్ లోనే వైరల్ అయిపోయింది.. అంతేకాదు 2018లో ఇండియాలో గూగుల్ ద్వారా అత్యధికంగా సెర్చ్ చేయబడిన నటిగా కూడా పేరు సొంతం చేసుకుంది. ఈమె తమిళ్ యాక్షన్ కామెడీ చిత్రమైన గుడ్ బ్యాడ్ అగ్లీలో కూడా నటించింది. 2021లో వచ్చిన తెలుగు చిత్రం చెక్ ద్వారా తెలుగు సినిమా తెరకు పరిచయమైన ఈమె ఇందులో నితిన్, రకుల్ ప్రీత్ సింగ్ హీరో హీరోయిన్ గా నటించగా.. తేనె పట్టుకొనే అమ్మాయి పాత్రలో నటించింది. అలాగే ఈ ఏడాది విష్ణుప్రియ అనే కన్నడ సినిమాలో కూడా నటించింది. ప్రస్తుతం ఈమె చేతిలో మరో 2, 3 చిత్రాలు ఉన్నట్లు సమాచారం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536